TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

మంగళవారం, అక్టోబర్ 27, 2026 | సంపుటి - 21 | సంచిక 16 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

డ్రగ్స్‌పై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

గచ్చిబౌలిలో డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్, అక్టోబరు 26 : హైదరాబాద్‌లో గంజాయి విక్రయాలపై ఈగల్ ఫోర్స్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు జరిపారు. ఈ తనిఖీల్లో ఎల్‌బీఎస్ నగర్‌లో ఇంటి నుంచే గంజాయి విక్రయిస్తున్న 75 ఏళ్ల షేక్ జాతెన్ బీని అరెస్ట్ చేశారు. నిందితురాలి ఇంట్లో 41 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమె దగ్గరి నుంచి మొత్తం 179.1 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. ఈ ఆపరేషన్‌లో 70 మంది గంజాయి వినియోగదారులను గుర్తించారు. 2లో

స్థానిక సంస్థల ఎన్నికలలో అక్రమాలపై నిష్పక్షపాత

విచారణ జరిపించాలి

వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి

అమరావతి : ఏపీలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్‌లకు వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి లేఖ రాశారు. ఏపీ స్థానిక ఎన్నికల్లో అక్రమలు, హింస, నామినేషన్ అడ్డగింతలను వివరించారు. తిరుపతి, కడప, చిత్తూరు, అన్నమయ్య తదితర జిల్లాల్లో ప్రతిపక్ష అభ్యర్థులపై బెదిరింపు, దాడులకు దిగారని ఫిర్యాదు చేశారు. పుంగనూరులో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిపై దాడి, వాహనాలు ధ్వంసం, నిప్పంటించడం వంటి హింసాత్మక ఘటనలు జరిగాయని పేర్కొన్నారు. 222 వార్డుల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేక పోవడం వెనుక కూటమి నాయకుల బెదిరింపులు 2లో

ఏపీకి కేంద్రం భారీ సాయం

రూ.27, 370 కోట్ల గ్రీన్‌ఎనర్జీ ప్రాజెక్టుకు ఆమోదం

ఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం భారీ సాయం అందిం చింది. ఏపీలో రూ.27,370 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న భారీ విద్యుత్ ప్రసార ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధా నించడమే లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ కారిడార్-3కు ఆమోదించింది. ఏపీలో గ్రీన్ ఎనర్జీ రంగానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కార్ ఊతమిచ్చింది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని విస్తరించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్ కింద ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. రాష్ట్రవ్యాప్తంగా 7,872 సర్క్యూట్ కిలోమీటర్ల విద్యుత్ లైన్లు, రామాయపట్నం, కొప్పాకలలో కొత్తగా 400 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో విద్యుత్ ప్రసార వ్యవస్థ ఆధునికీకరణకు మోదీ సర్కార్ ఆమోదం తెలిపింది. రూ. 27,370 కోట్ల విలువైన ప్రాజెక్టుకు ఆమోదించింది. 9,500 వీఏ సామర్థ్యంతో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం జరగనుంది. 2029-30 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రణాళికలను కేంద్రం రచించింది. మిగతా 2లో



ఆన్‌లైన్‌లో

దుష్ప్రచారం

సైబర్ క్రైమ్‌కి ఫిర్యాదు చేసిన విరోష్ టీం

విజయ్ దేవరకొండ, రష్మికపై ఆన్‌లైన్‌లో జరుగుతున్న దుష్ప్రచారంపై వారి టీం సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ డిసిపికి ఫిర్యాదు చేసింది. 'కాఫీ విత్ కరణ్' ప్రోగ్రాంలో విజయ్, రష్మిక వ్యాఖ్యలను వక్రీకరిస్తూ కొందరు ఉద్దేశపూర్వ కంగా అసత్య ప్రచారం చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తమ ఫిర్యాదులో పేర్కొంది. ఈ దుష్ప్రచారం ఇబ్బందులు కలగజేసిందని వారి టీమ్ ప్రతినిధి పేర్కొన్నారు. 2లో

ప్రతికూల ప్రభావం లేకపోతే ఓకే

- తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర సీఎం సానుకూలం!

హైదరాబాద్ : తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశంపై ముంబయి వేదికగా తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు సమావేశం జరిగింది. తెలంగాణ నీటి అవసరాలు, వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రను కోరారు. తమ రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి గతంలో కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు తమకు అభ్యంతరం లేదని, తెలంగాణ నీటి అవసరాలకు సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. కేంద్ర జలసంఘం అధ్యయనంతో పాటు రెండు రాష్ట్రాల అధికారులతో కూడిన కమిటీ అన్ని అంశాలను పరిశీలించాలని ప్రతిపాదించారు. ముంపు, ప్రభావిత ప్రాంతానికి సంబంధించి ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్ వేదికగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపు అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో

కేటీఆర్ కన్ను పడితే మటాషే

ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ తీవ్ర వాఖ్యలు

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తెలంగాణ ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ పేరు మార్చుకుని హీరోయిన్లతో దుబాయ్‌కు వెళ్తున్నారని ఆరోపించారు. ఈరోజు సీఎల్పీ మీడియా హాల్‌లో మాట్లాడుతూ.. 'రామ్ కేటీగా, కే రామ్‌గా పేర్లు మార్చుకుని కేటీఆర్ దుబాయ్ వెళ్లారు. ఈ ప్రయాణంలో ఇద్దరు హీరోయిన్లు సహా నలుగురు ప్రముఖులు ఆయన వెంట ఉన్నారు. హీరోయిన్లతో పాటు హైదరాబాద్ నుంచి నేరుగా 2లో

అర్నాబ్ తుపాను ప్రభావం

- తెలంగాణకు భారీ వర్ష సూచన

పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలను జారీ

ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను దాటే అవకాశం

అప్రమత్తమైన టీజీఎస్‌పీడీసీఎల్

హైదరాబాద్ : వర్షాలు లేక ఎండిపోతున్న పంటలు చూసి అల్లాడుతున్న రైతులకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుభవార్త చెప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో రేపు, ఎల్లుండి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. రేపు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట 2లో

తనూజ హత్య కేసులో

రెండు టీమ్‌ల హస్తం

నేపాల్‌కు మారువేషంలో వెళ్లిన సిట్ అధికారులు

నిందితులపై 5 నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్‌లు

పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్

హైదరాబాద్ : హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఈ ఏడాది మే 7వ తేదీన విశాంత్ర ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజా హత్య జరిగిందని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. ఈ ఘటన జరిగిన 15 రోజుల్లో ఇద్దరిని అరెస్ట్ చేశామని తెలిపారు. సోమవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ ఘటన జరిగిన కొద్ది రోజుల్లోనే సునీల్, దిలీప్‌ను మొదటగా మిగతా 2లో

ఏపీకి నీళ్లు వదిలి తెలంగాణకు

కరువు తెచ్చిందే కాంగ్రెస్

మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ : ఏపీకి నీళ్లు వదిలి తెలంగాణకు కరువు తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 100 రోజులు 24 గంటలు నిరాటంకంగా పట్టిసీమ మోటార్ల ద్వారా నీళ్లెత్తిర్రు.. గోదావరి, కృష్ణా డెల్టాలను కాపాడుకున్నరు.. అని పత్రికల్లో చదివాం. చంద్రబాబు నాయుడు 100 రోజులు పట్టిసీమ ద్వారా నీళ్లు ఎత్తి ఏపీకి కరువు లేకుండా చేశారు. మరి అదే గోదావరి నదిమీద పట్టిసీమ పైభాగంలో సమ్మక్క బ్యారేజ్ కట్టి, దేవాదుల ఫేజ్ 3 కూడా పూర్తి చేసి మీ చేతిలో పెట్టారు. మరి మీరు ఎన్ని రోజులు మోటార్లు నడిపారు. ఎన్ని గంటలు మోటార్లు నడిపారు.. ఎన్ని నీళ్లు ఎత్తారో ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మనం ఒడిసిపడితే కిందికి పట్టిసీమకు మిగతా 2లో

తెలంగాణ చరిత్రను తెలిపే వేదికగా

ఖేలో ఇండియా యూత్ గేమ్స్

పర్యాటక శాఖ సన్నాహాలు!

అథ్లెట్లకు పర్యాటక ప్రాంతాల గురించి తెలిసేలా

తెలంగాణ వైవిధ్యాన్ని తెలిపేందుకు గొప్ప అవకాశం

దేశానికి దిక్సూచిగా నిలవాలి : మంత్రి వకిటి శ్రీహరి

హైదరాబాద్ : తెలంగాణ వేదికగా డిసెంబరులో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026'ను పర్యాటక అవకాశంగా మలచుకునేందుకు పర్యాటక శాఖ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. సుమారు 7 వేల మందికి పైగా క్రీడాకారులు, ప్రతినిధులు, అంతర్జాతీయ అతిథులు హాజరుకానున్న నేపథ్యంలో పర్యాటక శాఖ ఈవెంట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ క్రీడలు డిసెంబరు 11 నుంచి 22 వరకు హైదరాబాద్ సహా ఆరు నగరాల్లోని వివిధ వేదికల్లో జరగనున్నాయి. గచ్చిబౌలి స్టేడియంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్? ప్రారంభోత్సవ వేడుకలు జరగనుండగా, ముగింపు వేడుకలకు

డ్రగ్స్‌పై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

66 మందికి వైద్య పరీక్షలు జరపగా.. ఈ పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లుగా పాజిటివ్‌గా నిర్ధారించారు. గంజాయి వినియోగదారుల్లో ముగ్గురు బాలురని, మరో 65 మందిని పునరావాస కేంద్రాలకు ఈగల్ అధికారులు తరలించారు. అలాగే, గాంధీ రిహాబిలిటేషన్ సెంటర్‌కు 45 మందిని, ఆమనగల్ కేంద్రానికి 15 మంది, కొత్తూరు కేంద్రానికి ఐదుగురిని తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి సరఫరా మూలాలు, ఇతర వ్యక్తుల పాత్రపై ఈగల్ అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలు షేక్ జాతెన్ బీపై గతంలో మరో ఏడు కేసులు ఉన్నట్లు గుర్తించారు. అలాగే, గచ్చిబౌలిలో తెలంగాణ టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీలు చేసి డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఖాజాగూడా సర్వీస్ రోడ్డులో డ్రగ్స్ విక్రయిస్తుండగా ఫొటోగ్రాఫర్ ఏ. సాయిరామ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు సాయిరామ్ నుంచి 4.45 గ్రాముల వీణహీూ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గ్రాము రూ.10 వేల చొప్పున అతడు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి కారు, డిజిటల్ వేయింగ్ మిషన్, 2 సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు మహేశ్‌రెడ్డి, తాండ్ర హరిశ్చంద్ర కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందినవారిగా గుర్తించారు.

ఏపీకి కేంద్రం భారీ సాయం

ఏపీలోని పోర్టు ప్రాంతాలు, పారిశ్రామిక క్లస్టర్లకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రామాయ పట్నంలో 400 ఓఎ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

తనూజ హత్య కేసులో రెండు టీమ్‌ల హస్తం

అరెస్ట్ చేశామని చెప్పుకొచ్చారు. ఈ కేసులో మే 19వ తేదీన స్పెషల్ సిట్ ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. సిట్ అధికారులు అనేక ప్రాంతాలకు వెళ్లి తనిఖీలు చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. నేపాల్‌లోని నిందితుల దగ్గరకు మారువేషంలో వెళ్లి సిట్ అధికారులు చాలా రిస్క్ తీసుకున్నారని చెప్పారు. ఈ కేసులో నలుగురు కీలక నిందితులను అరెస్ట్ చేశామని వెల్లడించారు. కల్పనా 10 నెలల నుంచి విశాంత్ర ఐపీఎస్ ఇంట్లో పని చేసిందని తెలిపారు. ఆమెనే ఈ కేసులో కీలక పాత్ర పోషించిందని అన్నారు. ఐపీఎస్ భార్య హత్య కోసం బెంగుళూరు, ముంబై నుంచి ఒక టీమ్ వచ్చిందని చెప్పారు. మొత్తం ఏడుగురు నిందితులు తనూజ హత్య కేసులో పాల్గొన్నారని అన్నారు. రెండు టీములుగా విడిపోయి ఈ ఘాతుకానికి పాల్పడ్డారని చెప్పారు. తనూజ నోట్లో గుడ్డలు కుక్కి, చేతులు కాళ్లు కట్టేశారని వెల్లడించారు. దీంతో ఊపిరి ఆడక తనూజ చనిపోయిందని.. చాలా కేసుల్లో ఈ నేపాలీలు నేరస్థులుగా ఉన్నారని ప్రస్తావించారు. కల్పనా, గణేశ్, చంద్ర బహదూర్, గణేశ్ బహదూర్ షాహీలను ఇప్పుడు అరెస్ట్ చేశామని తెలిపారు. ఈ నిందితులపై 5 నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్‌లు పెట్టామని సీపీ సజ్జనార్ తెలిపారు. వీరిలో జీవన్ చంద్ అనే మరో నేపాలిని కూడా అరెస్ట్ చేశామని.. అతడిపై 8 కేసులు ఉన్నాయని అన్నారు. నేపాల్ వ్యక్తులు హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడి అడ్రసుతో ఆధార్ కార్డులు తయారు చేసుకుంటున్నారని తెలిపారు. వీరిని పనికి పెట్టుకుంటే నేపాల్ వెబ్‌సైట్‌లో వారి వివరాలు ఉన్నాయో, లేదో పరిశీలించాలని సూచించారు. ఇదే గ్యాంగ్ బెంగుళూరు, గుర్గావ్‌లో భారీ చోరీ చేసేందుకు ప్లాన్ చేసిందని వెల్లడించారు. ఈలోపే తాము పట్టుకున్నామని తెలిపారు. నేపాలీలు తక్కువ జీతానికే పని చేయడానికి వస్తున్నారని.. వారిని పనిలో పెట్టుకోవడం సరికాదని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

కేటీఆర్ కన్ను పడితే మటాషే

దుబాయ్ వెళ్తే అందరికి తెలిసిపోతుంది కాబట్టి కేటీఆర్ బెంగళూరు, ఢిల్లీ నుంచి దుబాయ్‌కి వెళ్లారు' అని బల్మూరి వెంకట్ ఆరోపణలు చేశారు. అనంతరం కేటీఆర్‌పై బల్మూరి వెంకట్ తీవ్ర విమర్శలు చేశారు.'వ్యక్తిగత జీవితాల గురించి మాట్లాడడం ఎందుకని ఓపిక పడుతున్నాను. ఇంట్లో బెంగళూరు, ఢిల్లీకి వెళు _న్నాని అబద్ధాలు చెప్పి.. కేటీఆర్ దుబాయ్ వెళ్లారు. నేను చెప్పేది అబద్ధమని ఆయన తన కొడుకుపై ఒట్టేసి చెప్పగలరా..?' అని ప్రశ్నించారు. 'కేటీఆర్ ఒక రాక్షసుడు. ఆయనకు మహిళల ఉసురు తగులుతుంది. కేటీఆర్ కన్ను పడితే అంతా మటాషే. ఆయన కారణంగా తెలంగాణలో సినిమా తీయాలంటే నిర్మాతలు, డైరెక్టర్లు భయపడుతున్నారు. వారు వేరే రాష్ట్రాలకు వెళ్లి షూటింగ్ చేసుకుంటున్నారు' అని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ మండిపడ్డారు. ఆ తరువాత బల్మూరి వెంకట్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పలు విమర్శలు చేశారు. తెలంగాణ నీటి కొరతకు కారణం కేసీఆర్ అని ఆరోపించారు. గతంలో కేసీఆర్ వైసీపీ అధ్యక్షుడు జగన్‌తో మంతనాలు ఎందుకు నడిపారని ప్రశ్నించారు. ఆ పార్టీ ఎమ్మెల్యే రోజా దగ్గర రొయ్యల పులుసు ఎందుకు తిన్నారని నిలదీశారు.

అయ్యప్ప ఆలయం నెయ్యిలో అక్రమాలు...

తిరువనంతపురం, అక్టోబరు 26 : శబరిమల అయ్యప్ప ఆలయానికి సరఫరా చేయాల్సిన 11 వేల లీటర్ల నెయ్యిని మళ్లించి.. దాని స్థానంలో తక్కువ ధర కలిగిన ఉత్పత్తిని సరఫరా చేసినట్లు ఆరోపణలు రావడం సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్‌ను అధికారులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్, లియో ట్రేడర్స్ సంస్థలకు అసలు నెయ్యిని తరలించినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. నకిలీ ఇన్వాయిస్‌లు ఉపయోగించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాల వల్ల ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డుకు సుమారు రూ.2.5 కోట్ల నష్టం జరిగినట్లు అంచనా. కేరళ హైకోర్టు ఆదేశాలతో దర్యాప్తు కొనసాగుతోంది.కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప స్వామి ఆలయానికి సరఫరా చేయాల్సిన నెయ్యి వ్యవహారంలో భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయానికి చేరాల్సిన సుమారు 11 వేల లీటర్ల మిల్మా నెయ్యిని పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. దాని స్థానంలో తక్కువ ధర కలిగిన నెయ్యిని సరఫరా చేసినట్లు ఆరోపణలు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో రవాణా కాంట్రాక్టర్ ఎస్ఎస్ బినును కేరళ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఈ అక్రమాల వల్ల ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ)కి సుమారు రూ.2.5 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.శబరిమల ఆలయంలో స్వామివారికి నైవేద్యంగా సమర్పించే అరవణ పాయసంలో నెయ్యి కీలక పదార్థం. ఎర్ర బియ్యం, బెల్లం, నెయ్యితో తయారు చేసే ఈ తీపి ప్రసాదాన్ని భక్తులకు అందిస్తారు. ఈ పాయసం తయారీ కోసం ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు కేరళ కో ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్‌కు చెందిన మిల్మా బ్రాండ్ నెయ్యిని కొనుగోలు చేసింది. 2025 తీర్థయాత్ర సీజన్‌లో శబరిమల ఆలయానికి నెయ్యిని రవాణా చేసే కాంట్రాక్టును ఎస్ఎస్ బినుకు అప్పగించారు. అంతకుముందు పథనంతిట్టలోని మిల్మా డెయిరీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టును నేరుగా కేటాయించినట్లు సమాచారం. ఈ సరఫరా ప్రక్రియలో టెండర్లు లేదా కొటేషన్లు ఆహ్వానించకపోవడంపై కూడా ప్రశ్నలు తలెత్తాయి.విజిలెన్స్ అధికారుల ఆరోపణల ప్రకారం.. శబరిమలకు పంపాల్సిన అసలు మిల్మా నెయ్యిని తమిళనాడులోని రెండు సంస్థలకు మళ్లించారు. దాని స్థానంలో తక్కువ ధర కలిగిన ఉత్పత్తిని ఆలయానికి సరఫరా చేసినట్లు దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. తమిళనాడులోని ఒట్టంచత్రం ప్రాంతంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్, లియో ట్రేడర్స్ సంస్థలకు అసలు నెయ్యి చేరినట్లు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో నకిలీ ఇన్వాయిస్‌లతో పాటు ఇతర తప్పుడు పత్రాలను ఉపయోగించి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.11 వేల లీటర్ల నెయ్యి మళ్లింపు, దాని స్థానంలో చౌక ఉత్పత్తిని సరఫరా చేసిన వ్యవహారం వల్ల ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డుకు సుమారు రూ.2.5 కోట్ల ఆర్థిక నష్టం జరిగినట్లు విజిలెన్స్ అధికారులు అంచనా వేశారు.

ప్రతికూల ప్రభావం లేకపోతే ఓకే

చర్చలు చాలా ఫలవంతంగా ముగిశాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ఎక్స్ వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి తమ ప్రతిపాదనను పెద్ద హృదయంతో పరిశీలించారని ఫడణవీస్?కు కృతజ్ఞతలు చెప్పారు. సాంకేతిక అంశాలతో పాటు ముంపు అంశాలపై అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీ ఏర్పాటు చేసేందుకు ఇరువైపులా అంగీకారం కుదిరిందని అన్నారు. మహారాష్ట్ర, అక్కడి ప్రజల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుంటూనే జాతీయ దృక్పథంతో ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, ప్రత్యేకించి గిరిజనుల జీవితాలను మార్చేందుకు తన వంతు సహకరిస్తానని ఫడణవీస్ హామీ ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతిపాదనలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి రాష్ట్ర ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. సమావేశం ప్రారంభంలో ప్రజెంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రస్తావించిన ఆయన సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను పేర్కొన్నారు. ఆదిలాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగినప్పటికీ ఆశించిన పురోగతి లేదని తెలిపారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందన్న ఆయన ఆ ఎత్తుతో నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని వివరించారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమని, గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అక్కడ అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. వెనుకబడిన అటవీ ప్రాంతమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పేర్కొన్నారు. కుమురం భీం సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాట కాలం నుంచి ఆ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదన్న రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నా సీఎం రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందని తెలిపారు. వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్న ఆయన పరస్పర ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. రాష్ట్ర ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన దేవేంద్ర ఫడణవీస్ తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోమారు పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని మహారాష్ట్ర సీఎం తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. ప్రతికూల ప్రభావం లేకపోతే మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదని ఫడణవీస్ తెలిపారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట విషయంలో కేంద్ర జలసంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని, సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందని అన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలని అన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించి ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు.

గ్లోబల్ సమ్మిట్?కు రావాలని ఆహ్వానం దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్?లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్?ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన ఫడ్నవీస్ సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

ఆన్‌లైన్‌లో దుష్ప్రచారం

ఫేక్ పోస్టులకు సంబంధించిన సోషల్‌మీడియా ఖాతాలు, స్క్రీన్ షాట్స్, ఇతర వివరాలను పోలీసులకు అందజేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు వారికి హామీ ఇచ్చారు.నటి రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ గురించి సోషల్ మీడియాలో ఇటీవల జరుగుతున్న చర్చ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా వీరిద్దరూ కలిసి పాల్గొన్న 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో రష్మిక చేసిన వ్యాఖ్యలు నెట్టింట చర్చకు దారితీశాయి. విజయ్‌ను పెళ్లి చేసుకోవడానికి తాను అతడికి వందసార్లు ప్రపోజ్ చేసినట్లు ఆమె సరదాగా చెప్పడంతో కొందరు నెటిజన్లు విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో రష్మిక సోషల్ మీడియాలో సుదీర్ఘమైన పోస్ట్ పెట్టి తన అభిప్రాయాలను వెల్లడించారు. తమ బంధం గురించి అసలు విషయం ఏమిటో వివరించే ప్రయత్నం చేశారు. తన గురించి, విజయ్ గురించి ఇంటర్నెట్‌లో జరుగుతున్న చర్చపై రష్మిక స్పందించారు. సాధారణంగా ఇలాంటి విషయాలపై తాను స్పందించనని, ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. ఇతరుల అభిప్రాయాలను చదివి, విషయాలను మరో కోణంలో అర్థం చేసుకోవడానికి కూడా ప్రయత్నిస్తానని తెలిపారు. అయితే తమ ఇంటర్వ్యూపై ప్రస్తుతం జరుగుతున్న చర్చ అభిప్రాయాల వ్యక్తీకరణలా కాకుండా, కోపాన్ని వెళ్లగక్కడానికి ఒకరిని లక్ష్యంగా చేసుకున్నట్లుగా అనిపిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అసలు విషయం పక్కదారి పట్టిందని, తమ మాటలను కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. విజయ్‌కు వందసార్లు ప్రపోజ్ చేశానన్న వ్యాఖ్యపై వస్తున్న విమర్శలకు రష్మిక తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తమ బంధంలో ఎన్ని సార్లు ప్రపోజ్ చేశామన్నది, ఎంత సమయం తీసుకున్నామన్నది ముఖ్యమైన విషయం కాదని స్పష్టం చేశారు. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, తమ జీవితంలో కలిసి ముందుకు సాగాలనే నిర్ణయానికి రావడానికి తగినంత సమయం తీసుకున్నామని వివరించారు. పెళ్లి అంటే కేవలం ప్రపోజ్ చేయడం, మోకాళ్లపై కూర్చోవడం లేదా వేలికి ఉంగరం తొడగడం మాత్రమే కాదని రష్మిక పేర్కొన్నారు. కలిసి ఒక జీవితాన్ని, భవిష్యత్తును నిర్మించుకోవడమే తమకు ముఖ్యమని చెప్పారు. తనకు ఏం కావాలో నిర్ణయించుకునే హక్కు తనకు ఉన్నట్లే, విజయ్‌కు కూడా తన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉందని తెలిపారు. విజయ్‌ను తాను ఎంతో ప్రేమిస్తున్నానని చెబుతూ, అవసరమైతే వందసార్లు కాదు.. వెయ్యిసార్లు కూడా ప్రపోజ్ చేస్తానని రష్మిక పేర్కొన్నారు. తన జీవితంలో విజయ్‌కు ఉన్న ప్రత్యేక స్థానాన్ని మరోసారి తెలియజేశారు. తనకు ఉచితంగా సలహాలు ఇస్తూ, తన గురించి ఆందోళన చెందుతున్నట్లు చెబుతున్న వారికి కూడా రష్మిక సమాధానమిచ్చారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు తనకు అండగా నిలిచింది విజయ్ మాత్రమేనని పేర్కొన్నారు. ప్రస్తుతం తన జీవితంలో ఎంతో సంతోషంగా ఉన్నానని, ఆ ఆనందం తన ముఖంలో, నటనలో, సినిమాల్లోనూ కనిపిస్తుందని తెలిపారు. తన జీవితం గురించి తాను చెప్పే మాటలను నమ్మకుండా, ఇంటర్నెట్‌లో ప్రచారమయ్యే కల్పిత కథనాలు, నకిలీ చిత్రాలు, అసత్య ప్రచారాలను కొందరు నమ్మడం బాధ కలిగిస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు.

అర్నాబ్ తుపాను ప్రభావం

యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటలకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఎల్లుండి ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్ బాద్ జిల్లాల్లో అతిభారీ వర్షం పడే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. అర్నాబ్ తుఫాను సాయంత్రానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉంది. అనంతరం, రేపటికి అదే ప్రాంతంలో అతి తీవ్ర తుఫానుగా బలపడే అవకాశం ఉంది. ఆ తరువాత ఈ తుఫాను వాయువ్య దిశగా కదులుతూ, ఎల్లుండి ఉదయం నుంచి మధ్యాహ్నానికి ముందు సమయంలో ఏపీలోని బాపట్ల, విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో ఇది అతి తీవ్ర తుఫానుగా ఉండే అవకాశం ఉంది. ఆ సమయంలో గరిష్ఠంగా నిరంతర గాలుల వేగం గంటకు 115--125 కి.మీ. ఉండవచ్చు. గాలుల వేగం అప్పుడప్పుడు గంటకు 140 కి.మీ. వరకు పెరిగే అవకాశం ఉంది. తుఫాను ప్రభావంపై టీజీఎస్‌పీడీసీఎల్ అప్రమత్తమైంది. అత్యవసర మరమ్మతులకు సిబ్బంది, సామగ్రి సిద్ధం చేయాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి.పాటిల్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. తుఫాను ప్రభావంతో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎండీ జితేశ్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయకుండా, అత్యవసర విధులకు అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలను వెంటనే పరిష్కరించేందుకు సిబ్బంది, వాహనాలు, మరమ్మతు సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తంగా ఉంచి క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో వేగంతో పాటు భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకవద్దని, వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ అంతరాయాలపై ఫిర్యాదుల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్?ను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ చరిత్రను తెలిపే వేదికగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్

ఎల్బీ స్టేడియం వేదికగా మారనుంది. దేశవ్యాప్తంగా 7,500 మందికి పైగా యువ అథ్లెట్లు, కోచ్‌లు ఈ క్రీడా సంబరంలో పాల్గొననున్నారు. అంతేకాకుండా వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు కూడా భాగస్వామ్యులు కావొచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రతిష్ఠాత్మక ఈవెంట్? నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలతో పాటు తెలంగాణ సంస్కృతి, చారిత్రక కట్టడాలు సహా హైదరాబాద్ నగరం గురించి జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. క్రీడాకారులకు పర్యాటక ప్రాంతాల గురించి సమాచారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే అథ్లెట్లకు తెలంగాణ, హైదరాబాద్‌ల ప్రత్యేక వంటకాలను పరిచయం చేయడం, ఆసక్తి ఉన్నవారిని చారిత్రక ప్రదేశాలకు తీసుకెళ్లడం వంటి ప్రణాళికలపై దృష్టి సారిస్తున్నారు. వేలాది మంది క్రీడాకారులు, సహాయక సిబ్బంది రాష్ట్రానికి రానుండటంతో హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా సేవలకు డిమాండ్ పెరుగుతుందని, దీని వల్ల మన రాష్ట్ర ప్రత్యేకతను చాటిచెప్పడానికి ఇదో చక్కని అవకాశమని పర్యాటక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. తెలంగాణ సంస్కృతి, ఆతిథ్యం, పర్యాటక వైవిధ్యాన్ని జాతీయ స్థాయిలో తెలిపేందుకు ఇదో గొప్ప అవకాశమని ఒక సీనియర్ పర్యాటక శాఖ అధికారి తెలిపారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వకిటి శ్రీహరి ఈ క్రీడలకు సంబంధించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. దేశవ్యాప్తంగా తరలివచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్వహించనున్న ఖేలో ఇండియా క్రీడలు దేశం మొత్తానికే దిక్సూచిగా నిలవాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

స్థానిక సంస్థల ఎన్నికలలో అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలి

కారణమని వెల్లడించారు. ఎన్నికల సంఘం వైఖరి, పోలీసుల పక్షపాతంపై నిష్పక్షపాత విచారణ చేపట్టాలని, కేంద్ర బలగాలు, విశ్రాంత న్యాయమూర్తి పర్యవేక్షణతో స్వేచ్ఛాయుత ఎన్నికలు జరిపించాలనిఆయన కోరారు.

ఏపీకి నీళ్లు వదిలి తెలంగాణకు కరువు తెచ్చిందే కాంగ్రెస్

ఆంధ్రాకు నీళ్లు పోనే పోవు కదా..మీరుఎత్తుకున్నంక మిగిలితేనే కిందికి పోవాలే. మరి 100 రోజులు 24 గంటలు పట్టిసీమ మోటార్లు నడిపి ఆంధ్రప్రదేశ్ నీళ్లు ఎత్తింది ఎట్లా..? దేవాదులలో సమ్మక్క బ్యారేజ్ నుంచి మీరు నీళ్లు ఎందుకు ఎత్తలేదని బీఆర్ఎస్ పార్టీ పక్షాన మేం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎల్ నినో పేరిట ప్రజలను భయపెట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేసింది ఏం లేదని హరీశ్ రావు మండిపడ్డారు.

కమలంలో కలవరం...

విశాఖపట్టణం, అక్టోబరు 26 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి భయం పట్టుకుంది. మూడు పార్టీల మధ్య సమన్వయం కుదురుతుందా? అన్నది వారి భయానికి కారణం. ఎందుకంటే గత శాసనసభ ఎన్నికల్లో తమ సీట్లను పొత్తులో భాగంగా తీసుకున్నారని పలు చోట్ల టీడీపీ నేతలు గుర్రుగా ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో వాళ్లు రివెంజ్ తీసుకుంటారేమోనన్న ఆందోళన బీజేపీ నేతల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అనేక నియోజకవర్గాల్లో బీజేపీకి, టీడీపీ నేతలకు మధ్య సయోధ్య లేకపోవడంతో ఈ అనుమానాలకు ప్రధాన కారణంగా చూడాలి.అయితే స్థానిక సంస్థల ఎన్నికలలోనూ పొత్తులో భాగంగా తమ సీట్లలో కమలం పార్టీ వాళ్లు వచ్చి కూర్చున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. బీజేపీకి ఆంధ్రప్రదేశ్ లో ఓటు బ్యాంకు తక్కువే. టీడీపీ, జనసేనలపైనే ఆధారపడి గెలవాల్సి ఉంటుంది. ఒక ఉదాహరణ చూస్తే బీజేపీ నేతలు కూడా అలాగే ఉన్నారు. కోస్తా జిల్లాకు చెందిన ఒక బీజేపీ శాసనసభ్యుడు వైసీపీ నుంచి వచ్చిన వారిని నేరుగా టీడీపీలోకి పంపడం ఈ సందర్భంగా కొందరు గుర్తు చేసుకుని మరీ ఆందోళన చెందుతున్నారు. కూటమిగా పోటీ చేస్తున్నప్పటికీ ఎక్కడో లోపల బ్యాక్ స్టాబింగ్ జరుగుతుందన్న ఆందోళన మాత్రం నెలకొని ఉంది. ఆంధ్రప్రదేశ్ జరుగుతున్న పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలిసి కూటమిగా పోటీ చేస్తున్నాయి.బీజేపీ ఇటీవల తన అభ్యర్థుల తొలి జాబితాను కూడా విడుదల చేసింది అనంతపురం మేయర్ అభ్యర్థిగా కోట్ల అజేష్ బాబు సహా పలు మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాలకు పేర్లు ఖరారు చేసింది. కానీ ఓట్ల బదిలీ అనేది ఈ ఎన్నికల్లో ప్రధాన అంశంగా మారనుంది. ఇప్పుడు పదవి బీజేపీకి అప్పగిస్తే భవిష్యత్ లో ఇదే స్థానాన్ని బీజేపీ కోరుకునే అవకాశముందని కూడా టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో సహాయ నిరాకరణ చేస్తారని, ప్రచారంలో నేతలు పాల్గొన్నా ఓటు బ్యాంకు తమకు బదిలీ కావడంపై అనేక సందేహాలను బీజేపీ రాష్ట్ర నేతలే వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అయితే స్థానికంగా ఉన్న నేతలను సమన్వయం చేసుకుని వెళ్లాలని చంద్రబాబు సూచించినట్లు తెలిసింది.... జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీలు కూడా ఎంత మాత్రం తమకు అనుకూలంగా ఓట్లు వచ్చే విధంగా వ్యవహరిస్తారన్న అనుమానాలను కమలనాథులను పట్టిపీడిస్తున్నాయి. అయితే ఎవరికీ చెప్పుకోలేని బాధ. పార్టీ అగ్రనాయకత్వం మాత్రం పార్టీ పట్ల అనుకూలంగానే ఉంది. కానీ టీడీపీలోని కింది స్థాయి నాయకులు మమాత్రం కలసి రావడం లేదు. శాసనసభ ఎన్నికలు వేరు. స్థానిక సంస్థల పోరు వేరు. రేపు పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ కార్యకర్తలు ఏ మాత్రం తమతో కలసి వస్తారన్న దానిపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ నాయకత్వం కేవలం కూటమిలో పొత్తులో భాగంగా సీట్లు తెచ్చుకోవడంతో సరిపోదు. రేపు పోటీ చేసిన చోట్ల విజయం దక్కకపోతే అది బీజేపీ నేతల వైఫల్యంగానే చూస్తారు. టీడీపీ రాష్ట్ర నాయకత్వంలో మాత్రం కూటమిలోనూ అన్ని పార్టీలు వంద శాతం స్ట్రయిక్ రేట్ సాధించాలని భావిస్తుంది.

సూర్యపేటలో భారీ జేకే మ్యాక్స్ పెయింట్స్

నల్గొండ, అక్టోబరు 26 : తెలంగాణకు మరో భారీ పెట్టుబడి రానుంది. సూర్యాపేట జిల్లాలో జేకే మ్యాక్స్ పెయింట్స్ కంపెనీ రంగుల ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. శనివారం జరిగిన బోర్డు సమావేశంలో ఇందుకు ఆమోదం లభించినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఏడాదికి 75,000 కిలో లీటర్ల పెయింట్ తయారీ సామర్థ్యంతో ఈ కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నాయి. తెలంగాణ పారిశ్రామిక రంగానికి మరో భారీ పెట్టుబడి వరించింది. ప్రముఖ సిమెంట్ తయారీ దిగ్గజం జేకే సిమెంట్స్ అనుబంధ సంస్థ అయిన జేకే మ్యాక్స్ పెయింట్స్ రాష్ట్రంలో కొత్త తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. సూర్యాపేట జిల్లాను వేదికగా ఎంచుకుని రూ. 130 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రతిపాదనను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్లాంట్ నిర్మాణం ద్వారా స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, పెయింట్ల తయారీ విభాగంలో దక్షిణాది మార్కెట్లో కంపెనీ తన పట్టును మరింత బలోపేతం చేసుకోవడానికి మార్గం సుగమం అవనుంది. మరి అందుకు సంబంధించిన వివరాలు తెలుసుకుందాం.జేకే మ్యాక్స్ పెయింట్స్ సూర్యాపేట ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో అధికారిక ఆమోదం లభించినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. పెయింట్ల వ్యాపారాన్ని విస్తరించేందుకు గాను బోర్డు ఇప్పటికే రూ. 600 కోట్ల సమగ్ర నిధుల కేటాయింపునకు అంగీకారం తెలిపిన సంగతి తెలిసిందే. ఆ కేటాయించిన రూ. 600 కోట్ల నిధుల నిల్వల నుంచే ఇప్పుడు సూర్యాపేట జిల్లా ప్లాంట్‌కు అవసరమైన రూ. 130 కోట్ల పెట్టుబడిని సమకూర్చనున్నారు. భారీ పెట్టుబడితో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు.సూర్యాపేటలో ఏర్పాటు చేయనున్న ఈ కొత్త యూనిట్ ఏడాదికి 75,000 కిలో లీటర్ల పెయింట్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని కంపెనీ తెలిపింది. ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచి కేవలం 12 నెలల్లోగా ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.సూర్యాపేట జిల్లాలో జేకే మ్యాక్స్ పెయింట్స్ ప్లాంట్ ఏర్పాటు కావడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థకు అదనపు బలం చేకూరనుంది. ప్లాంట్ నిర్మాణ సమయంలోనూ, ఆ తర్వాత ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయి. రవాణా, లాజిస్టిక్స్, అనుబంధ వ్యాపార రంగాలు విస్తరించే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాలు, మౌలిక వసతులు ఇలాంటి పెద్ద సంస్థలను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

రీ ఎంట్రీపై ఊహాగానాలు

హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించబోతున్నారంటూ కేటీఆర్ చేసిన ప్రకటన తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బలహీనపడుతోందని, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ వైఫల్యాలు దేశంలో మరో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరాన్ని తెస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను సమన్వయం చేస్తూ కీలక పాత్ర పోషిస్తారన్న సంకేతాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతున్నాయి.కొంతకాలంగా జాతీయ స్థాయిలో రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. కేంద్రంలో అధికార బీజేపీ సంకీర్ణ కూటమిపై ఆధారపడాల్సి వస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండీ' కూటమిలో సమన్వయ లోపాలు బయటపడుతున్నాయి. దీంతో జాతీయ స్థాయిలో కాంగ్రెసేతర, బీజేపీయేతర ప్రత్యామ్నాయం కోసం ప్రాంతీయ పార్టీలు చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు కేసీఆర్ తన అనుభవం, జాతీయ రాజకీయాలపై ఉన్న పట్టును ఉపయోగించుకోవాలని వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రాంతీయ ఆత్మగౌరవ నినాదంతో ఇతర ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే దిశగా తెరవెనుక కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.కేటీఆర్ చేసిన ఈ ప్రకటన వెనుక కేవలం ఢిల్లీ పీఠాన్ని ప్రభావితం చేయడమే కాదు.. తెలంగాణలో రాబోయే స్థానిక సంస్థలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత కొంత నైరాశ్యంలో ఉన్న కేడర్‌ను ఉత్తేజపరచడానికి ఇదొక స్ట్రాటజీ అయి ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కేసీఆర్ జాతీయ స్థాయిలో మళ్లీ చక్రం తిప్పుతారనే ప్రచారం మానసిక స్థైర్యాన్ని ఇస్తుందని భావిస్తున్నారు. అలాగే, రాబోయే రోజుల్లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే నినాదంతో శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే ప్లాన్ ఇది.మొత్తంగా చూస్తే కేసీఆర్ రీ ఎంట్రీ ప్రచారం అటు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడానికి ఎంతగా ఉపయోగపడుతుందో, జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను ఏకం చేయడంలో ఆయన ఏ మేరకు సఫలమవుతారనేది రాబోయే రాజకీయ పరిణామాలు తేల్చనున్నాయి

ఉప్పాడ చేపల మార్కెట్‌లో విలసల సందడి..

ఉప్పాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా కేంద్రానికి సమీపంలోగల ఉప్పాడ చేపల మార్కెట్‌లో సోమవారం విలస చేపలు సందడి చేశాయి. అత్యంత అరుదుగా లభించే ఈ చేపలను కొనుగోలు చేసేందుకు కస్టమర్లు పోటీపడ్డారు. దాంతో కిలో, కిలోన్నర బరువున్న ఒక్కోచేప రూ.1000 నుంచి రూ.1500 వరకు ధర పలికింది. మాకు పులస గురించి తెలుసుగానీ ఈ విలస ఏంది అనుకుంటున్నారా..? సముద్రంలో ఉన్నప్పుడు విలసగా పిలువబడే ఈ చేపలే.. సంతానోత్పత్తి కోసం గోదావరి నదిలో ఎదురీదుతూ పైకి వచ్చినప్పుడు పులసలుగా మారుతాయి.

డ్రగ్స్ మాఫియాపై కేంద్రం సర్జికల్ స్ట్రైక్..

బెంగళూరు, అక్టోబరు 26 : డ్రగ్స్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ ట్రైడెంట్'లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఈశాన్య రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా భారీ ఆపరేషన్ నిర్వహించారు. మణిపూర్, అసోం, మిజోరం రాష్ట్రాల్లోని 38 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టి 18 మంది అనుమానిత స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ చర్యల్లో భాగంగా సుమారు రూ.100 కోట్ల హవాలా లావాదేవీలకు సంబంధించిన వివరాలను గుర్తించడంతో పాటు 1,424 బ్యాంకు ఖాతాలను సీజ్ చేసినట్లు వెల్లడైంది.భారత్–మయన్మార్–బంగ్లాదేశ్ సరిహద్దుల మీదుగా సాగుతున్నట్లు భావిస్తున్న అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈశాన్య రాష్ట్రాల్లోని సున్నితమైన ప్రాంతాల్లో సమన్వయంతో తనిఖీలు, దాడులు నిర్వహించారు. మాదకద్రవ్యాల సరఫరా మార్గాలను గుర్తించడం, వాటి వెనుక ఉన్న వ్యక్తులను పట్టుకోవడం, అక్రమ లావాదేవీలను వెలికితీయడం ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.ఈ దాడుల్లో 18 మంది అనుమానితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కీలక ఆధారాలను అధికారులు సేకరించినట్లు సమాచారం. సీజ్ చేసిన బ్యాంకు

ఖాతాల ద్వారా డ్రగ్స్ వ్యాపారానికి సంబంధించిన ఆర్థిక మూలాలను గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.డ్రగ్స్ అక్రమ రవాణా వెనుక భారీ స్థాయిలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. సుమారు రూ.100 కోట్ల విలువైన హవాలా లావాదేవీలకు సంబంధించిన వివరాలు వెలుగులోకి రావడం ఈ కేసులో కీలకంగా మారింది. దీంతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న 1,424 బ్యాంకు ఖాతాలను అధికారులు సీజ్ చేసినట్లు వెల్లడైంది.ఈ లావాదేవీల వెనుక ఎవరున్నారు? డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చిన డబ్బును ఏయే మార్గాల్లో తరలించారు? ఈ నెట్‌వర్క్‌కు ఇతర ప్రాంతాల్లోనూ సంబంధాలున్నాయా? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగనుంది. ఆర్థిక లావాదేవీలను విశ్లేషించడం ద్వారా ఈ అక్రమ వ్యాపారానికి సంబంధించిన మరిన్ని వివరాలు బయటపడే అవకాశం ఉంది.ఈ ఆపరేషన్‌లో 500 డిటొనేటర్లను స్వాధీనం చేసుకున్నట్లు వచ్చిన సమాచారం మరింత ఆందోళన కలిగిస్తోంది. డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో డిటొనేటర్లు బయటపడటంతో వాటి నిల్వ, రవాణా వెనుక ఉన్న ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వీటిని ఏ కార్యకలాపాల కోసం వినియోగించాలనుకున్నారు? డ్రగ్స్ నెట్‌వర్క్‌తో వాటికి ఉన్న సంబంధం ఏమిటి? అనే అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు మాదకద్రవ్యాల సరఫరా వ్యవస్థకు ఆర్థికంగా, లాజిస్టిక్స్ పరంగా సహకరిస్తున్న నెట్‌వర్క్‌లను గుర్తించడం భద్రతా సంస్థలకు కీలకంగా మారింది.దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా అంతర్జాతీయ సరిహద్దుల గుండా జరిగే అక్రమ రవాణా, హవాలా లావాదేవీలు, డ్రగ్స్ పంపిణీ వ్యవస్థలపై నిఘా పెంచుతోంది. 'ఆపరేషన్ ట్రైడెంట్'లో భాగంగా చేపట్టిన దాడులు ఈ ప్రయత్నాల్లో కీలక పరిణామంగా నిలిచాయి.2029 డిసెంబర్ 31 నాటికి దేశంలో డ్రగ్స్ అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆపరేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనలు, స్వాధీనం చేసుకున్న వస్తువుల పూర్తి వివరాలు, అరెస్టయిన వారి పాత్రపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.డ్రగ్స్ సరఫరా మార్గాలను ధ్వంసం చేయడం, అక్రమంగా సంపాదించిన సొమ్మును గుర్తించడం, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ఛేదించడం ద్వారా మాదకద్రవ్యాల వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని భద్రతా సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

నీటి ఎద్దడి ఆరంభం...

బాసర ఐఐటీలో ఆన్ లైన్ క్లాసులు

అదిలాబాద్, అక్టోబరు 26 : బాసర ట్రిపుల్ ఐటీలో అక్టోబర్ నెలలోనే నీటి ఎద్దడి సమస్య తీవ్రమైంది. గోదావరి నుంచి నీటిని తోడి పంప్ చేసే మోటార్లు మొరాయించడంతో క్యాంపస్‌లో నీటి సమస్య తలెత్తింది. దీంతో దసరా సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఇళ్ల వద్దే ఉండాలని ట్రిపుల్ ఐటీ యజమాన్యం ఆదేశించింది. వీరికి ఆన్‌లైన్ విధానంలో క్లాసులు బోధించాలని నిర్ణయించింది. అయితే పీయూసీ చదివే విద్యార్థులు నవంబర్ 10లోగా క్యాంపస్‌లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. మిగతా విద్యార్థులు నవంబర్ 18న రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు దసరా సెలవులను పొడిగించారు. ఎల్‌నినో ప్రభావం, గోదావరిలో ఏర్పాటు చేసిన మోటార్లు మొరాయించడంతో తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో ఆన్‌లైన్లో క్లాస్‌లు నిర్వహించాలని ట్రిపుల్ఐటీ యాజమాన్యం నిర్ణయించింది. సోమవారం నుంచి ఆన్‌లైన్లో క్లాసులు మొదలుపెట్టి.. నవంబర్ 17 నాటికి సిలబస్ పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం ఒక ప్రకటన జారీ చేసింది.పీయూసీ 1, పీయూసీ 2 చదువుతున్న విద్యార్థులు నవంబర్ 10వ తేదీలోగా క్యాంపస్‌లో రిపోర్టు చేయాలని.. వీరికి ఈ నెల 18వ తేదీ దాకా తరగతులు నిర్వహించినట్లు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం తెలిపింది. ఇక ఇంజినీరింగ్ చదివే వారి విషయానికి వస్తే.. ఈ1 నుంచి ఈ4 దాకా విద్యార్థులంతా నవంబర్ 18న క్యాంపస్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. వీరికి మిడ్ టర్మ్, సెమిస్టర్ పరీక్షలను ఎప్పటిలాగే ఫిజికల్ మోడ్‌లో నిర్వహించనున్నారు. ట్రిపుల్ ఐటీలో చదివే విద్యార్థులందరికీ మిడ్ టర్మ్ పరీక్షలు నవంబర్ 19–21 తేదీల మధ్య జరుగుతాయి. ఈ పరీక్షలను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు.బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో దాదాపు 9 వేల మంది విద్యార్థులు ఉంటున్నారు. వారి రోజువారీ అవసరాల కోసం గోదావరి నదిలో ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన ఇన్‌టేక్ వెల్ నుంచి భారీ పంపులు, మోటర్లను ఉపయోగించి నీటిని తోడుతారు. రోజుకు 20 లక్షల లీటర్లకుపైగా నీటిని గోదావరి నుంచి లిఫ్ట్ చేసి క్యాంపస్‌కు తరలిస్తారు. గోదావరి నుంచి లిఫ్ట్ చేసిన నీటిని క్యాంపస్‌లోని రిజర్వాయర్ లేదా సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లో నిల్వ చేస్తారు. అయితే గోదావరి నీళ్లను తోడే పంప్‌హౌస్ మోటార్లు మొరాయించడంతోపాటు.. స్టోరేజీ చెరువులో నీరు లేకపోవడంతో క్యాంపస్‌లో అక్టోబర్ నాటికే నీటి ఎద్దడి తీవ్రమైంది. ఈ నేపథ్యంలోనే ట్రిపుల్ ఐటీ యాజమాన్యం దసరా సెలవులను పొడిగించి, సిలబస్‌పై ప్రభావం పడకుండా చూడటం కోసం విద్యార్థులకు ఆన్‌లైన్లో క్లాస్‌లు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది.కాగా బాసర ట్రిపుల్ ఐటీలో మౌలిక వసతులను మెరుగుపర్చడం కోసం తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే రూ.5 కోట్లు మంజూరు చేసింది. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా జీవో నంబర్ 182 ద్వారా నిధుల విడుదలకు అనుమతి ఇచ్చారు.బాసర ట్రిపుల్ ఐటీ రకరకాల కారణాలతో గత కొన్నేళ్లుగా వార్తల్లో నిలుస్తోంది. క్యాంపస్‌లోని మెస్‌లో ఆహార నాణ్యత సరిగా లేకపోవడం, విద్యార్థులు ఆందోళనలు చేపట్టడం, హాస్టల్‌లో మౌలిక సదుపాయాల కొరత, విద్యార్థుల ఆత్మహత్య లాంటి కారణాలతో ఈ ప్రముఖ విద్యాసంస్థ తరచుగా వార్తల్లో నిలుస్తోంది.

నీరు వృథా చేస్తే రూ.5 వేలు జరిమానా..

ట్యాంకర్ల నుంచి లీకైనా ఫైన్ తప్పదు.. జలమండలి ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 26: సాధారణంగా వేసవిలో నీటి సమస్య తలెత్తుతుంది. కానీ ఈసారి వర్షాభావం కారణంగా నగరాల్లో అక్టోబర్‌లోనే నీటి సమస్యలు మొదలయ్యాయి. హైదరాబాద్‌లో వేసవిలో బుక్ చేసిన స్థాయిలో ఇప్పుడే ట్యాంకర్లను బుక్ చేస్తున్నారు. దీంతో నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వ పిలుపునిస్తోంది. తాగునీటిని వృథా చేసే వారిపై రూ. 5 వేలు జరిమానా విధించనున్నట్లు జలమండలి ప్రకటించింది. ఈ నిబంధన నీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకర్లకు సైతం వర్తిస్తుందని జలమండలి అధికారులు తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షాకాలంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. దీంతో అక్టోబర్ నెలలోనే నీటి కొరత సమస్య మొదలైంది. ఇక వేసవిలో సమస్య మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రబీలో వరి సాగు చేయొద్దని.. విద్యుత్, నీటిని పొదుపుగా వాడాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేలా సెలబ్రెటీలతోనూ ప్రచారం నిర్వహించనున్నారు.భాగ్యనగరంలో డిసెంబర్ నుంచి నీటి కొరత తీవ్రమయ్యే అవకాశం ఉందని జలమండలి ఇప్పటికే హెచ్చరించింది. నగరానికి తాగు నీటిని సరఫరా చేసే సింగూరు, మంజీరా రిజర్వాయర్లలో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువైంది. జీహెచ్ఎంసీ పరిధిలో రోజుకు 735 మిలియన్ గ్యాలన్ల తాగునీరు అవసరం కాగా.. జలమండలి 585 మిలియన్ గ్యాలన్లు మాత్రమే సరఫరా చేయగలగుతోంది. దీంతో చాలా ప్రాంతాల్లో లో ప్రెషర్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో నీటిని జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాలని సూచించింది. ప్రభుత్వం పదేపదే సూచిస్తున్నప్పటికీ.. కొందరు మాత్రం నీటి వృథా మానడం లేదు. దీంతో కార్లు కడగటం లాంటి పనులతో నీళ్లు వేస్ట్ చేసే వారిపై భారీ జరిమానాలకు నగరపాలక సంస్థలు, జలమండలి సిద్ధం అవుతున్నాయి.రాష్ట్ర జలమండలి సూచనల నేపథ్యంలో నీటిని వృథా చేస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించింది. వాటర్ ట్యాంకర్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని వెల్లడించింది. నవంబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. నీటి పొదుపు కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.హైదరాబాద్‌లో అక్టోబర్ నెలలోనే వేసవి స్థాయిలో రోజుకు 7 వేల వాటర్ ట్యాంకుల బుకింగ్స్ జరుగుతున్నాయి. దీంతో ప్రయివేట్ ట్యాంకర్ల దందా ఊపందుకుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జలమండలి ట్యాంకర్ల నీటి లీకేజీల విషయంలో కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. రవాణా చేసే సమయంలో నీరు వృథాగా పోతే.. ట్యాంకర్ యజమానికి రూ.5 వేలు జరిమానా విధించాలని నిర్ణయం తీసుకుంది. ఇది తొలిసారి మాత్రమే, జరిమానా విధించిన తర్వాత కూడా ట్యాంకర్ నుంచి నీరు వృథాగా పోతున్నట్లు గమనిస్తే.. ఏకంగా ట్యాంకర్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించింది. నవంబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ప్రకటించారు. దీంతో మూతలు బిగించకుండా నీటిని మోసుకెళ్లే ట్యాంకర్లకు ఇక నుంచి తిప్పలు తప్పవు.నీటిని వృథా చేస్తే రూ.5 వేలు జరిమానా విధించాలనే నిర్ణయం హైదరాబాద్, వరంగల్ నగరాలకే పరిమితం కాలేదు. బెంగళూరు వాటర్ సప్లై అండ్ సీవరేజి బోర్డు సైతం తాగు నీటిని వృథా చేసే వారికి రూ.5 వేలు జరిమానా విధిస్తామని తొలిసారి 2024లో ప్రకటించింది. ఎవరైనా నీటిని వృథా చేస్తున్నట్లు గమనిస్తే 1916కు ఫిర్యాదు చేయొచ్చని సూచించింది. 2024 నుంచి బెంగళూరులో ఈ నిబంధనను అమలు చేస్తున్నారు.

మూడో సీటు ఎవ్వరికి....

హైదరాబాద్, అక్టోబరు 26 : తెలంగాణలో ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీల అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఖాళీగా ఉన్న మూడు స్థానాలలో రెండింటిపైన కాంగ్రెస్ హైకమాండ్ ఓ అంచనాకు వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఓ స్థానాన్ని పద్మశాలీలకు, మరోస్థానాన్ని ముదిరాజ్ కులస్తులకు కేటాయించే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చారు. దీంతో మిగిలిన మూడో సీటు ఎవరికి దక్కుతుందనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సామాజిక న్యాయం, అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత అనే నినాదంతో ముందుకు వెళ్తోంది. ఈ క్రమంలోనే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నామినేషన్ల ప్రక్రియలోనూ సామాజిక సమీకరణాలే కీలకంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి పద్మశాలి, ముదిరాజ్ వర్గాలకు చెరో స్థానం కేటాయిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో మిగిలిన సామాజిక వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర కులాలు, ఓసీలు, మైనారిటీ వర్గాల నాయకులు మూడో స్థానం కోసం తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారుతెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలు, వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులు సైతం ఈ మూడో స్థానంపై కన్నేశారు. పద్మశాలి వర్గం నుంచి ఎరవత్రి అనిల్, సంగిశెట్టి జగదీశ్వర్ రావు, పున్నా కైలాష్ నేత, జక్కని అనిత తదితరులతో పాటు స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె డాక్టర్ పవిత్ర వాణి పేరు కూడా పరిశీలనలో ఉంది. అలాగే ముదిరాజ్ సంఘం తరఫున నీలం మధు, ఎం. సునీత రావు వంటి నాయకులు తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారు.మొదటి రెండు స్థానాల కేటాయింపుపై స్పష్టత వచ్చినప్పటికీ, మూడో ఖాళీ స్థానం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి అధికారిక ప్రకటన చేయకపోవడంతో అన్ని వర్గాల ఆశావహులు ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఓసీ వర్గాల నుంచి ఆర్‌టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు, గుండెపల్లి దయా సాగర్, పవన్ మల్లాది, టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి. కుమార్ రావు, టీశాట్ సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తదితరులు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.షెడ్యూల్డ్ కులాల వర్గాల నుంచి సంపత్ కుమార్, ఇందిర, దొమ్మట సాంబయ్య, అరేపల్లి మోహన్, మానవత రాయ్, వెంకటేష్ వంటి సీనియర్ నేతలు రేసులో నిలిచారు. షెడ్యూల్డ్ తెగల నుంచి బెల్లయ్య నాయక్ తన ప్రయత్నాలను తీవ్రతరం చేశారు. బీసీ వర్గాల నుంచి సట్టు మల్లేశం, చనగాని దయాకర్, చరణ్ కౌశిక్ యాదవ్, లోకేష్ యాదవ్, నేరెళ్ల శారద తదితరులు గట్టి పోటీ ఇస్తున్నారు. ఇక మైనారిటీల నుంచి ముస్లిం, క్రైస్తవ వర్గాల నాయకులు కూడా తమకు శాసనమండలిలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ పార్టీ పెద్దలను కలుస్తున్నారు.రాష్ట్రంలో పార్టీ పరంగా అన్ని వర్గాల నుంచి వస్తున్న ఒత్తిళ్లు, ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో కాంగ్రెస్ నాయకత్వానికి ఈ ఎంపిక కత్తి మీద సాములా మారింది. రాష్ట్ర స్థాయి పర్యటనలు, అంతర్గత చర్చల అనంతరం, సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్టీ జాతీయ నాయలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయనున్నారు.

కమలానికి దారేది...

హైదరాబాద్, అక్టోబరు 26 : తెలంగాణ ప్రజలు బీజేపీని ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతున్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా ఏకైక లేదా సంపూర్ణ ప్రత్యామ్నాయంగా మారడానికి ఇంకా మిశ్రమ ఫలితాలు, సవాళ్లు ఎదుర్కొంటోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు సాధించి 35 శాతం ఓట్లతో బలమైన పునాది వేసుకున్నప్పటికీ, ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే వెనుకబడి మూడో స్థానానికే పరిమితమైంది.ప్రజల్లో మరియు రాజకీయ క్షేత్రంలో బీజేపీ స్థానాన్ని పదిలం చేసుకునే ప్రయత్నిస్తుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఎనిమిది స్థానాలు, పెరిగిన ఓట్ల శాతం ఆ పార్టీకి పెద్ద ఊరటనిచ్చాయి. కొన్ని పట్టణ, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో ప్రజలు కేంద్రంలో మోదీ నాయకత్వాన్ని చూసి ఓటేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగే ప్రయత్నం అప్పటి నుంచే మొదలు పెట్టింది. బీఆర్ఎస్ బలహీనపడిన సమయాల్లో, కాంగ్రెస్‌కు తామే అసలైన ప్రత్యామ్నాయం అని, హైడ్రా వంటి ప్రజా వ్యతిరేకత ఉన్న అంశాలపై పోరాడుతూ బీజేపీ ప్రజల్లోకి వెళ్తోంది. 2026 ప్రారంభంలో జరిగిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ ఘన విజయం సాధించగా, బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ దాదాపు 20శాతం ఓట్లను కోల్పోయి మూడో స్థానానికి పడిపోయింది. స్థానిక ఎన్నికల్లో త్రిముఖ పోటీ వల్ల బీజేపీ కేవలం ఓట్లను చీల్చే 'స్పాయిలర్' గానే మారిందని విశ్లేషకులు చెబుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో బలమైన క్యాడర్, ప్రజాకర్షణ గల స్థానిక నాయకులు లేకపోవడం బీజేపీకి పెద్ద మైనస్. అలాగే తెలంగాణ ప్రాంతీయ సెంటిమెంట్‌కు, బీజేపీ జాతీయవాద విధానాలకు మధ్య ఉన్న వ్యత్యాసం కూడా ప్రభావం చూపుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పాలన, అవినీతితో ప్రజలు విసిగిపోయారని, సర్వేల ప్రకారం తామే రాబోయే కాలంలో తెలంగాణలో అధికారంలోకి వస్తామని, ఏకైక ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొంటున్నారు.. తెలంగాణలో ఓటు బ్యాంకు పెంచుకోవడంతో పాటు నాయకత్వాన్ని కూడా పెంచుకోవడం బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి రానున్న కాలంలో సవాల్ అని చెప్పక తప్పదు. ప్రజలు కూడా బీజేపీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉంటే డబుల్ ఇంజిన్ సర్కార్ తో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావిస్తే కమలం పార్టీకి అధికారం చేరువవుతుంది. తెలంగాణలో పోటీ ఎప్పుడూ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని, బీజేపీ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వంటి వారు అంటున్నప్పటికీ ప్రజలు ఇచ్చే తీర్పునకు అందరూ కట్టుబడి ఉండాల్సిందే. ప్రస్తుతానికి తెలంగాణ ప్రజలు బీజేపీని ఒక బలమైన శక్తిగా గుర్తిస్తున్నప్పటికీ, పూర్తి స్థాయి అధికార ప్రత్యామ్నాయంగా మార్చడానికి ఇంకా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని బీజేపీ చెబుతుండటంతో త్రిముఖ పోరు ఆసక్తికరంగా మారనుంది. అందుకు అవసరమైన కసరత్తును ఇప్పటి నుంచే ప్రారంభించాల్సిన అవసరం ఉంది. నవంబర్ లో షా టూర్ తెలంగాణలో రాజకీయ వేడి రాజుకుంటోంది. అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, అధికార పీఠమే లక్ష్యంగా బీజేపీ ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టింది. రాష్ట్రస్థాయి నేతలు తమ వంతు పోరాటం చేస్తున్నారు. అయితే ఇది సరిపోవట్లేదని పార్టీ హైకమాండ్ భావిస్తోందో ఏమో.. నేరుగా పార్టీ పెద్దలే రంగంలోకి దిగబోతున్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు రాబోయే రెండు నెలల్లో రాష్ట్రంలో పర్యటించబోతున్నారు.గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కొంత మేర డీలా పడింది. ఆ పార్టీకి అంతర్గత సమస్యలూ చుట్టుముట్టాయి. ప్రధాన ప్రతిపక్షంగా దూకుడు ప్రదర్శించాల్సిన గులాబీ పార్టీ ఆశించిన స్థాయిలో ప్రజా సమస్యలపై పోరాడలేకపోతుందనే విమర్శలు ఉన్నాయి. ఈ శూన్యతను ఆసరాగా చేసుకుని, కాంగ్రెస్‌కు ఏకైక బలమైన ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకోవాలని బీజేపీ హైకమాండ్ గట్టిగా భావిస్తోంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, దాన్ని క్యాష్ చేసుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, విద్యుత్ రంగ సవాళ్లు, రైతు రుణమాఫీ అమలులో సాంకేతిక లోపాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును బీజేపీ తీవ్రంగా ఎండగడుతోంది. కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, ఈ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తోంది.

సంపాదకీయం

సోనియాగాంధీ బయోగ్రాఫీ వివాదాలు

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు.. రాజ్యసభ సభ్యురాలు సోనియాగాంధీ తన సుదీర్ఘ రాజకీయ చరిత్ర.. జీవిత ప్రయాణంలో అనుభవాలను ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో ఆమె ఒక ఆత్మ కథ కూడా రాశారు. దానికి బిలాంగింగ్ జర్నీ ఆఫ్ లవ్ పేరు పెట్టారు. ఈ పుస్తకాన్ని వచ్చేనెల 10వ తేదీన విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో సోనియాగాంధీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ చేశారు.కేం బ్రిడ్జిలోని ఒక చిన్న గ్రీక్ రెస్టారెంట్లో సోనియాగాంధీ, రాజీవ్ గాంధీకి మధ్య ప్రేమ ప్రయాణం మొదలైంది. నాడు వారిద్దరు అక్కడ తరచుగా కలుసుకునేవారు. ఎన్నో తీపి జ్ఞాపకాలు.. ఎన్నో మధురమైన స్మృతులు.. నవ్వులు.. కలిసి ఆరగించిన పదార్థాలు.. వీటికి సంబంధించిన పూర్తి వివరాలను సోనియా గాంధీ తన ఆత్మకథలో ప్రస్తావించారు. ఒక ఉద్యోగ భరితమైన వీడియోను.. అప్పటి ఫోటోలను సోనియా బయట పెట్టారు.ఈ పుస్తకాన్ని దాదాపు 554 పేజీలతో రూపొందించారు సోనియాగాంధీ.. మనదేశంలో హార్పర్ కాలిన్స్ ఇండియా.. ఇంటర్నేషనల్ లెవెల్ లో ప్రఖ్యాతల్ఫ్రెడ్ ఎ. నాఫ్ పబ్లిక్ సంస్థలు ఈ పుస్తకాన్ని ప్రచురించాయి. సెకండ్ వరల్డ్ వార్ తర్వాత ఇటలీలో సోనియాగాంధీ బాల్యం మొదలైంది. 1965 లో కేంద్రంలో విద్యార్థిగా ఆమె చేరినప్పుడు రాజీవ్ గాంధీతో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమకు దారితీసింది. అనంతరం వారిద్దరు తమ బంధాన్ని పెళ్లితో మరింత పదిలం చేసుకున్నారు. రాజీవ్ గాంధీతో ఉన్న స్మృతులను.. జ్ఞాపకాలను ఎంతో భావోద్వేగమైన విధానంలో సోనియాగాంధీ ఈ పుస్తకంలో పొందుపరిచారు.. ముఖ్యంగా భారతీయ సంస్కృతికి ఎటువంటి సంబంధం లేకుండా.. ఒక విదేశీ యువతీ దేశంలో అడుగుపెట్టడం.. నెహ్రూ.. గాంధీ కుటుంబాలలో కోడలిగా.. ముఖ్యమైన వ్యక్తిగా ఇమిడిపోవడం వంటి విషయాలను ఆమె అక్షరీకరణ చేశారు.కేవలం తమ ప్రేమకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే ఇందులో సోనియాగాంధీ ప్రస్తావించలేదు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో నెహ్రూ కుటుంబం పడిన ఇబ్బందులు.. గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు.. దేశ రాజకీయాలలో ఈ రెండు కుటుంబాలు పోషించిన పాత్ర వంటి వాటిపై ఈ పుస్తకంలో సోనియాగాంధీ వివరించారు. 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురి కావడం.. 1991లో రాజీవ్ గాంధీ దుర్మరణం చెందడం వంటి దారుణాలు జరిగినప్పుడు తాను ఎదుర్కొన్న విషాదం.. అనుభవించిన మానసిక వేదనను సోనియాగాంధీ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. తన కళ్ళ ముందు రక్త సంబంధాలు విచ్ఛిన్నం కావడం.. పిల్లలు రాహుల్.. ప్రియాంకను చూసుకుంటూ.. ఒంటరిగా ఆమె సాగించిన రాజకీయ ప్రయాణాన్ని ఇందులో ప్రస్తావించినట్టు తెలుస్తోంది.సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీకి అత్యధిక కాలం అధ్యక్షురాలిగా పని చేశారు. 1990 చివరి కాలంలో రాజకీయాల్లోకి సోనియా గాంధీ బలవంతంగా వచ్చారు. ముఖ్యంగా 2004లో యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు.. ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ.. దానిని తిరస్కరించిన విధానం.. మన్మోహన్ సింగ్ ఎంపిక.. రెండు పర్యాయాలు కేంద్రంలోకి అధికారంలోకి రావడం.. కీలకమైన సమాచార హక్కు చట్టం.. ఉపాధి వంటి పథకాలను అమలు చేయడం మట్టి విషయాలను సోనియాగాంధీ ఇందులో ప్రస్తావించారు.ఇక ఈ పుస్తకం ప్రచురణకు ముందు పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ తో వచ్చిన వివాదాలు.. మధ్యలోకి హార్పర్ కాలిన్స్ సంస్థ రావడం.. వంటి పరిణామాలు ఈ పుస్తకానికి మరింత ప్రచారం తీసుకొచ్చాయి..సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్.. ఏ జర్నీ ఆఫ్ లవ్' నవంబర్ 10వ తేదీన విడుదల కానుంది.. అయితే బుక్ రిలీజ్ అయిన తర్వాత దేశ రాజకీయాలలో ఎటువంటి మార్పులు చోటు చేసుకోబోతాయో చూడాల్సి ఉంది.ఇంతలోనే వారందరికీ షాక్ ఇస్తూ భారత్‌లో తాము ఆ గ్రంథాన్ని ప్రచురించటం లేదని 'పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా' సంస్థ శుక్రవారం ప్రకటించింది. పుస్తకంలో కొన్నిచోట్ల తాము సూచించిన మార్పులు చేసేందుకు రచయిత (సోనియాగాంధీ) అంగీకరించలేదని, అందువల్లే భారత్‌లో ఆ గ్రంథం ప్రచురణ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు వెల్లడించింది. 'గ్రంథంలోని అంశాల వాస్తవికతను పరిశీలించి రచయితకు పలు సూచనలు ఇవ్వటం పబ్లిషర్‌గా మా బాధ్యత. ప్రచురణ ప్రక్రియలో ఇది సాధారణ అంశం' అని పేర్కొందిపెంగ్విన్ సంస్థ ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ భగ్గుమంది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, భావప్రకటనా స్వేచ్ఛను ఆ సంస్థ చంపేసిందని కాంగ్రెస్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ మండిపడ్డారు. 'సోనియాగాంధీ ఆత్మకథ గ్రంథాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచురించేందుకు పెంగ్విన్ రాండమ్ కంపెనీ సిద్ధంగా ఉంది. కానీ, భారత్‌లో దాని అనుబంధ సంస్థ అయిన పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా మాత్రం ఆ గ్రంథంలో మార్పులు చేయాలని కోరుతోంది. అందుకు కారణమేంటి? ఆ సంస్థ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గింది? త్యాగం, నిబద్ధతకు సోనియాగాంధీ జీవితం ఉదాహరణ. దేశానికి ఆమె అసాధారణ సేవ చేశారు. అలాంటి గొప్ప నాయకురాలి ఆత్మకథను రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రచురించకుండా తప్పుకోవటం భావప్రకటనా స్వేచ్ఛను హత్యచేయటమే. నరేంద్రమోదీ పాలనలో భారత భూభాగాన్ని చైనా ఆక్రమించటం, మోదీ పాలన, ఆరెస్సెస్ కు సంబంధించి ఎడిటోరియల్‌లోని అంశాలను తొలగించాలని పెంగ్విన్ ఇండియా కోరింది. ఆ అంశాలను తొలగించేలా చూడాలని మోదీ ప్రభుత్వం పబ్లిషర్‌పై ఒత్తిడి తెచ్చిందా?' అని గెహ్లోత్ ప్రశ్నించారు. పెంగ్విన్ సంస్థ నిర్ణయం ఆందోళనకరమని మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ అన్నారు. ఆరెస్సె?సపై గ్రంథాలు ప్రచురించిన పెంగ్విన్ సంస్థ.. సోనియా ఆత్మకథ ప్రచురణ నుంచి తప్పుకోవటానికి చూపిన కారణం బలంగా లేదని లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ విమర్శించారు. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. సోనియాగాంధీ తన జ్ఞాపకాలు, అనుభవాలను పుస్తక రూపంలో తెస్తున్నప్పుడు.. వాటిలో కొన్ని కల్పనలు కూడా ఉండవచ్చు కదా? అని బీజేపీ నేత అమిత్ మాలవీయ ప్రశ్నించారు. వాటిని సరిచూసుకోవాలని పబ్లిషర్ చెప్పటంలో తప్పేముందని నిలదీశారు.

సొంతింటి కలకు ప్రభుత్వాల మోకాలడ్డు

ధరలకు తోడు అనేక రకాల పన్నుపోట్లు

హైదరాబాద్ : హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. రియల్ రంగం పూర్తిగా దెబ్బతింటోంది. ప్రజల్లో ఇల్లు కొనుక్కోవాలన్న ఆలోచన లేకుండా ప్రభుత్వా తీరు ఉంటోంది. భూముల ధరలు పెరగడం, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడం, ఇళ్లు అందుబాటులో లేకుండా పోవడం అన్నది అభివృద్ధికి సంకేతం కాదు. ఇది తిరోగమన చర్యగా చూడాలి. ప్రధానంగా రియల్ రంగంతో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. వివిధ రకాల వృత్తులు దీనితో పెనవేసుకుని వున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాలయాపన చేస్తూ...పోయేబదులు సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించాలి. ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ కొనాలను కుంటున్న వారికి పన్నుల భారతం తడిసి మోపెడు అవుతోంది. ఇందులో జీఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజస్ట్రేషన్‌కు ఓ పది నుంచి 20 లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. తెలంగాణలో కెసిఆర్ పుణ్యమా అని లోన్‌పైనా 50వేల అదనపు పన్నులు వేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు దోపిడీ కేంద్రాలుగా మారాయి. నిజానికి బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే కనిపిస్తోంది. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని బడ్జెట్‌లో చెప్పారు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతు న్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధంలోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ధ అబద్ధం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందన్న విషయంలో అబద్ధాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న ప్రధాన మంత్రి.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు. పేదల అభివృద్ధే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ అభివృద్ధిలో దూసుకుని పోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని గుర్తించాలి.

గుజరాత్‌ను మించిపోతున్న ఆంధ్రా

విజయవాడ, అక్టోబరు 26 : ఏపీ పోర్టులు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణాతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచాయి. నౌకల టర్న్ ఎరౌండ్ సమయం తగ్గించడం, వసతులు మెరుగుపడటంతో గత ఏడాదితో పోలిస్తే సరకు రవాణాలో 12 శాతం పెరుగుదల నమోదైంది. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ పోర్టులు పూర్తైతే మరో 109 ఎంఎంటీల సామర్థ్యం అదనంగా అందుబాటులోకి వస్తుంది. ఈ లక్ష్యాలు నెరవేరితే నాన్-మేజర్ పోర్టుల సరకు రవాణాలో మొదటి స్థానంలో ఉన్న గుజరాత్‌ను ఆంధ్రప్రదేశ్ త్వరలోనే దాటేయడం ఖాయంగా కనిపిస్తోంది.సముద్ర వాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో దూసుకుపోతోంది. 2025-26 సంవత్సరానికిగానూ రాష్ట్రంలోని పోర్టుల ద్వారా సుమారు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఓఓ) సరకు రవాణా జరగడంతో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. నాన్-మేజర్ పోర్టుల కార్గో సామర్థ్యంలో ప్రస్తుతం గుజరాత్ టాప్ 1లో ఉంది. ఏపీ వ్యూహాత్మక అడుగులతో భవిష్యత్తులో గుజరాత్‌ను వెనక్కి నెట్టి నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా పయనిస్తోందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్-డీజీసీఐఎస్ (తాజా లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.2025-26 సంవత్సరానికి పోర్టుల ద్వారా సుమారు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా అయింది. 2024-25తో పోలిస్తే ఇది సుమారు 12 శాతం ఎక్కువ. దేశంలో నాన్- మేజర్ పోర్టుల సరకు రవాణా సామర్థ్యంలో గుజరాత్ ప్రథమ స్థానంలో ఉంది. ఏపీ రెండో స్థానంలో నిలిచింది. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్-డీజీసీఐఎస్ రీసెంట్‌గా వెల్లడించింది.విశాఖ మేజర్ పోర్టు నుంచి 91.17 ఎంఎంటీల రవాణా జరిగింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే ఇది 10.35 శాతం పెరుగుదల. గతంలో రవాణా కేవలం 82.62 ఎంఎంటీలుగా ఉంది. ఈ ఏడాది రాష్ట్రంలోని నాన్-మేజర్ పోర్టుల ద్వారా 118.83 ఎంఎంటీల రవాణా జరిగింది. నౌకల టర్న్ ఎరౌండ్ టైమ్‌ని తగ్గించడం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా తెలుస్తుంది.కాగా ప్రస్తుతం విశాఖ పట్నం, గంగవరం, కృష్ణపట్నం తదితర పోర్టుల మొత్తం సామర్థ్యం 327.5 ఎంఎంటీలు. అందులో కేవలం 64.12 శాతం మాత్రమే వినియోగించుకోవడం జరుగుతుంది.

విజయ్ బాటలోనే త్రిష?

చెన్నై, అక్టోబరు 26 : సినీ తారలు షాపింగ్ మాల్స్, మొబైల్ షోరూమ్‌ల ప్రారంభోత్సవాలకు రావడం మామూలే కానీ.. కోయంబత్తూరు వీధుల్లో సౌత్ క్వీన్ త్రిష సృష్టించిన సునామీ మాత్రం ఇటు కోలీవుడ్‌ను, అటు తమిళనాడు రాజకీయ వర్గాలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఒక చిన్న మొబైల్ షాప్ ఓపెనింగ్ కోసం వచ్చిన త్రిష, ఏకంగా ఒక బడా పొలిటికల్ లీడర్ రేంజ్‌లో కారు సన్‌రూఫ్ నుంచి బయటకు వచ్చి.. వేలాదిగా తరలివచ్చిన జనసందోహానికి చిరునవ్వుతో అభివాదం చేస్తూ హంగామా చేసింది. ఎర్రటి కాటన్ చీరలో దేవతలా మెరిసిపోతూ ఆ నడిరోడ్డుపై ఆమె చేసిన మాస్ రోడ్ షో చూసి కంగారు పడటం కోయంబత్తూరు వాసుల వంతయింది.ఈ రోడ్ షో వీడియోలు నెట్టింట ప్రత్యక్షమవ్వడమే ఆలస్యం.. తమిళనాడు సోషల్ మీడియా స్టీమ్ రేంజ్‌లో వేడెక్కిపోయింది. ఇది షాపింగ్ మాల్ ప్రమోషన్ లా లేదు.. ముమ్మాటికీ అంచెలంచెలుగా ప్లాన్ చేసిన పొలిటికల్ కల్ట్ స్ట్రాటజీలా ఉంది అంటూ ఎక్స్ , ఇన్‌స్టాగ్రామ్‌లలో కామెంట్ల వర్షం కురుస్తోంది. మొబైల్ షాప్ ప్రారంభించడానికి వచ్చిన భామ, ఆ పనిని ఎలక్షన్ ర్యాలీగా మార్చేయడం వెనుక సాధారణమైన పబ్లిసిటీ మాత్రమే లేదని, ప్రజల్లో తనకున్న క్రేజ్‌ను చెక్ చేసుకోవడానికే ఈ స్థాయి పబ్లిక్ కనెక్ట్ షో ప్లాన్ చేసిందని గట్టి ప్రచారం సాగుతోంది.దళపతి విజయ్ పార్టీలో చేరి ఆమె కీలకపాత్ర పోషిస్తారన్న ప్రచారం జరుగుతోంది. తిరుచ్చి ఉపఎన్నిక ఇంకా జరగాల్సి ఉంది. ఆమె పేరు తరచూ ప్రచారంలోకి వస్తూనే ఉంది.తమిళనాడులో పురాతన కాలం నుంచి సినీ స్టార్లను నెత్తిన పెట్టుకుని రాజకీయాల్లో కిరీటాలు కట్టబెట్టే ఆచారం ఉంది కాబట్టి, త్రిష ప్లాన్ కూడా అదేనని నెటిజన్లు విశ్లేషిస్తున్నారు.మరోవైపు, ఎరుపు రంగు శారీలో త్రిష మెరిసిన గ్లామరస్ లుక్స్, ఆమె కారు పైనుంచి అభిమానులకు ఫ్లయింగ్ కిస్‌లు ఇస్తున్న వీడియోలు ప్రస్తుతం నెట్టింట రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతున్నాయి.రాజకీయాల్లోకి వస్తే ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేసే గ్లామర్ అండ్ మాస్ ఫాలోయింగ్ త్రిష సొంతం అంటూ ఫ్యాన్స్ హంగామా చేస్తుంటే.. మేడమ్ మైక్ పట్టుకోవడం ఖాయం" అంటూ మీమర్స్ సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. మొత్తానికి ఒక చిన్న షాప్ ఓపెనింగ్‌తో తమిళనాడు పొలిటికల్ అండ్ సినిమా సర్కిల్స్ రెండింటిలోనూ త్రిష పెట్టిన మంటలు త్వరలో ఎలాంటి మలుపు తిరుగుతాయో చూడాలి!

ఇంద్రకీలాద్రిలో గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి : ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ ఈరోజు ఉదయం ఘనంగా జరిగింది.శ్రీ దుర్గా మల్లేశ్వరులు, శ్రీ విఘ్నేశ్వరుడు,శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వంటి సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం వలన కోరిన కోరికలు తీరుతాయని ప్రతీతి. పౌర్ణమి రోజున సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రిగిరి ప్రదక్షిణ చేయడం మరింత శ్రేష్టమని పండిత ఉవాచ.ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని ఈరోజు ఉదయం ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవంగా ప్రారంభంకాగా...ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ కార్యక్రమంను ప్రారంభించారు.ధర్మ ప్రచారం నిమిత్తం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంప్రదాయకోలాట నృత్యప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం వంటి కళా బృందాల కళా ప్రదర్శనలు, మంగళవాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్ణయించిన మార్గంలో సాగింది.ఘాట్ రోడ్ శ్రీ అమ్మవారి గుడి,కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాలప్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరిప్రదక్షిణ కొనసాగనుంది.శ్రీ దుర్గా మల్లేశ్వరులు కొలువైన వాహనం ముందు రహదారులను వివిధ ప్రాంతాల్లోస్థానిక మహిళలు పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు,కొబ్బరికాయలు సమర్పించి, జయ జయద్వానాలు చేశారు.గిరి ప్రదక్షిణ మార్గమంతా భక్తులకు శ్రీ అమ్మవారి కుంకుమ, ప్రసాదంను భక్తులకు దేవస్థానం నుండి అందజేయడమైనది.వేలాది మంది భక్తులు విశేషముగా ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్, సూపరెండెంట్ హేమ దుర్గాంబ, సీనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

నైతికబలమే ఆత్మశక్తి

ప్రభువు చుట్టూ ప్రజలు తండోపతండాలుగా ఉండేవారు. ఆయన సన్నిధిలో ఆకలి నిద్రలు మరచి పులకించిపోయేవారు. ప్రభువు పలుకులే వారికి దివ్యౌషధాలు. అలాంటి వారిని అప్పుడప్పుడూ కొందరు అహంకారులు పట్టి పీడించేవారు. వారిపై దౌర్జన్యానికి పాల్పడేవారు. అయినా వారంతా మొక్కవోని ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ప్రభువు దగ్గరే అచంచలమైన దీపాల్లా వెలుగుతుండేవారు. వారిని చూసి జాలిపడిన ప్రభువు.. 'ఆత్మవిషయమై దీనులైన మీరు ధన్యులుబీ పరలోకరాజ్యము మీదే' అని ఊరట కలిగించేవారు. ప్రభువు కొండమీద కూర్చొని అలా పలుకుతుంటే, చిన్నగా జాలువారే అమృతధారలు వారిలో జీవం ఉప్పొంగించేవి. అలా ఆయన మాటలు దుఃఖపడే వారిని ఓదార్చేవి. నీతి కోసం నిలబడే నైతిక బలమే ఆత్మశక్తిని, తృప్తినీ ఇస్తాయని ప్రభువు వారికి బోధిస్తుండేవారు. ప్రభువు బోధనలు ఆధ్యాత్మిక, భౌతిక, తాత్వికతకు మూలబీజాలుగా ఉండేవి. ఎందరెందరో బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు చిగురింపజేసేవి. బాధితుల మనసుకు సాంత్వన చేకూర్చేవి.



ఆధ్యాత్మికం

మళ్ళీ పొడిగించినా స్పెషల్ రైలు ఆగ(దు)దా?

- రైలు నడుస్తోంది.. గడువు పెరుగుతోంది
- కానీ పట్టించుకునే దిక్కులేదు
- ఓదెలకు మళ్లీ మొండి చెయ్యి
- భక్తులకు శాపంగా మారిన రైల్వే శాఖ నిర్ణయం
- స్పెషల్ రైలున్నా ప్రయోజనం ఏదీ?
- ప్రత్యేక కథనం...

బ్యూరో,: ఓదెల.. ఇది ఒక మండల కేంద్రమే కాదు, ఒక పుణ్యక్షేత్రం. శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున దేవస్థానం,-4 కేటగిరిలో ఉన్న రైల్వే స్టేషన్, ప్రతిరోజూ వివిధ రాష్ట్రాల నుండి వందలాది మంది భక్తులు ఇక్కడికి వస్తారు. అంతేకాదు, ఇక్కడే కోర్టు భవనం ఉంది. ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. 22 గ్రామాల ప్రజలు, ఓదెలతో పాటు కాల్వ శ్రీరాంపూర్, ముత్తారం మండలాల ప్రజలు సికింద్రాబాద్, హైదరాబాద్, వరంగల్, విజయవాడ, కాచిగూడ వెళ్లాలంటే ఓదెల స్టేషనే దిక్కు. అలాంటి కీలక స్టేషన్ కు రైల్వే శాఖ మళ్లీ మొండిచెయ్యి చూపించింది. సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్ నగర్ మధ్య నడుస్తున్న స్పెషల్ రైలును వచ్చే నెల 5వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఈ రైలు పొడిగింపు వార్త విని ఓదెల ప్రజలు సంతోషించాలో బాధపడాలో అర్థం కాని పరిస్థితి. కనీసం ఈసారైనా ఓదెలలో ఆపుతారని ఆశపడ్డారు. కానీ ఆ ఆశ అడియాశే అయింది. ఓదెల మండలంలో ఉన్న మూడు ప్రధాన రైల్వే స్టేషన్లలో ఒక్కదానికి కూడా స్టాప్ ఇవ్వకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా ఓదెల స్టేషన్ లోనైనా ఆపాలన్న ప్రజల చిరకాల డిమాండ్ ను మళ్లీ తొక్కిపారేశారు. ఈ రైలు ఆగితే సామాన్యులకు, పేదవారికి, విద్యార్థులకు, ఉద్యోగులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. దీనివల్ల రైల్వే శాఖకు కూడా భారీగా ఆదాయం వస్తుంది. ఇంత స్పష్టంగా లాభం ఉన్నా పట్టించుకోకపోవడం దారుణం. అసలు బాధాకరమైన విషయం ఏంటంటే.. రైలును పొడిగించినా మండల నాయకుల్లో ఏ మాత్రం చలనం లేకపోవడం. రైలు ప్రారంభం నుంచి ఒత్తిడి చేస్తున్నామని హడావిడి చేసిన నాయకులు ఇప్పుడు ఒక్కరు కూడా కనిపించడం లేదు. "అడిగేవారు లేకుంటే పెట్టేవారు ఎవరు?" అంటూ సామాన్య జనం నిలదీస్తున్నారు. ప్రజల సౌకర్యం కోసం కొట్లాడని నాయకత్వం ఎందుకు అంటూ మండిపడుతున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అధికారులతో మాట్లాడడం, సమస్యను వాళ్ళ దృష్టికి తీసుకెళ్లడం నాయకుల బాధ్యత కాదా? ప్రజా అవసరాల కోసం గొంతెత్తని నాయకత్వం ఉన్న లేనట్టే కదా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు రైల్వే శాఖ న్యాయం చేస్తుందా? లేక ఈసారి కూడా పట్టించుకోకుండా వదిలేస్తుందా? వేచి చూడాలి. రైలును మరికొద్ది రోజులు పొడిగించడానికి రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది... మరి మండలంలో ఉన్న మూడు రైల్వే స్టేషన్లలో ఆపించడానికి నాయకులు ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారు? ప్రజల ప్రయాణ కష్టాలు తీరేది ఎప్పుడు? సామాన్యుల గొంతు అధికారుల చెవిన పడేది ఎప్పుడు? అడిగే వారు లేకుంటే పెట్టేవారు ఎవరు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది మాత్రం అధికారులే కాదు స్థానిక నాయకులు కూడా.

ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం అందేలా ప్రజలు సహకరించాలి

- పీఎం రహత్ పథకంపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచన - మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 15 ఎంప్యానెల్ ఆసుపత్రుల్లో చికిత్స సదుపాయం

గోదావరిఖని క్రైమ్ : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, అర్హులైన బాధితులు పీఎం రహత్ పథకం ప్రయోజనాలను పొందాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కోరారు. అక్టోబర్ 26న విడుదల చేసిన ప్రకటనలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య చికిత్సతో పాటు ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు దోహదపడుతుందని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 15 ఎంప్యానెల్ ఆసుపత్రుల్లో అర్హులకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పథకం నిబంధనలకు అనుగుణంగా గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు 7 రోజుల పాటు నగదు రహిత చికిత్స పొందే అవకాశం ఉందని వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, క్షతగాత్రులను వీలైనంత త్వరగా పథకంలో గుర్తింపు పొందిన సమీప ఆసుపత్రికి తరలించేందుకు సహకరించాలని సూచించారు. చికిత్సలో జాప్యం జరగకుండా చూడటంతో పాటు ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించి అవసరమైన వివరాలు అందించాలని కోరారు. బాధితులను తరలించే సమయంలో వారి ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని వైద్య సిబ్బంది సూచనలు పాటించాలని తెలిపారు. ప్రమాద బాధితులకు సహాయం చేసే వారు మానవతా దృక్పథంతో వ్యవహరించి పోలీస్, వైద్య సిబ్బందికి సహకరించాలని అన్నారు. పీఎం రహత్ పథకంపై అవగాహన పెంచుకుని అర్హులకు ప్రయోజనాలు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు.

నల్గొండ జిల్లా కమిటీ కన్వీనర్ మద్దిమడుగు బిక్షపతిపై వేటు ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నుంచి తొలగింపు.. నూతన కమిటీ ఏర్పాటుకు రాష్ట్ర కార్యవర్గం నిర్ణయం

నల్గొండ ప్రతినిధి: ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నల్గొండ జిల్లా తాత్కాలిక కమిటీ కన్వీనర్‌గా కొనసాగుతున్న మద్దిమడుగు బిక్షపతిని సంస్థ నుంచి తొలగిస్తూ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర కమిటీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేయకపోవడం, సంస్థ బలోపేతానికి తగిన కృషి చేయకపోవడం వంటి అంశాలపై చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దళిత రత్న డాక్టర్ బుర్రి వెంకన్న తెలిపారు. నల్గొండ జిల్లాలో నూతన కమిటీ ఏర్పాటుకు కూడా రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. డాక్టర్ యాదయ్యకు ఘన నివాళులు ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర కార్యాలయంలో మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సంస్థకు ఆయన అందించిన సేవలను రాష్ట్ర అధ్యక్షుడు మూలే వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి దళిత రత్న దాసరి లక్ష్మయ్య తదితరులు స్మరించుకున్నారు. అనంతరం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంస్థ బలోపేతం, జిల్లాల్లో కమిటీల ఏర్పాటు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా తాత్కాలిక కమిటీ కన్వీనర్ మద్దిమడుగు బిక్షపతిని సంస్థ నుంచి తొలగిస్తూ తీర్మానం చేసినట్లు నాయకులు వెల్లడించారు. నూతన కమిటీ ఏర్పాటుకు డాక్టర్ బుర్రి వెంకన్నకు బాధ్యతలు నల్గొండ జిల్లాలో ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు నూతన జిల్లా కమిటీని త్వరలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. ఈ మేరకు నూతన కమిటీ ఏర్పాటు బాధ్యతలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు దళిత రత్న డాక్టర్ బుర్రి వెంకన్నకు అప్పగిస్తూ తీర్మానించినట్లు తెలిపారు. జిల్లాలో సంస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సంస్థ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత మందిని సంస్థలో భాగస్వాములను చేయాలని నాయకులు సూచించారు. శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ స్థాపనకు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాల ప్రణాళిక, నిర్వహణ, కార్యాచరణపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు దళిత రత్న డాక్టర్ బుర్రి వెంకన్న పిలుపునిచ్చారు. సంస్థ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సామాజిక న్యాయం కోసం సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జాతీయ నాయకుడు వైద్యనాథ్, రాష్ట్ర అధ్యక్షుడు మూలే వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, కోశాధికారి మద్దిలేటి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల శ్రీనివాస్, సాయమల్ల, నర్సింగ్ రాజ్, డాక్టర్ బుర్రి వెంకన్న, సంయుక్త కార్యదర్శులు కే. అంబదాస్, డి. నాగరాజు, కె. దశరథ్, కార్యవర్గ సభ్యులు జి. గౌతమ్, దమ్మనాద్, బి. ప్రమీల, గణపతి, ఓం ప్రకాష్, మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇతర రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

నీతిలేని నేతల ముందు ఎట్టిపరిస్థితుల్లో తప్పుచెయ్యం

- రాజకీయంగా ఎదుర్కోలేకే కాంగ్రెస్ నాయకులు అరాచకాలు సృష్టిస్తున్నారు - బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రొల చంద్రయ్య, సర్పంచ్ మునగపాటి నవీన్

మహేశ్వరం అక్టోబరు 26 : నీతి నిజాయితీ లేని నేతల ముందు ఎట్టి పరిస్థితుల్లో తప్పు చేయబోమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రొల చంద్రయ్య, గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ తెలిపారు. సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలో పేరడు భూములపై వివాదం ముదురుతున్న నేపథ్యంలో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితుల తరఫున వారు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. బాజాప్త కోర్టు తీర్పు ప్రకారమే పేరడు భూముల్లో ప్లాట్లు కొనుగోలు చేసినట్టు వారు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు రాజకీయంగా లబ్ధి పొందడానికే తమపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పేరడు భూములను ప్రభుత్వ భూమిగా చెబుతున్న కాంగ్రెస్ పార్టీ నేత కాకి ఈశ్వర్ చేతనైతే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయడానికి బిఆర్ఎస్ నాయకులము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. నేటికైనా కాంగ్రెస్ నాయకులు గత చరిత్ర తెలుసుకొని మాట్లాడలని వారు మరోసారి సూచించారు. పేరేడు భూముల్లో ఉన్న భూమి 60 కోట్ల విలువ అనేది అవాస్తవమని వారు ఖండించారు. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం పెరేడ్ భూములపై వాస్తవాలను నిర్ధారించేందుకు సర్వే నిర్వహించాలని వారు మహేశ్వరం ఎమ్మార్వోను కోరారు. గత 1950 నుంచి కూడా ఆ భూమి పట్టా భూమిగానే రికార్డుల్లో నమోదయి ఉందని స్పష్టం చేశారు. నాడు సర్పంచ్ గా విధులు నిర్వహించిన కూన యాదయ్య నాటి దేవస్థాన కమిటీ చైర్మన్ కాకి ఈశ్వర్ లే ఈ స్థలాన్ని గ్రామకంఠంతో పాటు దేవాలయ భూమి కాదనే విషయంపై ఒప్పంద పత్రం ఇచ్చినట్లు వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇదే లేఔట్ లో ప్రస్తుతం 72 మంది పట్టాదారులు ఉన్నారని తాము కూడా 2003లో నాటి మార్కెట్ విలువ ప్రకారమే ప్లాట్లు కొనుగోలు చేసినట్లు కర్రొల చంద్రయ్య తెలిపారు. ఏది ఏమైనా తాము కొనుగోలు చేసిన ప్లాట్లపై అన్ని ఆధారాలతో బహిరంగ చర్చకు సిద్ధమని దీనిపై కాంగ్రెస్ నాయకులు సిద్ధమా,,! అంటూ మరోసారి సవాల్ విసిరారు.. ఎలాంటి ఆధారాలు లేకుండా తమపై తప్పుడు ఆరోపణలు సృష్టిస్తే సహించే ప్రసక్తే లేదని మరోసారి హెచ్చరించారు. ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులను బెదిరిస్తూ రాజకీయంగా ఎదుర్కోలేక కుట్రలు కుతంత్రాలతో దెబ్బతీయాలనే కుట్రతోనే కాంగ్రెస్ నాయకులు అసత్యా ప్రచారాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఇసాక్ రెడ్డి ఆజం అలీ పాండురంగయ్య వెంకటేశ్వర్లు శ్రీహరి శంకర్ యాదయ్య కానాపురం సాగర్ ఒగ్గు మల్లేష్ చాకలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమకుమార్

కూకట్‌పల్లి అక్టోబర్ 26: కూకట్ పల్లి నియోజకవర్గం మోతినగర్ లో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దేవాలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు జనసేన రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ఈ.వో నరేందరరెడ్డి రాఘవేంద్రరావు ప్రేమ కుమార్ ని పూలమాలతో, శాలువా తో సత్కరించారు. ఈ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని శబరిమల మేల్‌శాంతి మాలిగ పురోత్తమ దేవాలయం బ్రహ్మశ్రీ పి.జి. మురళి నంబూద్రి దివ్య సమక్షంలో, వేదమంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, బడే విశ్వేశరరావు, చిట్టి బాబు, రామకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

కూకట్‌పల్లి అక్టోబర్ 26: సర్వకాలాల్లో అత్యంత ముఖ్యమైన, ప్రసిద్ధ ఇతిహాసాలలో ఒకటైన రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధి అంబేద్కర్ నగర్ లో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద సీనియర్ నేత బోయ కిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ సత్యం, ధర్మం, న్యాయం, మానవీయ విలువల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం, ఆయన రచించిన రామాయణ మహాకావ్యం సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన అమూల్యమైన సాహిత్య సంపద అని పేర్కొన్నారు. సంస్కృత భాష యొక్క ఆది కవిగా లేదా తొలి కవిగా పూజించబడే ఆయన, నారద మునిని కలుసుకుని 'మర' (మరణం) అనే పదాన్ని జపించిన తర్వాత గొప్ప పరివర్తనకు లోనయ్యారు. ఆ పదాన్ని పలుమార్లు జపించగా, అది గొప్ప ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన 'రామ'గా మారిందని తెలిపారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, మారెళ్ళ శ్రీనివాస్, మల్లేష్, మహేష్, వాలి నాగేశ్వరరావు, రవీందర్, నాగరాజు, జనార్ధన్, పూలరంగడు, రాజేష్, మొదులేటి, పత్తిరత్త కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి

- గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి

- 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇండో-అమెరికన్ స్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్



గోదావరిఖని క్రైమ్ : ప్రజలకు భరోసా కల్పించి, వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించేందుకు పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా సోమవారం గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇండో-అమెరికన్ స్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి పోలీసుల విధులు, ప్రజలకు అందించే సేవలపై అవగాహన కల్పించారు. డయల్-112, షీ టీమ్స్, సైబర్ క్రైమ్, డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలు, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాలను వివరించారు. రిసెప్షన్ సెంటర్‌లో బాధితుల సమస్యలను సానుకూలంగా విని, అవసరమైన అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్టేషన్ రైటర్, వి.హెచ్.ఎఫ్. సెట్, టెలికాన్ఫరెన్స్, ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్, పార్ట్ మ్యాప్, ఆయుధాల భద్రత గది, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరును విద్యార్థులకు వివరించామని చెప్పారు. నేరస్తులను గుర్తించడంలో ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీ, ఆధునిక దర్యాప్తు పద్ధతుల ప్రాధాన్యతను తెలియజేశామని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, మోటార్ వాహన చట్టాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నేరం జరిగినా, ఏదైనా సమస్య ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. విద్యార్థులు ఈ విషయాలను తమ కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల ప్రజలకు తెలియజేసి పోలీసుల సేవలపై అవగాహన పెంచాలని కోరారు. చదువు జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని, కష్టపడి విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు అనూష, రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు నైపుణ్య శిక్షణతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు - పెద్దపల్లి నియోజకవర్గంలో విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.70 కోట్లు ఖర్చు - టాస్క్ కేంద్రం ద్వారా గత ఏడాదిన్నరలో 2,600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు - ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.27 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల రెనోవేషన్ పనులను, రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన టాస్క్ ప్రాంతీయ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్

పెద్దపల్లి ప్రతినిధి (: జిల్లాలోని యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి, మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్ శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు అన్నారు. సోమవారం పెద్దపల్లిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.27 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల రెనోవేషన్ పనులను, రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన టాస్క్ ప్రాంతీయ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు మాట్లాడుతూ జిల్లాలోని యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పెద్దపల్లిలో టాస్క్ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా శిక్షణ పొందిన అనేక మంది యువత ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. టాస్క్ కేంద్రం ద్వారా ఇప్పటివరకు కల్పించిన ఉద్యోగ అవకాశాలు, సాధించిన పురోగతికి సంబంధించిన వివరాలతో వారం రోజుల్లో శ్వేతపత్రం విడుదల చేస్తామని వెల్లడించారు. విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.70 కోట్లు పెద్దపల్లి నియోజకవర్గంలో విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సుమారు రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వ విప్ తెలిపారు. పాఠశాలల పునరుద్ధరణ, అదనపు తరగతి గదుల నిర్మాణం తదితర పనులు చేపడుతున్నామని, పెద్దపల్లి మండలంలోనే సుమారు రూ.14 కోట్లు ఖర్చు చేశామని వివరించారు.గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని, పిల్లలను ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించడంపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు.ఈ విద్యా సంవత్సరంలో పెద్దపల్లి మండలంలో ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించినట్లు తెలిపారు. గతంలో పెద్దపల్లి జిల్లా విద్యా ఫలితాల్లో 32వ స్థానంలో ఉండగా, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన చర్యల ఫలితంగా ప్రస్తుతం 8వ స్థానానికి చేరుకుందని వివరించారు.ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉన్నత అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, లెక్చరర్లు విద్యాబోధన అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా సుమారు రూ.800 కోట్ల వ్యయంతో అల్పాహార పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. హరే రామ ట్రస్ట్ సహకారంతో అమలవుతున్న ఈ పథకం పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు దోహదపడుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ దశ అత్యంత కీలకమని, ఈ సమయంలో అనేక ఆలోచనలు, ఆకర్షణల వల్ల చదువుపై దృష్టి మరలే అవకాశం ఉంటుందని అన్నారు. అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిని సరైన మార్గంలో నడిపించాలని సూచించారు.విద్యతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ప్రస్తుతం విద్యార్థులకు చదువుకునేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని, విద్యార్థి దశలో సమయాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ఇప్పటి నుంచే లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు.విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలకు చేరుకుని సమాజానికి సేవ చేయాలని, తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పెద్దపల్లి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి సాధించే విజయంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లా గర్వపడే స్థాయికి చేరుకోవాలని అన్నారు.కళాశాలల్లో విద్యార్థులట హాజరును కఠినంగా పర్యవేక్షించాలని, హాజరు నిబంధనలు పాటించని విద్యార్థులను పరీక్షలకు అనుమతించకూడదని సూచించారు. ఈ విషయంలో రాజకీయ నాయకుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు ఉండవని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల సేవల్లో గణనీయమైన మార్పు గత మూడేళ్లలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గణనీయమైన మార్పులు వచ్చాయని ప్రభుత్వ విప్ తెలిపారు. ఇటీవల పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి నాలుగు అవార్డులు లభించాయని పేర్కొన్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ అద్దె ద్వారా వచ్చే ఆదాయం నేరుగా కళాశాలకు చేరేలా లిజిల్లా కలెక్టర్లి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. అదేవిధంగా ఆసుపత్రుల వద్ద ఉన్న షట్టర్లను అద్దెకు ఇచ్చి వచ్చే ఆదాయాన్ని ఆసుపత్రుల అవసరాలకు వినియోగించేలా చూస్తున్నామని వివరించారు. పేద ప్రజలు విద్య, వైద్య సేవల కోసం ఇబ్బందులు పడకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్య రంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ – జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యారంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పరీక్షా ఫలితాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ప్రతి విద్యాసంస్థ విద్యా ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీపడేలా అవసరమైన నైపుణ్యాలను సంపాదించే విధంగా విద్యాబోధన అందించాలని సూచించారు.ప్రస్తుత ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు టాస్క్ కేంద్రం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో టాస్క్ కేంద్రం ద్వారా గత ఏడాదిన్నర కాలంలో సుమారు 2,600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని వివరించారు.ఉద్యోగాలు కల్పించడంతోనే తమ బాధ్యత ముగిసిపోదని, ఉద్యోగాల్లో చేరిన యువతకు మూడు నెలల పాటు నిరంతరం ఫాలోఅప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. వారు ఉద్యోగాల్లో కొనసాగుతున్నారా, సక్రమంగా వేతనాలు అందుతున్నాయా అనే అంశాలను పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు మహిళలు ఇంటి నుంచే పని చేసుకుంటూ ఆదాయం సంపాదించేలా అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కూడా జిల్లాలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంచేందుకు టాస్క్ కేంద్రం దోహదపడు తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.కల్పన, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, అధ్యాపకులు తదితరులు, పాల్గొన్నారు.

స్మశానవాటికలో అభివృద్ధి శూన్యం కోట్ల రూపాయల ప్రజాధనం వృధా

- **బిజెపి యువమోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్**

కూకట్‌పల్లి అక్టోబర్ 26 : ఆల్విన్ కాలనీ డివిజన్ బిజెపి అధ్యక్షుడు చిన్నగాలొల్ల రాజు ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ లో ఉన్న హిందూ స్మశాన వాటిక, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బిజెపి యువమోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి సిఎంసి ఆల్విన్ కాలనీ (51) సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ స్మశాన వాటిక సమస్య ఏళ్ళ తరబడి ఉన్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. కోట్ల రూపాయలు అభివృద్ధి పేరిట వచ్చినా పంచుకోవడమే తప్ప ప్రజలకు స్మశాన వాటికను అందుబాటులోకి తీసుకురాలేదు అన్నారు. ఎల్లమ్మబండ ప్రాంతంలో ఎవరు మరణించినా కిలోమీటర్ల దూరం తీసుకెళ్లే దుస్థితి. చివాట్లతో దహన సంస్కారాలు చేసుకునే దుస్థితి ఉంది అన్నారు. అందుబాటులో స్మశాన వాటిక ఉన్నా అభివృద్ధికి నోచుకోక ప్రజలు అవస్థలు పడుతున్నా వ్యవస్థలో మార్పు లేకపోవడం దుర్మార్గమైనది అన్నారు. ఇప్పటికైనా వెంటనే పూర్తి మరమ్మత్తులు చేసి స్మశాన వాటికను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. లేనిపక్షంలో స్మశాన వాటికలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను, నిరసన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తాం అన్నారు. అలాగే డివిజన్ లో రోడ్ల సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా నాయకురాలు జ్యోతి, డివిజన్ బిజెపి నాయకులు రమేష్, కమల్, ప్రవీణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో అక్రమ బోర్‌వెల్స్ తవ్వకాలపై ఆరోపణలు!

అనుమతులు లేకుండానే బోర్ల తవ్వకాలా?

క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని స్థానికుల డిమాండ్..

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 : కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ పరిధిలో బోర్‌వెల్స్ తవ్వకాలు నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా లేదా అన్న అంశంపై చర్చ మొదలైంది. అనుమతులు లేకుండానే బోర్లు వేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పెరుగుతున్న నిర్మాణాలు, నీటి అవసరాల నేపథ్యంలో భూగర్భ జలాల వినియోగం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిస్థితుల్లో నిబంధనలకు విరుద్ధంగా బోర్‌వెల్స్ తవ్వితే భూగర్భ జలాలపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, భూగర్భ జలాల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, బోర్‌వెల్స్ తవ్వకాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలించాలని కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి, అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

పేదరికం నుంచి... రాజ్యాధికారం వరకు

మాదిగల రాజకీయ చైతన్యమే సామాజిక మార్పుకు పునాది

మాదిగల పోరాటానికి కట్కూరి సందీప్ పిలుపు

బ్యూరో,: మాదిగల పేదరికాన్ని తొలగించే పోరాటం అంటే ప్రతి మాదిగ కుటుంబం పేదరికం నుంచి బయటపడే పోరాటమేనని పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ కంటెస్టెడ్ క్యాండిడేట్ కట్కూరి సందీప్ అన్నారు. మాదిగలు రాజకీయంగా చైతన్యవంతులై, ఎవరి అండదండలు లేకుండా స్వతంత్రంగా చట్టసభల్లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారని, ఇది మన జాతిని విముక్తి వైపు నడిపించే రాజకీయ చైతన్యానికి నాంది అని ఆయన పేర్కొన్నారు. ఈ పోరాటం దశలవారీగా ముందుకు సాగుతున్న వేళ మాదిగ విద్యార్థులు ప్రేక్షకులుగా కాదు, పోరాటంలో భాగస్వాములుగా నిలవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు తరాల భవితవ్యాన్ని మార్చే ఈ ప్రయాణంలో మాదిగ విద్యార్థులే ప్రధాన భూమిక పోషించాలన్నారు. “చదువు మనకు జ్ఞానాన్ని ఇస్తే, చైతన్యం మనకు దిశను చూపుతుంది, పోరాటం మనకు విముక్తిని అందిస్తుంది” అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కట్కూరి సందీప్ హెచ్చరికలు జారీ చేశారు. మాదిగలకు ద్రోహం చేయాలని చూస్తే, ద్రోహులతో చేతులు కలపాలని ప్రయత్నిస్తే తెలంగాణలోని 36 లక్షల మాదిగలు మౌనంగా చూస్తూ ఊరుకోరని స్పష్టం చేశారు. మాదిగలకు ద్రోహం చేస్తే మాదిగల ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని అన్నారు. మాదిగల ఓట్లు మాదిగలకే వేసుకొని చట్టసభల్లో బలమైన ప్రాతినిధ్యాన్ని సాధిస్తూ రాజ్యాధికార దిశగా ముందుకు సాగాలని, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలను కాపాడుకుంటూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని ఆయన తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ భవిష్యత్తు తరాల కోసం పోరాడాలని ఆకాంక్షించారు.

మానవత్వం, సమానత్వానికి మహర్షి వాల్మీకి బోధనలు స్ఫూర్తి

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

గోదావరిఖని క్రైమ్ మహర్షి వాల్మీకి రచనలు మానవ జీవితంలో నైతిక విలువలు, కర్తవ్యనిష్ఠ, ధర్మబద్ధమైన జీవనానికి దిశానిర్దేశం చేస్తాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయనతో పాటు అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రపంచం ఉన్నంతకాలం వాల్మీకి చరిత్ర, ఆయన రచించిన రామాయణం చిరస్మరణీయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. రామాయణం సత్యం, నీతి, ధర్మం, కర్తవ్యబోధను మానవాళికి అందించిన అమూల్యమైన గ్రంథమని తెలిపారు. వాల్మీకి బోధనలు సత్యం, న్యాయం, ధర్మం, సమానత్వం వంటి సద్గుణాలను సమాజంలో పెంపొందించేందుకు నేటికీ స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. మానవత్వం వంటి ఉన్నత విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన మహర్షి వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శమని వివరించారు. ఆయన రచనలు ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అనుసరించేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు గోపి, రాజేంద్ర ప్రసాద్, చంద్రశేఖర్ గౌడ్, శ్రీనివాస్, ఆర్ఐలు దామోదర్, శేఖర్, రమేష్, సీసీ సందీప్, ఎస్సైలు ఉపేందర్, సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవిలో ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీలకు అవకాశం కల్పించాలి

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ విజ్ఞప్తి

నల్గొండ ప్రతినిధి, అక్టోబర్ 26 : గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవిలో ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు ఎన్నికల సమయంలో ఓటర్లుగా మిగిలిపోతున్నారని, రాజకీయ పదవులు, నిర్ణయాధికారంలో మాత్రం ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు సమయంలోనూ ఆర్థిక స్థోమత లేదనే కారణాలతో బీసీ నాయకులకు అవకాశాలు నిరాకరించారని విమర్శించారు. బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదని స్పష్టం చేశారు. వచ్చే నెలలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవిలో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి అర్హత, సామాజిక సేవ, పార్టీ పట్ల నిబద్ధత కలిగిన బీసీ నాయకుడికి అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కోరారు. తద్వారా బీసీల ఆత్మగౌరవాన్ని గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో సామాజిక న్యాయం, కులగణన, బీసీల హక్కుల గురించి ప్రస్తావిస్తున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్రంలో ఆ స్ఫూర్తికి అనుగుణంగా బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడం లేదని జాజుల లింగం గౌడ్ విమర్శించారు. సామాజిక న్యాయం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలోనూ ప్రతిబింబించాలని, బీసీలకు రాజకీయ పదవుల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీలకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవిలో అవకాశం కల్పించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల తన నిబద్ధతను చాటుకోవాలని జాజుల లింగం గౌడ్ కోరారు.

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి ప్రతినిధి : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,అదనపు కలెక్టర్ బి. శ్రీరాముల తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామ సర్పంచ్ గోగు రాజయ్య సర్వే నెంబర్ 390 మట్టి తవ్వకాలు రవాణాకు సంబంధించి అనుమతులు లీజు పరిమితి అంశాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు సమర్పించగా ఏడి మైన్స్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన గుర్రం రామస్వామి సర్వేనెంబర్ 83,83/సి1, 83/సి3 లో తనకు వ్యవసాయ భూమి ఎకరం 35 గుంటలు ఉందని, తనకు పాస్ పుస్తకం ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ శ్రీరాంపూర్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.సుల్తానాబాద్ మండలం చిన్న బొంకూరు గ్రామానికి చెందిన చింతల చుక్కమ్మ తన పేరు మీద ఉన్న ఇంట్లోని ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకొని దొంగ పట్టా చేయించుకోవడానికి చూస్తున్న గుజ్జుల నారాయణరెడ్డి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ సుల్తానాబాద్ కు. రాస్తూ విచారించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. శ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామానికి చెందిన మామిడి రామ్ కి గృహ జ్యోతి పథకం తన కుటుంబానికి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా శ్రీరాంపూర్ ఎంపీడీవో కు రాస్తూ పరిశీలించి అర్హత ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో బి. ప్రకాష్ సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 26: పాలేరు నియోజకవర్గంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక శ్రీ శ్రీ సర్కిల్ లోని క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పీ. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ఇంజనీరింగ్, ఇరిగేషన్, వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ తదితర శాఖల అధికారులతో మంత్రి సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, నిధుల మంజూరుపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులన్నింటినీ నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు ఉండకూడదని తెలిపారు. భూసేకరణ, ఇతర సాంకేతిక సమస్యలు ఉంటే సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. అభివృద్ధి పనులకు ఆటంకంగా మారిన విద్యుత్ స్తంభాలను త్వరితగతిన షిఫ్ట్ చేసేలా విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల్లో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం జరిగేలా, భూమికి బదులు భూమి, ఇంటికి బదులు ఇల్లు ఇచ్చే దిశగా వేగవంతమైన చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో పనుల బిల్లుల చెల్లింపుకు ఎలాంటి కొరత లేకుండా చూసేందుకు ప్రతి నెల 20 కోట్ల నుండి 25 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. దేశవ్యాప్తంగా ఎల్నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున నీరు, విద్యుత్‌లను అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్ సరఫరా క్రమబద్ధీకరించడానికి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు రెండో పంట వేయకూడదని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి, స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ సిఈ వాసంతి, ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యుత్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శేఖర్ రెడ్డి, మెడికల్ ఈ ఈ ఉమామహేశ్వర రావు, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, వివిధ ఇంజనీరింగ్ శాఖల ఈఈ లు, డిఈ లు, తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 26: పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లిలో ఉన్న 3వ శతాబ్దానికి చెందిన చారిత్రక బౌద్ధ స్తూపాన్ని, పరిసర ప్రాంతాలను అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం నేలకొండపల్లిలో పర్యాటక సదుపాయాల కల్పన, బౌద్ధ స్థల సంరక్షణ/పునరుద్ధరణ పనులకు మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 3 వ శతాబ్దానికి చెందిన బౌద్ధ స్థూపాన్ని సుమారు 50-55 సంవత్సరాల క్రితం నేలకొండపల్లి గ్రామంలో గుర్తించారని, దేశంలోనే అత్యంత పెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధిని ప్రారంభించినప్పటికీ పనులు పూర్తి చేయలేకపోయాయని అన్నారు. స్తూపం చుట్టూ ఉన్న ఒకటిన్నర కిలోమీటరు పరిధిలో పురావస్తు శాఖ అధికారులు గతంలో జరిపిన తవ్వకాల్లో ఎన్నో పురాతన వస్తువులు లభ్యమయ్యాయని, వాటిని భద్రపరిచేందుకు స్థానికంగా వసతులు లేకపోవడంతో హైదరాబాద్ మ్యూజియంలో ఉంచారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన బౌద్ధ మతస్థులు, స్థానికుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని, రాబోయే రోజుల్లో బౌద్ధ కట్టడాలపై అవగాహన ఉన్న ప్రముఖ నిపుణులను, అధికారులను ఇక్కడికి ఆహ్వానించి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాన్ని అభివృద్ధి చేయడానికి ఎంత ఖర్చయినా వెనుకాడబోమని, బౌద్ధులకు ప్రత్యేకాకర్షణగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో ఇట్టి ప్రదేశాన్ని గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెరిటేజ్ శాఖ డైరెక్టర్ కుతాడి అర్జున్ రావు, హెరిటేజ్ శాఖ ఉప సంచాలకులు నాగరాజు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తహశీల్దార్ రాంప్రసాద్, కన్సల్టెంట్ శ్రీనివాస్, టూరిజం డీఈ రామకృష్ణ, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ముచ్చర్ల నిమ్మ వాగు - అడవి మద్దులపల్లి ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

● సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ లీడర్ ఎన్ వి రాకేష్

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 26: ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని కామేపల్లి మండలం ముచ్చర్ల - అడవి మద్దులపల్లి గ్రామాల మధ్య నిమ్మవాగు నుంచి మద్దులపల్లి వరకు తీవ్రంగా దెబ్బతిన్న ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టి, నూతన రహదారిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కారేపల్లి - కామేపల్లి సంయుక్త మండలాల సహాయ కార్యదర్శి ఎన్.వి. రాకేష్ మాట్లాడుతూ ముచ్చర్ల - అడవి మద్దులపల్లి ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతిని పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల భయంతో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రహదారి గుంతల కారణంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు తరచూ మొరాయిస్తున్నాయని, టైర్లు దెబ్బతినడంతో పాటు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని పేర్కొన్నారు. దీంతో వాహనదారులు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని, గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని అన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ రహదారిపై ప్రయాణించడం మరింత కష్టంగా మారిందని తెలిపారు. ఈ రహదారిపై నిత్యం ప్రయాణించే రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాకేష్ అన్నారు. అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేటప్పుడు అంబులెన్స్‌లు సైతం ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. రహదారి దుస్థితి ప్రజల రోజువారీ జీవనంపై ప్రభావం చూపుతోందని, వాహనదారులకు ఆర్థిక భారం కూడా పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రజలు, వామపక్ష, రాజకీయ పార్టీలు పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన పరిష్కారం లభించలేదని అన్నారు. ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిమ్మవాగు నుంచి మద్దులపల్లి వరకు దెబ్బతిన్న రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, శాశ్వత పరిష్కారంగా నూతన రహదారి నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించి, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి రహదారి సమస్యను పరిష్కరించకపోతే స్థానిక ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎన్.వి. రాకేష్ హెచ్చరించారు. ప్రజల రవాణా సౌకర్యం, వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముచ్చర్ల - అడవి మద్దులపల్లి రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టి, నూతన రహదారిని నిర్మించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు రాజకీయ పార్టీల నాయకులు నల్ల పోతు మల్లికార్జునరావు, (బిజెపి) రాయల శ్రీను, (కాంగ్రెస్) రాయల పుల్లయ్య, (బిఆర్ఎస్) కొత్తపల్లి కోటేశ్వరరావు, బత్తుల మల్లమ్మ, చల్ల మంగ, చల్లా రాజు, ప్రణయ్, ఉపేందర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సెంటినరీ కాలనీ పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా బైరి శంకర్ ఏకగ్రీవ ఎన్నిక

రామగిరి, అక్టోబర్ 26:- సెంటినరీ కాలనీ పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా బైరి శంకర్, ఉపాధ్యక్షుడిగా వడ్నాల రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా కుందారపు సంతోష్, కోశాధికారిగా తన్నీరు ప్రదీప్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఎన్నికల ప్రక్రియను రామగిరి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు బండారి సదానందం, ఉపాధ్యక్షుడు చిలువేరు స్వామి, ప్రధాన కార్యదర్శి ఆడెపు వైకుంఠం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సత్తయ్య, రామగిరి మండల గౌరవ అధ్యక్షుడు ఎల్లే రామ్మూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బైరి శంకర్ మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్క కులబంధువుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘం సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. సంఘం అభివృద్ధి, పద్మశాలి బంధువుల ఐక్యతే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. సంఘంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని, అందరి అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ సమిష్టి నిర్ణయాలతో ముందుకు సాగుతామని అన్నారు. సంఘం అభ్యున్నతికి, సభ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, ప్రతి ఒక్కరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని బైరి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వంగ రాజ సమ్మయ్య, దొంతుల రవి, వేముల రాజు, చిలువేరు వెంకటేశం, వడ్నాల రాధాకృష్ణ, బండారి సారంగపాణి, కుంట చక్రి, తుమ్మ మధుసూదన్, కొండ సమ్మయ్య, సత్యనారాయణ, సతీష్, పెగడ రమేష్, వెంకన్న, బిక్షపతి, బుర్ల సదానందం, దాసరి రాజయ్య, దూడం కుమారస్వామి, డాక్టర్ సుంకే ప్రవీణ్, డాక్టర్ అశోక్, వెంకటేశం తో పాటు అధిక సంఖ్యలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణమా? అధికారుల నిర్లక్ష్యమా?

- దూలపల్లి సర్వే నంబరు 154లో భారీ షెడ్ నిర్మాణం - కొంపల్లి జిహెచ్ఎంసి లో ఫిర్యాదు చేసినా స్పందన కరువు.. - కొంపల్లి సిఎంసీ తీరుపై స్థానికుల ఆగ్రహం... - అలాగే స్థానిక పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వడం జరిగింది.. నా పేరు శంకర్ రెడ్డి...

కుత్బుల్లాపూర్ కొంపల్లి, అక్టోబరు 26: దూలపల్లి పరిధిలోని సర్వే నంబరు 154లో భారీ షెడ్ నిర్మాణం జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్మాణంపై కొంపల్లి సిఎంసీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు ఉన్నాయా? నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగానే పనులు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని చెబుతున్న అధికారులు.. ఫిర్యాదులపై ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలి సంబంధిత అధికారులు నిర్మాణ స్థలాన్ని పరిశీలించి అనుమతుల వివరాలను తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి సమస్యను పరిష్కరిస్తారా? లేక ఫిర్యాదులు కార్యాలయాలకే పరిమితమవుతాయా? అన్నది వేచి చూడాలి.

కులం పేరుతో దూషించిన వారి రిమాండ్

రామగిరి,అక్టోబర్ 26:- కమాన్ పూర్ మండలం నాగారం గ్రామపంచాయతీ పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన అగ్గిమల్ల అనిల్ పై దాడి చేసి కులం పేరుతో దూషించిన వారిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఏసిపి మడత రమేష్ తెలిపారు. ఈనెల 20న నాగారం గ్రామానికి చెందిన మాడిశెట్టి ఆదిత్య రొంపి కుంట గ్రామానికి చెందిన చిందం సాయి ప్రదీప్ , పాత కక్షలు నేపథ్యంలో అగ్గిమల్ల అనిల్ పై దాడి చేసి కులం పేరుతో దూషించారు. దీంతో అగ్గిమల్ల అనిల్ తండ్రి అగ్గిమల్ల రాజు ఫిర్యాదు మేరకు కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు మేరకు గోదావరిఖని ఏసిపి మడత రమేష్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ జరిపించారు. అనంతరం విచారణ మేరకు ఇరువురిని సోమవారం గోదావరిఖని ఏసీపి కార్యాలయంలో అరెస్టు చేసి రిమాండ్కు పంపించినట్లు కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ పేర్కొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

రామగిరి,అక్టోబర్ 26: కమాన్ పూర్ మండలంలో వెంటనే వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని భారతీయ జనతా పార్టీ కమాన్ పూర్ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ అన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి అని రైతులు రైతులు వరి ధాన్యం వేసేందుకు వీలు లేకుండా పోయిందని పేర్కొన్నారు. కమాన్ పూర్ మండలంలో సుమారు 8000 ఎకరాల్లో వరి ధాన్యం వేయడం జరిగిందని ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమై వారం రోజులు గడిచిన ఇప్పటివరకు పరికొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తమ ఇండ్ల వద్ద రోడ్లపైనే వరి ధాన్యం వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు . రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు పడే దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఐకెపి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు.

బీజేపీలో చేరిన పలువురు యవకులు

కూకట్ పల్లి అక్టోబర్ 26 : కూకట్ పల్లి నియోజకవర్గం ప్రశాంత్ నగర్ డివిజన్ పరిధిలోని ఏవీబీ పురానికి చెందిన పలువురు యువకులు యువ నాయకులు కార్తీక్, లక్ష్మణరావు నాయకత్వంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి యంజాల పద్మయ్య ఆధ్వర్యంలో సోమవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, దేశాభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, కేంద్ర ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులై యువకులు తాము బీజేపీలో చేరినట్లు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, యువత పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై బీజేపీలో చేరడం సంతోషకరమని, దేశాభివృద్ధి, ప్రజాసేవలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నూతనంగా పార్టీలో చేరిన యువకులకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వీరన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పి ఆర్ టి యు సంఘ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన నాళం వెంకటేశ్వర్లు

శుభాకాంక్షలు తెలియజేసిన పి ఆర్ టి యు ఖమ్మం జిల్లా శాఖ మరియు నేలకొండపల్లి మండలశాఖ

ఖమ్మం ప్రతినిధి, (అక్టోబర్ 25: నల్గొండలో జరిగిన పి ఆర్ టి యు రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అట్టహాసం గా జరిగింది. రాష్ట్ర కౌన్సిల్ సమావేశం లో రాష్ట్ర శాఖ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నేలకొండపల్లి మండలం ఎం పి పి ఎస్ కట్టకొమ్ము తండ లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న సంఘ సీనియర్ సభ్యులు నాళం వెంకటేశ్వర్లు రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక కావటం పట్ల పి ఆర్ టి యు ఖమ్మం జిల్లా శాఖ మరియు నేలకొండపల్లి మండల శాఖ పక్షాన హర్షం వ్యక్తం చేస్తూ పలువురు వారికి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్..

జమ్మికుంట, అక్టోబర్ 26 : పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. హుజూరాబాద్ ఏసీపీ ఆధ్వర్యంలో పట్టణ సీఐ రామకృష్ణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే వివిధ విధులు, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, ప్రజలకు అందించే పోలీస్ సేవలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ వ్యవస్థ పనితీరు, పోలీసుల విధులు, ప్రజల భద్రత కోసం చేపడుతున్న చర్యలను విద్యార్థులకు వివరించారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను విద్యార్థులు పరిశీలించారు. పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశ్యమని తెలిపారు.

స్థానిక యువతకు ఉపాధి.. వ్యాపారాలకు కొత్త అవకాశాలు!

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో రామగిరి ఖిల్లాకు రోప్‌వే - యువతకు సవాల్.. గెలిచిన వారికి వన్‌ప్లస్ ఫోన్ గిఫ్ట్! - రామగిరి ఖిల్లా ట్రెక్కింగ్ చేసిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ - 10 కిలోమీటర్లు కాలినడకన రామగిరి ఖిలా ఎక్కిన ఎంపీ వంశీ - ఏడు గేట్లు, రెండు సరస్సులు దాటి.. నాలుగు గుట్టలు అధిరోహించి రాములవారి, శివాలయాల దర్శనం - రామగిరి ఖిల్లాకు రోప్‌వే మంజూరు చేయించిన వంశీ పర్యాటక అభివృద్ధికి బాటలు - ఎంపీ వంశీకృష్ణ ప్రత్యేక చొరవ.. కేంద్రం నుంచి రోప్‌వేకు ఆమోదం!

రామగిరి, అక్టోబర్ 26:- చారిత్రక రామగిరి ఖిల్లాకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. రామగిరి ఖిల్లా అభివృద్ధి, పర్యాటక రంగం విస్తరణకు ఎంపీ యువతకు సవాల్.. గెలిచిన వారికి వన్‌ప్లస్ ఫోన్ గిఫ్ట్ ప్రకటించారు. సోమవారం రామగిరి ప్రాంతంలో సుమారు 10 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి, ఖిల్లా పూర్తి ప్రాంతాన్ని సందర్శించారు.ఏడు గేట్లు దాటి, రెండు సరస్సులు అధిగమించి, నాలుగు గుట్టలను అధిరోహిస్తూ అత్యంత సాహసోపేతంగా ఖిల్లా పైభాగానికి చేరుకున్న ఎంపీ వంశీకృష్ణ అక్కడి శివాలయం, శ్రీరామచంద్ర స్వామి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామగిరి ఖిల్లాలోని చారిత్రక కట్టడాలు, పురాతన ఆలయాలు, ప్రకృతి అందాలను స్వయంగా పరిశీలించారు. రామగిరి ఖిల్లాకు రోప్‌వే.. పర్యాటక అభివృద్ధికి కొత్త దిశ! రామగిరి ఖిల్లా పర్యాటక అభివృద్ధికి కీలకమైన రోప్‌వే ఏర్పాటుకు కేంద్ర స్థాయిలో కృషి చేసి నిధుల మంజూరుకు చొరవ తీసుకోవడం ద్వారా ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఈ ప్రాంత అభివృద్ధిపై తన నిబద్ధతను చాటుకున్నారు. రోప్‌వే అందుబాటులోకి వస్తే పర్యాటకులు ఖిల్లాను సందర్శించడం మరింత సులభతరం కానుంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు సైతం చారిత్రక ఖిల్లాను సులభంగా సందర్శించే అవకాశం కలుగుతుంది. దీంతో మంథని ప్రాంతానికి పర్యాటక రంగంలో ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. ట్రెక్కింగ్ చేసిన వంశీకృష్ణ.. యువతకు సవాల్.. విజేతకు వన్‌ప్లస్ ఫోన్ గిఫ్ట్! రామగిరి ఖిల్లాలో సుమారు 10 కిలోమీటర్ల మేర సాహసోపేతంగా ట్రెక్కింగ్ చేసిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ యువతకు స్ఫూర్తినిస్తూ ట్రెక్కింగ్ సవాల్ విసిరారు. యువతలో సాహస క్రీడలు, ఫిట్‌నెస్ పట్ల ఆసక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ సవాల్‌ను ముందుకు తీసుకువచ్చారు. ఈ సవాల్‌లో విజేతగా నిలిచిన వారికి వన్‌ప్లస్ ఫోన్‌ను బహుమతిగా అందించనున్నట్లు ప్రకటించారు. చారిత్రక సంపదకు కొత్త వెలుగు.. పర్యాటక అభివృద్ధికి కొత్త దారి! రామగిరి ఖిల్లా తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇక్కడి పురాతన ఆలయాలు, కోట నిర్మాణాలు, ప్రకృతి అందాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం.రామయ్యల దర్శనం నుంచి ఖిల్లా పైభాగంలోని శివాలయం, శ్రీరామచంద్ర ఆలయాల సందర్శన వరకు సాగిన ఎంపీ పర్యటన రామగిరి ప్రాంత అభివృద్ధిపై ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనంగా నిలిచింది.రామగిరి ఖిల్లాకు ప్రపంచస్థాయి గుర్తింపు.. మంథని ప్రాంతానికి పర్యాటక వైభవం తీసుకురావాలనే లక్ష్యంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ ముందుకు సాగుతున్నారు. దశాబ్దాలుగా సరైన పర్యాటక సదుపాయాల కోసం ఎదురుచూస్తున్న చారిత్రక రామగిరి ఖిల్లాకు కొత్త రోజులు రానున్నాయి. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ కృషితో రామగిరి ఖిల్లాకు రోప్‌వే ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం ప్రాంత పర్యాటక అభివృద్ధిలో కీలక ముందడుగుగా నిలిచింది. చారిత్రక సంపదను పర్యాటక ఆకర్షణగా మలిచి, మంథని ప్రాంతానికి కొత్త గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ఎంపీ చేసిన ప్రయత్నాలు ఫలితాన్నిచ్చాయి. ఎంపీ వంశీకృష్ణ ప్రత్యేక చొరవ.. కేంద్రం నుంచి రోప్‌వేకు ఆమోదం! రామగిరి ఖిల్లా ప్రాధాన్యతను గుర్తించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం సమర్పించి రోప్‌వే ఏర్పాటుకు కృషి చేశారు. ఖిల్లా చారిత్రక ప్రాధాన్యతతో పాటు పర్యాటకులకు మెరుగైన రవాణా సదుపాయాల అవసరాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చేసిన ప్రయత్నాలకు ఫలితంగా 2.1 కిలోమీటర్ల రోప్‌వే ప్రాజెక్టుకు రూ.2.46 కోట్ల నిధులు విడుదల చేసిన కేంద్రం 2.1 కిలోమీటర్ల రోప్‌వే.. రామగిరి ఖిల్లాకు కొత్త ఆకర్షణ! కొండ దిగువ నుంచి ఖిల్లా శిఖరం వరకు రోప్‌వే ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకులు, సందర్శకులు సులభంగా పైకి చేరుకునే అవకాశం కలగనుంది. రామగిరి ఖిల్లాలోని చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలు, అరుదైన ఔషధ మొక్కలను వీక్షించేందుకు ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడనుంది. రోప్‌వేతో పాటు ఇతర పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా రూ.2.50 కోట్ల అదనపు నిధులు మంజూరుస్థానిక యువతకు ఉపాధి.. వ్యాపారాలకు కొత్త అవకాశాలు! రామగిరి ఖిల్లా అభివృద్ధి చెందితే మంథని, పెద్దపల్లి పరిసర ప్రాంతాల్లో పర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉంది. దీంతో హోటళ్లు, రవాణా, చిరు వ్యాపారాలు, పర్యాటక సేవలకు డిమాండ్ పెరిగి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావచ్చు. చారిత్రక వారసత్వాన్ని పరిరక్షిస్తూ ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి బాటలు వేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. పెద్దపల్లి అభివృద్ధే లక్ష్యంగా ఎంపీ వంశీకృష్ణ అడుగులు! పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా స్థానిక ప్రాంతాలకు కొత్త గుర్తింపు కల్పించాలనే దిశగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేస్తున్న కృషిలో రామగిరి ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చి పర్యాటకులకు అందుబాటులోకి వస్తే, రామగిరి ఖిల్లా తెలంగాణలోని ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారనుంది రామగిరి ఖిల్లాకు రోప్‌వే సాధన పెద్దపల్లి జిల్లా పర్యాటక భవిష్యత్తుపై కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో ముందుకు సాగుతున్న ఈ ప్రాజెక్టు విజయవంతమైతే చారిత్రక రామగిరికి కొత్త వైభవం, స్థానిక యువతకు కొత్త అవకాశాలు లభించనున్నాయి.

అయ్యప్ప సొసైటీలో అక్రమ బోర్లపై చర్యలేవీ? అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు!

బోర్లు వేస్తున్న ప్రాంతంలో తక్షణమే తనిఖీలు చేపట్టాలి: మిద్దెల మల్లారెడ్డి

రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : అయ్యప్ప సొసైటీలో అనుమతులు లేకుండా యథేచ్ఛగా బోర్లు వేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు చేసేందుకు ఫోన్ చేసినా స్పందించడం లేదని మిద్దెల మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనల అమలు కనిపించడం లేదని విమర్శించారు. అయ్యప్ప సొసైటీలోని ప్రధాన 100 ఫీట్ల రహదారిపై బీఏఈఎల్ హోటల్ పక్కన ఉన్న ప్లాట్‌తో పాటు ప్లాట్ నంబర్ 687లో ఎలాంటి అనుమతులు లేకుండానే పట్టపగలు బోర్లు వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మిద్దెల మల్లారెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో రెండు బోరు యంత్రాలతో లోతుగా బోర్లు వేస్తున్న విషయాన్ని ఫొటోలు తీసి, లొకేషన్ వివరాలతో సహా వాట్సాప్ ద్వారా సంబంధిత అధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై శేరిలింగంపల్లి ఎమ్మార్వో మైపాల్ రెడ్డికి ఫోన్ చేసి సమాచారం అందించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన రాలేదని ఆరోపించారు. అనంతరం సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయికిరణ్‌కు ఫోన్ చేయగా, ఒకసారి స్పందించి చూస్తామని చెప్పారని, ఆ తర్వాత మళ్లీ ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదని తెలిపారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాల్సిన అధికారులు ఫోన్ కాల్స్‌కు కూడా సమాధానం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గిపోతున్న నేపథ్యంలో నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మిద్దెల మల్లారెడ్డి అన్నారు. భవిష్యత్తులో తాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉన్నందున, బోర్ల తవ్వకాలకు సంబంధించి అమల్లో ఉన్న నిబంధనలను అధికారులు కఠినంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న బోర్ల తవ్వకాలపై వెంటనే విచారణ చేపట్టి, అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్లు తేలితే సంబంధిత బోర్లను నిలిపివేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. శేరిలింగంపల్లి ఎమ్మార్వో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించడంతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించి అక్రమ బోర్ల తవ్వకాలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడం అధికారుల బాధ్యత అని, ప్రజలు ఫిర్యాదు చేసినప్పుడు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మిద్దెల మల్లారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మార్వో స్వయంగా వారానికి కనీసం ఒకరోజు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అయ్యప్ప సొసైటీలో బోర్ల తవ్వకాలపై తక్షణ చర్యలు తీసుకోకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజల సంక్షేమం, భూగర్భ జలాల పరిరక్షణే లక్ష్యంగా ఈ అంశంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

అవినీతి వ్యతిరేక ప్రచారానికి సింగరేణి సంస్థ ఎల్లప్పుడూ మద్దతు

- విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

రామగిరి, అక్టోబర్ 26:- సింగరేణి సంస్థ అన్ని ఏరియాల వ్యాప్తంగా ఈనెల 26 నుండి నవంబర్ 1 వరకు నిర్వహించనున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా సోమవారం నాడు జి.ఎం కార్యాలయంలో రామగుండం-త్రీ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ యం.రామ్మోహన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేసి వారోత్సవాలను ప్రారంభించి, సత్యనిష్ట ప్రతిజ్ఞ చేయడం జరిగింది. అనంతరం ఉద్యోగులకు అవగాహన కల్పించడం కోసం విడుదల చేసిన గోడ పత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "నిజాయితీ తో సమృద్ధి" అనే అంశంపై ఈ అవగాహన వారోత్సవాలను జరుపుకుంటున్నామని, అవినీతి వ్యతిరేక ప్రచారానికి సింగరేణి సంస్థ ఎల్లప్పుడూ మద్దతు తెలుపుతుందని, ప్రతి ఉద్యోగి అప్రమత్తతతో విధులు నిర్వహిస్తూ సంస్థకు నష్టం వాటిల్లే ఘటనలు అరికట్టడంలో తమవంతు కృషి చేయాలని, రానున్న రోజుల్లో సింగరేణి సంస్థను అత్యున్నత శిఖరాలకు తీసుకెళ్లేలా కృషి చేయాలని కోరారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ప్రతి ఉద్యోగికి అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు.దీనిలో భాగంగా ఉద్యోగులకు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. సింగరేణిలో అవినీతిని పారద్రోలడంతో పాటు ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించడం, అక్రమాలకు తావు లేకుండా చూసేందుకు విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా, ఎలాంటి స్వార్థం లేకుండా పని చేసినప్పుడే అవినీతిని అరికట్టగలమని అన్నారు.ఆర్ జి త్రీ, ఏపీఏ ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి సత్యనిష్ఠ ప్రతిజ్ఞ చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు జి.రాజేందర్, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జి.లక్ష్మీనారాయణ, ఐ ఈ డిజియం బి.టి.మురళీ కృష్ణ, ఇంచార్జ్ పర్సనల్ విభాగాధిపతి ఎన్.వంశీధర్, పర్యావరణ అధికారి ప్రశాంత్ జీవన్, సీనియర్ పిఓ పి.రాజేశం, ఇతర అధికారులు, జి.ఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సన్నబియ్యం అక్రమ తరలింపుపై రేషన్ డీలర్‌పై ఫిర్యాదు

- ఆరోపణలు నిజమైతే క్రిమినల్ కేసు నమోదు చేయాలని సివిల్ సప్లై అధికారులకు సీరియస్ గా ఆర్డీఓ ఆదేశాలు



నల్గొండ ప్రతినిధి, అక్టోబర్ 26: పేదల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న సన్నబియ్యం పక్కదారి పడుతోందా..? రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు చేరాల్సిన బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు దామరచర్ల మండలంలో తీవ్ర చర్చకు దారితీశాయి. దామరచర్ల మండలం తెట్టకుంట గ్రామపంచాయతీ పరిధికి చెందిన రేషన్ డీలర్ ఆలంపల్లి చామంతి ప్రస్తుత గ్రామ పంచాయతీ సర్పంచ్ సన్నబియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గ్రామస్తులు గుర్తించి, పట్టుకున్న బియ్యాన్ని సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు జాప్యం చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో మంగల్ దుబ్బ తండకు చెందిన ధీరావత్ శ్రీను నాయక్ మిర్యాలగూడ ఆర్డీఓ రమణారెడ్డికి సోమవారం నాడు ఫిర్యాదు చేశాడు ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తున్న సన్నబియ్యం అక్రమంగా పక్కదారి పడితే, దాని వల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోయే అవకాశం ఉందని అంతేకాకుండా గ్రామపంచాయతీ ఎన్నికల్లో తనకు ఓట్లు వేయనందున నేను రేషన్ బియ్యం ఇవ్వనంటూ గ్రామస్తులపైన దురుసుగా మాట్లాడడం చేసేదని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ తరలింపు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఫిర్యాదుపై స్పందించిన ఆర్డీఓ రమణారెడ్డి వెంటనే విచారణ చేపట్టాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించిన ఆర్డిఓ ఆరోపణలు విచారణలో వాస్తవమని తేలితే సంబంధిత రేషన్ డీలర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. పేదల బియ్యంపై అక్రమాలకు చెక్ పడేనా..? ప్రభుత్వం పేదల కోసం కేటాయించిన రేషన్ బియ్యం పక్కదారి పడుతుందనే ఆరోపణలు నిజమైతే, ఇది సాధారణ విషయం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు ఎంత వేగంగా విచారణ పూర్తి చేస్తారు..? ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు..? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఆడెపు వెంకటేశం ఆరోపణలన్నీ అవాస్తవాలు...

ఓటమి బాధతోనే నిరాధారమైన ఆరోపణలు ...

పోచమ్మ గుడి వద్ద ప్రజల ముందు ప్రమాణం చేద్దాం!

కాంగ్రెస్ నాయకులకు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ సవాల్

పెద్దపల్లి ప్రతినిధి : రాఘవపూర్ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకుడు ఆడెపు వెంకటేశం చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలని, ఓటమి బాధతోనే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడని తమపై చేసిన ఆరోపణల్లో నిజం లేదని నిరూపించేందుకు పోచమ్మ గుడి వద్ద ప్రమాణం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ నాయకులు ఆడపు వెంకటేశ్, కుమ్మరి తిరుమల్‌కు దమ్ముంటే గుడి వద్దకు రావాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ సవాల్ విసిరారు.ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకే తమపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం పెద్దపల్లి ఐటీఐ కళాశాల మైదానంలో మోదుంపల్లి శ్రవణ్, కుమ్మరి నవీన్‌లతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమపై చేస్తున్న ఆరోపణలు నిజమని నిరూపించకపోతే చట్టపరంగా పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత ఆరోపణలకు దిగడం సరికాదని హితవు పలికారు. తాను 2012 నుంచి సీపీఎం పార్టీలో కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నానని అశోక్ తెలిపారు. తనకు జీఎస్టీ రిజిస్టర్డ్ ఎస్ఆర్ఏ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఉందని, హైదరాబాద్ లోనూ బ్రాంచ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంస్థ ద్వారా ముగ్గురికి ఉపాధి కల్పిస్తూ సొంత డబ్బులతో జీతాలు చెల్లిస్తున్నానని చెప్పారు. ఇతరులు బైకులు, ఇళ్లు కొనిచ్చారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, వాటిని నిరూపిస్తే తన ఇంటిని తానే కూల్చుకుంటానని సవాల్ విసిరారు. తమ ఆస్తులు, వాహనాలు, వ్యాపారాలన్నీ స్వశక్తితో సంపాదించుకున్నవేనని స్పష్టం చేశారు. తాము గంజాయి సరఫరా చేస్తున్నామన్న ఆరోపణలను ఖండించిన అశోక్, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని, తమపై ఆధారాలు ఉంటే చర్యలు తీసుకోవాలని ప్రశ్నించారు. రాఘవాపురంలో గంజాయిని పూర్తిగా నిర్మూలించాలని తామే పోలీసు అధికారులను కలిసి కోరినట్లు వెల్లడించారు. గ్రామపంచాయతీలో సీసీటీవీ కెమెరాలు కార్యదర్శి సమక్షంలో తొలగించారని, ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. జిల్లా అధికారులు మట్టిని సీజ్ చేసి జరిమానా విధిస్తే దానికి తామెలా బాధ్యులమవుతామని ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల్లో జరిగిన ఘర్షణలు, ఎస్సీ, ఎస్టీ కేసులపై స్పందిస్తూ తాము ఎవరిపైనా దాడి చేయలేదని, తమపై కావాలనే అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తే వాస్తవాలు బయటపడతాయని తెలిపారు.ఎన్నికల్లో ఓటమి బాధతోనే తమపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. తాము ఒకే సిద్ధాంతంతో ప్రజల కోసం పనిచేస్తున్నామని, ప్రత్యర్థులు తమ రాజకీయ ప్రస్థానంపై ఆత్మపరిశీలన చేసుకోవాలని అశోక్ సూచించారు. తమపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని, ఆరోపణలను నిరూపించలేకపోతే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరినవీన్, కల్లెపల్లిఅశోక్,మోదుంపల్లి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

- అనుమతులు లేని క్లినిక్ సీజ్.. జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు

- మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ కె. ఆనంద్ హెచ్చరిక

మేడ్చల్, అక్టోబర్ 26: మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందించే వారిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, పీసీపీఎన్‌డీటీ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఉప్పల్, రామంతాపూర్, బోడుప్పల్ ప్రాంతాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రామంతాపూర్‌లోని శ్రీ గాయత్రి కేంద్రాన్ని తనిఖీ చేసిన అధికారులు పీసీపీఎన్‌డీటీ చట్టంలోని నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. వైద్య పరీక్షలకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించడంతోపాటు చట్టబద్ధమైన విధానాలను అనుసరించాలని ఆదేశించారు. ఉప్పల్‌లోని యూవీ డయాగ్నస్టిక్ సెంటర్‌ను కూడా తనిఖీ చేసి కేంద్రం నిర్వహణ, నిబంధనల అమలుకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. బోడుప్పల్‌లోని మమత క్లినిక్‌ను తనిఖీ చేయగా, అవసరమైన రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్నట్లు, క్లినిక్ నిర్వహిస్తున్న వ్యక్తికి అవసరమైన అర్హతలు లేనట్లు అధికారులు గుర్తించారు. దీంతో నిబంధనల ప్రకారం సదరు క్లినిక్‌ను తక్షణమే సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ కె. ఆనంద్ మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అవసరమైన అనుమతులు లేకుండా వైద్య కేంద్రాలను నిర్వహించడం, అర్హతలు లేని వ్యక్తులు వైద్య సేవలు అందించడం, పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ఉల్లంఘించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు, అవసరమైన అనుమతులు పొందాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను విధిగా పాటించాలని సూచించారు. చట్టాల అమలును పర్యవేక్షించడంతోపాటు ఉల్లంఘనలను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కీసర డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత, జిల్లా ఎంసీహెచ్/సీఐఏ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ గీత ప్రసాద్, అదనపు ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ పవన్ రెడ్డి, డిప్యూటీ డెమో వసంత కుమారి పాల్గొన్నారు.

జడ గంగయ్య యాదవ్ దశదిన కర్మకు హాజరై నివాళులర్పించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

నల్గొండ ప్రతినిధి, అక్టోబర్ 26 వేములపల్లి: మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని వేములపల్లి మండల కేంద్రంలో టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ జడ రాములు యాదవ్ తండ్రి కీ.శే. జడ గంగయ్య యాదవ్ దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ గంగయ్య యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ-2005 నుంచి బీసీసీఐకి మినహాయింపు

భారత క్రికెట్ నియంత్రణ మండలికి భారీ ఊరట

భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)కి భారీ ఊరట లభించింది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ)-2005 నుంచి బీసీసీఐకి మినహాయింపు ఇచ్చింది. ఇటీవల బీసీసీఐని ప్రభుత్వ పరిధిలోకి తెస్తూ నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లును కేంద్రం రూపొందించిన విషయం తెలిసిందే. ఈ బిల్లు ప్రకారం దేశంలో గుర్తింపు పొందిన ఏ క్రీడా సంఘమైనా ప్రజలకు చెందినదేనని, తమ విధులు, అధికారాలు నిర్వహించే విషయంలో సమాచారా హక్కు చట్టం(ఆర్టీఐ)-2005 పరిధిలోకి అది వస్తుందని అందులో పేర్కొంది. అయితే దీనిపై బీసీసీఐ అభ్యంతరం తెలిపింది. ఇతర క్రీడా సంఘాల తరహాలో తాము ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం తీసుకోవడం లేదని, బోర్డు ఆర్టీఐ పరిధిలోకి తీసుకురావద్దని పలుమార్లు విజ్ఞప్తి చేసింది. చివరకు బోర్డు ఆశించిన ప్రకారం వారికి ఊరట కలిగించేలా ప్రభుత్వం కొత్త బిల్లులో సవరణను జోడించింది. సవరించిన బిల్లు ప్రకారం ప్రభుత్వం నుంచి నిధులు, సాయం పొందే క్రీడా సంఘాలు మాత్రమే ఆర్టీఐ పరిధిలోకి వచ్చేలా మార్పులు చేసింది. తాజా సవరణతో ఆర్టీఐ ద్వారా బీసీసీఐని ప్రశ్నించే అధికారం సామన్య ప్రజలకు లేకుండా పోయింది. 'తాజా స్పోర్ట్స్ బిల్లులో బీసీసీఐ అంశం ఒక సమస్యగా కనిపించింది. ఆర్థిక సహకారం తీసుకోవడం లేదనే కారణం చూపించి ఈ బిల్లు ఆమోదం పొందకుండా పార్లమెంట్‌లో అడ్డుకునే అవకాశం ఉండేది. లేదా ఇదే కారణంతో బీసీసీఐ కోర్టుకెక్కేది కూడా. అందుకే సవరణ చేయాల్సి వచ్చింది.'అని కేంద్ర క్రీడా శాఖ ఉన్నతాధికారి ఒకరు మీడియాకు తెలిపారు. ఆర్టీఐ నుంచి మినహాయింపు లభించినా.. కొన్ని ఇతర నిబంధనలు బీసీసీఐని ప్రభుత్వం ప్రశ్నించేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొంది చట్టంగా మారితే బీసీసీఐ కూడా వెంటనే జాతీయ క్రీడా సమాఖ్యగా కొత్త రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. 2028 నుంచి క్రికెట్ కూడా ఒలింపిక్ క్రీడగా మారనుండటం దీనికి ఒక కారణం.కొత్త బిల్లు ప్రకారం నిధులు పొందకపోయినా.. వ్యవస్థ నడిచేందుకు ఇతర రూపాల్లో సహాయ సహకారాలు తీసుకుంటుంది కాబట్టి జవాబుదారీతనం ఉండాల్సిందే. బీసీసీఐ నేషనల్ స్పోర్ట్స్ ట్రెబ్యునల్ పరిధిలోకి రావడం వల్ల వివాదాలు ఏర్పడితే ఎన్ఎస్‌టీ పరిష్కరిస్తుంది. ట్రెబ్యునల్ తీర్పులను సుప్రీం కోర్టులో మాత్రమే సవాల్ చేయాల్సి ఉంటుంది.

అంకిత్ కుమార్ తుఫాను బ్యాటింగ్‌తో విధ్వంసం

ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2025 ప్రారంభమైంది. దీంతో కొంతమంది ఐపీఎల్ స్టార్లు ఈ లీగ్‌లో తమ సత్తా చాటుతున్నారు. ప్రస్తుతం లీగ్‌లో 7వ మ్యాచ్ గత రాత్రి జరిగింది. ఇందులో వెస్ట్ ఢిల్లీ బ్యాటర్ అంకిత్ కుమార్ సౌత్ ఢిల్లీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తన తుఫాను బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించాడు. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్ తరపున ఆడే అంకిత్ కుమార్ తన విధ్వంసక బ్యాటింగ్‌తో మ్యాచ్ ఉత్కంఠను తారా స్థాయికి చేర్చాడు. సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్‌తో జరిగిన మ్యాచ్‌లో, అంకిత్ 46 బంతుల్లో 96 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చాడు. తన తుఫాన్ ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 7 సిక్సర్లు బాదేశాడు. అంకిత్ విధ్వంసక బ్యాటింగ్ ఫలితంగా వెస్ట్ ఢిల్లీ జట్టు 15.4 ఓవర్లలో 186 పరుగుల లక్ష్యాన్ని చేరుకుంది. అంకిత్ తన బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించడమే కాదు.. ఐపీఎల్ ఫేమ్ దిగ్వేష్ రతితో మైదానంలో అతని వాగ్వాదం మ్యాచ్ వాతావరణాన్ని మరింత హీటెక్కించింది. ఈ సమయంలో, ఇద్దరి మధ్య కొంత వాగ్వాదం జరిగింది. అయితే, త్వరగానే గొడవ సద్దుమణిగింది. ఈ మ్యాచ్‌లో దిగ్వేష్ రతి చాలా ఖరీదైనవాడిగా నిరూపితమయ్యాడు. అతను కేవలం 2 ఓవర్లలో 29 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంకిత్ కుమార్‌తో పాటు, క్రిష్ యాదవ్ కూడా వెస్ట్ ఢిల్లీ తరపున అద్భుతంగా రాణించాడు. వికెట్ కీపర్ బ్యాట్స్ మాన్ క్రిష్ 42 బంతుల్లో 67 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్ లో అతను 9 ఫోర్లు, 2 సిక్సర్లు కొట్టాడు. ఈ విధంగా, అంకిత్‌తో కలిసి, క్రిష్ మొదటి వికెట్‌కు 158 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ మ్యాచ్ గురించి మాట్లాడితే, సౌత్ ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. సౌత్ ఢిల్లీ తరపున కున్వర్ బిధురి, కెప్టెన్ ఆయుష్ బదోని ఆకట్టుకున్నారు. మిగతా ప్లేయర్లు ఆకట్టుకోలేకపోయారు. ఈ కారణంగానే ఆ జట్టు 200 పరుగుల కంటే తక్కువ స్కోరుకే పరిమితమైంది. దీని కారణంగా స్టార్లతో నిండిన సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్స్ జట్టు ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది.

రాజస్థాన్ రాయల్స్‌తో సంజూ శాంసన్ తెగదెంపులు

ఐపీఎల్ 2025 ముగిసినప్పటి నుంచి సంజూ శాంసన్ పేరు చర్చనీయాంశంగా మారింది. అతడు 2015 నుంచి రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న ఈ ప్లేయర్.. వచ్చే సీజన్‌లో కొత్త జెర్సీలో కనిపించనున్నాడి ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా అతడు చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి చేరతాడని వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. తనను జట్టు నుంచి రిలీజ్ చేయాలని సంజూ శాంసన్‌ను రాజస్థాన్ రాయల్స్‌ను కోరినట్లు క్రిక్‌బజ్ నివేదించింది. దీంతో అతడికి, రాజస్థాన్‌కు మధ్య తీవ్రమైన విభేధాలు తలెత్తినట్లు స్పష్టమవుతోంది.ఐపీఎల్ 2025 సందర్భంగా రాజస్థాన్ రాయల్స్, సంజూ శాంసన్ మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు నుంచి వచ్చిన తర్వాత 2015లో సంజూ.. రాజస్థాన్ రాయల్స్‌లో చేరాడు. అప్పటి నుంచి ఇదే జట్టులో కొనసాగుతున్నాడు. టీనేజ్ ప్లేయర్‌గా జట్టులోకి వచ్చిన అతడు.. కెప్టెన్ అయ్యాడు. కానీ గత సీజన్‌లో మేనేజ్‌మెంట్ తీరుపట్ల అతడు హర్ట్ అయినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఓపెనింగ్ ప్లేస్ విషయంలోనూ వివాదాలు తలెత్తినట్లు సమాచారం. వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైశ్వాల్‌లు ఓపెనర్‌లుగా సెట్ కావడంతో సంజూ వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు రావాల్సి వచ్చింది. ఇదే అతడు ఆర్ట్ అయ్యేందుకు కారణమా అంటే స్పష్టత లేదు. ఇక హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో సైతం అతడికి పొసగడం లేదని సమాచారం.కొన్ని రోజులుగా సంజూ శాంసన్.. సీఎస్కే మధ్య చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. సంజూ ఫ్యామిలీ అయితే ఏకంగా వచ్చే సీజన్‌లో అతడు రాజస్థాన్ రాయల్స్‌తో ఆడబోడని చెప్పేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తనను రిలీజ్ చేయలని అతడు రాజస్థాన్ రాయల్స్‌ను కోరినట్లు తెలుస్తోంది. అయితే ఐపీఎల్ 2025 వేలానికి ముందు రాజస్థాన్ రాయల్స్ రూ.18 కోట్లకు సంజూను రిటైన్ చేసుకుంది. 2027 సీజన్ వరకు ఈ ఒప్పందం కొనసాగుతోంది. ఒకవేళ అగ్రిమెంట్ బ్రేక్ చేయాలంటే ఫ్రాంఛైజీ అంగీకారం తప్పనిసరి. సంజూనే జట్టును వీడాలని భావిస్తున్నందున.. ప్రస్తుతం ఉన్న అవకాశాలపై ఆ ఫ్రాంఛైజీ దృష్టిసారించింది! ఇందులో భాగంగా సీఎస్కే సహా పలు ఇతర ఫ్రాంఛైజీలతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. అయితే కేవలం వన్ వే ట్రేడ్ ద్వారా సంజూను ఇచ్చేందుకు రాజస్థాన్ ఆసక్తి చూపించడం లేదట. బదులుగా ఆటగాడిని రీప్లేస్ చేయాలని చూస్తోందట. అందుకే డీల్ ఆలస్యం అవుతోందని సమాచారం. మరి సంజూ విషయంలో రాజస్థాన్ రాయల్స్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది తేలాల్సి ఉంది.

భారత్‌కు బుమ్రా ఎన్నో గొప్ప విజయాలను అందించాడు

బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌పై ట్రోలింగ్ : హర్షా భోగ్లే

వరల్డ్ నెంబర్ వన్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా పై నెట్టింట ట్రోలింగ్ జరుగుతోంది. ముఖ్యంగా అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీలో బుమ్రా రెండు మ్యాచ్‌లకు రెస్ట్ తీసుకోవడంపై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. దానికి తోడు ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో బుమ్రా ఆడిన మూడు టెస్టుల్లో భారత్ రెండు ఓడిపోయింది. ఒకదాంట్లో ఫలితం రాలేదు. బుమ్రా రెస్ట్ తీసుకున్న రెండు టెస్టుల్లోనూ టీమిండియా విజయం సాధించింది.ఇదే విషయమై సోషల్ మీడియాలో కొందరు బుమ్రాని టార్గెట్ చేస్తూ వచ్చారు. దాంతో కామెంటేటర్ హర్షా భోగ్లే నెటిజన్లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ పేసర్లలో బుమ్రా ఒకడని, ఇలాంటి విమర్శలు అన్నీ దాటుకుని వచ్చాడని హర్షా గుర్తు చేశాడు. అలాంటి ఆటగాడిని ట్రోల్ చేయడం అంటే అజ్ఞానమే అంటూ గట్టిగా వాయించేశాడు. అభినందించకపోయినా ఇలా చేయడం కరెక్ట్ కాదన్నాడు."నిజంగా? బుమ్రాని ట్రోల్ చేస్తున్నావా? నువ్వు వాళ్లల్లో ఒకడివి కాకపోతే మంచిదే. అయితే వాళ్లలో ఒకడివే అయితే.. బుమ్రా అవడానికి ఎంత కష్టాన్ని, త్యాగాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందో నీకు ఎలాంటి అవగాహన లేదని చెప్పొచ్చు. ఇంకా.. అతను ఎంత గొప్ప మ్యాచ్ విన్నరో నీకు అర్థం కానట్టే.

అతను భారతదేశానికి అత్యుత్తమ విజయాలు అందించిన బౌలర్లలో ఒకడు. నిజానికి మిగతా బౌలర్ల కన్నా దాదాపు ఎక్కువ ఓవర్లే వేశాడు" అంటూ ఎక్స్ వేదికగా హర్షా భోగ్లే పోస్ట్ చేశాడు.హర్షా భోగ్లే పోస్ట్ కింద ఓ నెటిజన్ రిప్లయ్ ఇచ్చాడు. మేమేమీ ట్రోల్ చేయడం లేదు. వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ గురించి మాత్రమే ప్రశ్నిస్తున్నాము. అది కూడా తప్పనే అంటారా? అని ప్రశ్నించాడు. దానికి హర్షా రిప్లయ్ ఇస్తూ.. 'కాదు, అది మంచిదే. అయితే గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే.. ప్రతీ శరీరం వేరుగా ఉంటుంది. అన్ని సమస్యలకు ఒకటే పరిష్కారం చూపలేము కదా' అని రిప్లయ్ ఇచ్చాడు. అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీలో జస్ప్రీత్ బుమ్రా మూడు మ్యాచ్‌లలో ఐదు ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఈ సిరీస్‌లో 119.4 ఓవర్లు వేసిన బుమ్రా 14 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లండ్ - ఇండియా సిరీస్‌లో మహమ్మద్ సిరాజ్ 23 వికెట్లతో టాప్ బౌలర్‌గా నిలవగా.. జోష్ టంగ్ 19 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. బెన్ స్టోక్స్ 17 వికెట్లు పడగొట్టగా, ఆ తర్వాత బుమ్రా 14 వికెట్లతో నిలిచాడు.

స్పోర్ట్స్

గుత్తా జ్వాలపై సోషల్ మీడియాలో ప్రశంసల జల్లు

భారత మాజీ బ్యాడ్మింటన్ ప్లేయర్ గుత్తా జ్వాలపై సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురుస్తోంది. శభాష్.. గుత్తా జ్వాల అంటూ నెటిజన్లు ఆమె చేసిన పనిని కొనియాడుతున్నారు. కొందరు మహిళలు తమ అందం, పొంకం సడలిపోతుందనే భ్రమతో పిల్లలను కనేందుకే అయిష్టత చూపుతున్న ఈ కాలంలో గుత్తా జ్వాల తనకు ఎక్కువగా ఉన్న 6.7 లీటర్ల పాలను దానం చేసింది. నీలోఫర్‌కు అనుబంధంగా పనిచేసే ఓ మిల్క్ బ్యాంకు ద్వారా ఆమె ఈ దానం చేసింది. నీలోఫర్ పిల్లల ఆసుపత్రికి వచ్చే శిశువులకు ఈ చనుబాలను సదరు బ్యాంకు అందిస్తోంది. అందం పోతుందని సరోగసి ద్వారా పిల్లలను కంటూ ఆయాల చేత పెంచుతున్న సెలబ్రిటీలు ఉన్న ఈ రోజుల్లో గుత్తా జ్వాలా ఎలాంటి సంకోచాలు మనసులోకి రానివ్వకుండా తన సంతానానికి సరిపోగా మిగిలే పాలను లీటర్ల కొద్దీ దానం చేయడం గొప్ప విషయమని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. ఎంతో మంది సెలబ్రిటీలకు ఆమె స్ఫూర్తిదాయకమని కొనియాడుతున్నారు. ఆమె చేసిన పని చనుబాల దానంపై ఉన్న అపోహల్ని కూడా దూరం చేస్తోందని మెచ్చుకుంటున్నారు. నవజాత శిశువులకు చనుబాలు చాలా ముఖ్యమని, గుత్తా జ్వాల తరహాలో మిగతా సెలబ్రిటీలు కూడా ముందుకు వచ్చి మహిళలందరికి అవగాహన కల్పించాలని కోరుతున్నారు. తమిళ హీరో విష్ణు విశాల్‌ను గుత్తా జ్వాలా ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ ఏప్రిల్‌లో వారికి పాప పుట్టింది. విష్ణు విశాల్ సోదరి సంగీత్ వేడుకలో తొలిసారి జ్వాల గుత్తాను కలిశాడు. అప్పుడు వీరి మధ్య చిగురించిన స్నేహం ఆ తరవాత ప్రేమగా మారింది. జ్వాల గుత్తా ఫుల్ ఫామ్‌లో ఉన్న సమయంలోనే సహచర ఆటగాడు చేతన్ ఆనంద్‌తో ప్రేమలో పడ్డారు. చాలా కాలం పాటు ప్రేమాయణం సాగించిన తర్వాత వీళ్లిద్దరూ 2005లో వివాహం చేసుకున్నారు. ఆరేళ్ల వైవాహిక జీవితం తర్వాత 2011లో విడిపోయారు. ఇక అప్పటి నుంచి ఆమె ఒంటరిగానే జీవనం సాగిస్తున్నారు. మరోవైపు కాస్ట్యూమ్ డిజైనర్ రజనీ నటరాజ్‌తో 2011లో విష్ణు విశాల్ పెళ్లి జరిగింది. కొన్ని కారణాల వల్ల 2018లో వీరు విడాకులు తీసుకున్నారు. వారికి ఆర్యన్ అనే నాలుగేళ్ల కుమారుడున్నాడు.

టీమిండియాకు అదృష్టంగా మారిన ధృవ్ జురెల్

యువ జట్టుతో ఇంగ్లాండ్‌లో పర్యటించిన టీమిండియా సిరీస్‌ను గెలవలేకపోయింది. కానీ వారి స్వంత గడ్డపై 2 మ్యాచ్‌ల్లో ఇంగ్లీష్ జట్టును ఓడించగలిగింది. శుభ్‌మాన్ గిల్ కెప్టెన్సీలో యువ భారత జట్టు ఇంగ్లాండ్‌పై అద్భుతమైన ప్రదర్శన చేసింది. సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఈ సిరీస్‌లోని చివరి మ్యాచ్‌లో ఓ ప్లేయర్‌కు ఆడే అవకాశం లభించడం టీమిండియా అదృష్టమని మరోసారి నిరూపితమైంది. టీమిండియా యొక్క ఆ అదృష్ట ఆటగాడి పేరు ధృవ్ జురెల్. తన వికెట్ కీపింగ్, బ్యాటింగ్‌తో టీమిండియాలో స్థానం సంపాదించడానికి ప్రయత్నిస్తున్న ధృవ్, టీమ్‌కే అదృష్టవంతుడిగా మారుతున్నాడు. జురెల్ తన టెస్ట్ కెరీర్‌లో ఇప్పటివరకు ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. ఆశ్చర్యకరంగా.. భారత్ ఈ మ్యాచ్‌లన్నింటినీ గెలుచుకుంది. అంటే, ధ్రువ్ జురెల్ తన టెస్ట్ కెరీర్‌లో ఇంకా ఒక్క ఓటమి కూడా చవిచూడలేదు. నిజానికి.. టెస్ట్ క్రికెట్ చరిత్రలో, ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అత్యధిక టెస్ట్ మ్యాచ్‌లను గెలిచిన రికార్డు వెస్టిండీస్ మాజీ ఆల్ రౌండర్ ఆల్డిన్ బాప్టిస్ట్ పేరు మీద ఉంది. బాప్టిస్ట్ తన టెస్ట్ కెరీర్‌లో వరుసగా 10 టెస్ట్ మ్యాచ్‌లు ఆడితే అన్నింటిలో టీమ్ గెలిపొందింది. అతను తన కెరీర్ చివరి వరకు ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా ఓడిపోలేదు.ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ యువ వికెట్ కీపర్ కమ్ బ్యాట్స్‌మన్ 2024లో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ కెరీర్‌లో అరంగేట్రం చేశాడు. మొదటి టెస్ట్‌లోనే అతను తన బ్యాటింగ్, వికెట్ కీపింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. జురెల్ ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో 36.42 సగటుతో 255 పరుగులు చేశాడు. ఇందులో 1 హాఫ్ సెంచరీ కూడా ఉంది. అదే సమయంలో వికెట్ కీపర్‌గా అతను 9 క్యాచ్‌లు, 2 స్టంపింగ్‌లు ఉన్నాయి.

విశ్వజ

ఆమె నదిని దాటించింది

కింద గాఢంగా పారే చీనాబ్ నది. పైన 359 మీటర్ల ఎత్తులో రైలు బ్రిడ్జి. కశ్మీర్ లోయలో ఉధమ్‌పూర్ నుంచి బారాముల్లా వరకు వేయదలచిన భారీ రైలు మార్గంలో చీనాబ్‌ను దాటడం ఒక సవాలు. దాని కోసం సాగిన ఆర్చ్ బ్రిడ్జి నిర్మాణంలో మన తెలుగు ఇంజినీర్ మాధవీ లత కృషి కీలకం. 'వరల్డ్ హైయ్యస్ట్ రైల్వే బ్రిడ్జి' నిర్మాణంలో పాల్గొన్న మాధవీ లత పరిచయం. ఒక సుదీర్ఘకల నెరవేరబోతోంది. సుదీర్ఘ నిర్మాణం ఫలవంతం కాబోతూ ఉంది. దేశ అభివృద్ధిలో కీలకమైన రవాణా రంగంలో ఎన్ని ఘన నిర్మాణాలు సాగితే అంత ముందుకు పోతాము. అటువంటి ఘన నిర్మాణం జాతికి అందుబాటులో రానుంది. జమ్ము కశ్మీర్‌లో ప్రపంచంలోనే అతి ఎత్తయిన రైల్వేవంతెన ట్రయల్ రన్ పూర్తి చేసుకుని త్వరలోనే కార్యకలాపాలు నిర్వహించనుంది. అయితే ఈ క్లిష్టమైన నిర్మాణంలో తెలుగు మహిళా ఇంజినీర్ కీలకపాత్ర పోషించడం ఘనంగా చెప్పుకోవాల్సిన సంగతి. తెనాలికి చెందిన ప్రొఫెసర్ గాలి మాధవీలతదే ఈ ఘనత. చీనాబ్ ఆర్చ్ బ్రిడ్జ్.. భారతీయ రైల్వే 2004లో జమ్ము కశ్మీర్‌లో భారీ రైలు ప్రాజెక్ట్‌కు అంకురార్పణ చేసింది. జమ్ము సమీపంలోని ఉధంపూర్ నుంచి శ్రీనగర్ సమీపంలోని బారాముల్లా వరకు రైలు మార్గం నిర్మించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ మార్గంలో రీసీ జిల్లా బాక్కల్ దగ్గర చీనాబ్ నదిపై వంతెన నిర్మించాల్సి వచ్చింది. ఇది చాలా క్లిష్టమైన నిర్మాణం. ఎందుకంటే ఇది ఐఫిల్ టవర్ కంటే 35 మీటర్ల ఎత్తు వంతెన అవుతుంది. అయినప్పటికీ మన ఇంజినీర్లు దశల వారీగా నిర్మాణం పూర్తి చేయగలిగారు. జూలైలో దీని కార్యకలాపాలు పూర్తిస్థాయిలో మొదలవుతాయి. ప్రొఫెసర్‌గా పని చేస్తూ... ప్రకాశం జిల్లా ఏడుగుండ్లపాడుకు చెందిన మాధవీలత కాకినాడలో ఇంజినీరింగ్ చేశారు. ఐ.ఐ.టి. మద్రాస్‌లో పీహెచ్‌డీ చేశారు. బెంగళూరులోని ఐ.ఐ.ఎస్.సి.లో 'రాక్ మెకానిక్స్'లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ను కొనసాగించారు. బెంగళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న మాధవీలత అక్కడే సెంటర్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ విభాగానికి చైర్‌పర్సన్ గా కూడా ఉంటూ సైన్స్ ను, టెక్నాలజీని గ్రామీణాభివృద్ధికి చేరువ చేసే ప్రాజెక్టులకు నాయకత్వం వహిస్తున్నారు. అయితే 'రాక్ మెకానిక్స్'లో మాధవీలతకు ఉన్న అనుభవమే ఆమెను చీనాబ్ వంతెన నిర్మాణంలో పాల్గొనేలా చేసింది. చీనాబ్ వంతెన నిర్మాణానికి రూ.1400 కోట్లు వ్యయం చేస్తే 300 మంది సివిల్ ఇంజినీర్లు, 1300 మంది వర్కర్లు రేయింబవళ్లు పని చేశారు. బ్రిడ్జ్‌ను రెండు కొండల మధ్య నిర్మించాల్సి ఉన్నందున ఇంజినీరింగ్ డిజైన్ చాలా క్లిష్టంగా మారింది. అయినప్పటికీ అక్కడి రాళ్లను పరిశోధించి, అధ్యయనం చేసిన మాధవీలత, పటిష్టమైన వాలు స్థిరీకరణ ప్రణాళికను రూపొందించి, అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చారు. ఆమె విశ్లేషణ, సాంకేతిక సూచనలను దేశంతోపాటు విదేశాల్లోని పలువురు నిపుణులు తనిఖీ చేసి ఆమోదించడంతో వంతెన నిర్మాణం ముందుకు సాగింది. ఈ రైలు మార్గంలో నిర్మించిన కొన్ని సొరంగాల నిర్మాణంలోనూ మాధవీలత పాల్గొన్నారు. అవకాశం ఇలా... ఉధంపూర్ బారాముల్లా కొత్త రైలుమార్గంలో చీనాబ్ నదిపై స్టీల్ ఆర్చ్ వంతెన నిర్మాణ బాధ్యతను కొంకణ్ రైల్వేస్ 'ఆఫ్కాన్స్ ' సంస్థకు ఇచ్చింది. ఆఫ్కాన్స్ సంస్థకు జియో టెక్నికల్ కన్సల్టెంటుగా ఉన్న మాధవీలతకు అలా ప్రాజెక్టులో పనిచేసే అవకాశం లభించింది. 'ప్రాజెక్టు నిర్మాణంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. చీనాబ్ నదిపై రెండు ఎత్తయిన వాలుకొండలను కలుపుతూ సాగిన ఈ వంతెన నిర్మాణంలో వాలు స్థిరత్వం కీలకమైంది. రాక్ మెకానిక్స్ సాంకేతికత, స్థిరత్వ అంశాలను అర్థం చేసుకోవటం, కొండ వాలుల స్థిరత్వాన్ని పొందటానికి నేను పరిష్కారాలను అందించటంతో ఇప్పుడో ఇంజినీరింగ్ అద్భుతం సాక్షాత్కరించింది. జోన్ భూకంపాలను, గంటకు 266 కి.మీ వేగంతో వీచే గాలులను, తీవ్రమైన పేలుళ్లను తట్టుకునేలా ఈ వంతెన నిర్మితమైంది' అన్నారు మాధవీలత. 'నేల పటిష్టతపై ఐ.ఐ.టి మద్రాస్‌లో నా పీహెచ్‌డీ పరిశోధనల్లో భాగంగా పాలిమర్‌లను ఉపయోగించి పటిష్టమైన రోడ్ల నిర్మాణానికి వినూత్న సాంకేతిక విధానాన్ని రూపొందించాను. ఆ దిశగా మూడు దశాబ్దాలపాటు చేసిన పరిశోధనల ఫలితంగా నేడు భూకంప నిరోధక శక్తి కలిగిన నిర్మాణాల్లో పాలిమర్‌లని, రబ్బర్ టైర్ల వంటి వ్యర్థపదార్థాలని వినియోగించగలుగుతున్నాం' అన్నారు. చీనాబ్ వంతెన నిర్మాణానికి రేయింబవళ్లు శ్రమించిన మాధవీలత, ఈ ప్రాజెక్టు కోసం ఎన్నో వ్యక్తిగత త్యాగాలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. తన కుటుంబ ప్రాధాన్యతలను పక్కనపెట్టి, సైట్‌ను సందర్శించిన సందర్భాలను గుర్తు చేసుకుంటూ, 'నా పిల్లల పరీక్షల సమయాల్లో కూడా వాళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చేది. నా భర్త హరిప్రసాద్‌రెడ్డి, పిల్లలు అభిజ్ఞ, శౌర్యల సహనం, సహకారాలతో ఇది సాధ్యమైంది. చీనాబ్ వంతెన నా సొంత ప్రాజెక్టులా మారిపోయింది' అన్నారు.



సమ్మర్‌లో డీహైడ్రేషన్‌కు చెక్‌పెట్టేవి ఇవే..!

సమ్మర్ ఇలా ప్రారంభమయ్యిందో లేదో అప్పుడే ఎండలు దంచికొడుతున్నాయి. ఓ పక్క జనాలు వడదెబ్బకు తాళ్లలేక పిట్టల్లా రాలిపోతున్నారు. ఈ కాలంలో మండే ఎండలను తట్టుకోవాలంటే అధికంగా నీరు తాగడమే కాక శరీరం డీహైడ్రేషన్‌కి గురికాకుండా ఉండేలా చూసుకోవాలి. కేవలం నీరు, మజ్జిగ రూపంలో ద్రవ పదార్థాలు తీసుకోవడమే కాకుండా వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉ?న్న పండు తీసుకోవడం మరింత మేలు. అందుకోసం తీసుకోవాల్సిన పండ్లు ఏంటో సవివరంగా తెలుసుకుందామా..! పుచ్చకాయ.. అధిక వాటర్ కంటెంట్‌కి ప్రసిద్ధ. వేసవిలో దీన్ని తీసుకుంటే దాహం కట్టడుతుంది. వడదెబ్బ నుంచి సులభంగా బయటపడగలుగుతాం. వేసవి తాపం నుంచి మంచి ఉపశమనం కలిగించే ఫ్రూట్ పుచ్చకాయ అని చెప్పొచ్చు. దోసకాయలు.. ఇది ఏకంగా 96% నీటిని కలిగి ఉంటుంది. నీటితో ప్యాక్ చేసిన మంచి ఫ్రూట్‌గా పేర్కొనవచ్చు. కేలరీలు తక్కువగా ఉండటమే గాకుండా కావల్సినన్నీ విటమిన్లు, ఫైబర్లు ఉంటాయి. ఈ దోసకాయని సలాడ్‌రూపంలో లేదా అల్పాహారంగానూ తీసుకోవడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. కొబ్బరి నీరు.. ఇది ద్రవాల తోపాటు కోల్పోయిన నీటిని ఎలక్ట్రోలైట్‌లను తిరిగి నింపుతుంది. ఇందులో ఉండే సోడియం, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లు కీలకమైన శారీరక విధులకు మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తాయి. డీహైడ్రేషన్ నుంచి కాపాడటంలో సమర్థవంతంగా ఉంటుంది. టమోటాలు.. వీటిలో కూడా 94% నీటి కంటెంట్ ఉంటుంది. ఫైబర్, కేలరీలు సమృద్ధిగా ఉంటాయి. ఇందులో ఉండే లైకోపిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని అందించి గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుతాయి. చర్మ ఆరోగ్యంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే కాల్షియం కంటెంట్ ఎముకల ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. బూడిద గుమ్మడికాయ.. ఇందులో 96% నీటి కంటెంట్ ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఆమ్లత్వంతో కూడిన ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల పెద్దప్రేగుని నిర్వహించడంలోను జీర్ణ సమస్యలను తగ్గించడంలోనూ సమర్థవంతంగా ఉంటుంది. బెల్ పెప్పర్స్.. క్యాప్సికంనే బెల్ పెప్పర్స్ అని కూడా అంటారు. ఇది వంటకాలకు మంచి రుచిని, వాసనను అందిస్తాయి. విటమిన్ సీ, విటమిన్ బీ6, బీటా కెరోటిన్, థయామిన్, ఫోలిక్ యాసిడ్ వంటి విటమిన్లు ఉంటాయి. స్ట్రాబెర్రీలు.. స్ట్రాబెర్రీల్లో దాదాపు 91% నీటి శాతాన్ని కలిగి ఉంటాయి. దీనిలో విటమిన్ సి, ఫోలేట్, మాంగనీస్‌తో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇది కడుపులో మంటను తగ్గించడంలోనూ వివిధ వ్యాధుల నుంచి రక్షించడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. నారింజలు.. ఇందులో కూడా మంచి నీరు కంటెంట్ ఉంటుంది. విటమిన్ సీ, పొటాషియం, వంటి యాంటి యాక్సిడెట్లు సమృద్ధిగా ఉంటాయి. గుండె ఆరోగ్యం, వాపు తగ్గింపుకు తోడ్పడుతుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే మూత్ర పిండాల్లో రాళ్లను నివారించడంలో సహాయ పడుతుంది. ఇందులో సిట్రిక్‌యాసిడ్ కంటెంట్, ఆర్ద్రీకరణను ప్రోత్సహించే లక్షణాలు కారణంగా డీహైడ్రేన్‌ని నివారించడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది.

వేసవిలో గుండె సమస్యలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గుండెకు సంబంధించిన అన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. ఈ ఎండాకాలంలో ఎండలు గతంలో కంటే ఎక్కువగా ఉంటున్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గుండె చాలా సున్నితమైన అవయవం, మానసికంగా కొంచం ఇబ్బందులకు గురి అయినా గుండె చాలా దెబ్బతింటుంది. ఒంటి కాల్చేసే, శరీరంలోని నీటిని మొత్తం పీల్చేసే ఎండల వల్ల బాడీ పూర్తిగా డీహైడ్రేట్ అయిపోతుంది. ఇలాంటప్పుడు గుండెకు సంబంధించి వైద్యులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోమంటున్నారో తెలుసుకుందాం. బ్లడ్ క్లాట్ డీహైడ్రేషన్ శరీరం డీహైడ్రేట్ అయిపోవడం వల్ల రక్తం మరింత చిక్కగా అయిపోయి క్లాట్ అయ్యే అవకాశం ఉందంటున్నారు. అలా డీహైడ్రేషన్‌తో గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. తాజాగా జరిపిన సర్వేల ప్రకారం ప్రతీ సంవత్సరం గుండెపోటు సమస్యలు పెరిగిపోతూనే ఉన్నాయ్. సమ్మర్‌లో ఎండలను లెక్కచేయకుండా క్రీడలు, స్విమ్మింగ్, టూర్లు, బయట ఎక్కువ తిరగడం వల్ల యువకుల్లో కూడా గుండెపోటు వచ్చే అవకాశాలు పెరిగాయని చెబుతున్నారు. వైటమిన్ డి సూర్యుడి నుంచి శరీరానికి కావలసిన వైటమిన్-డి అందుతోంది. కాని ఎక్కువ సూర్యతాపం వల్ల డీహైడ్రేట్ కాకుండా ఉండాలంటే సన్‌స్క్రీన్ లోషన్స్ అప్లై చేసుకోవడం, నీరు నిరంతరంగా తాగుతూ ఉండడం చేస్తుండాలి. వడదెబ్బ తగలకముందే వాటి లక్షణాలను గుర్తించాలి. వడ దెబ్బ తగిలితే శరీరం ఒకవైపు పనిచేయనట్టు అనిపిస్తుంది. కంటి చూపు మందగిస్తుంది, అలసట, వికారంగా ఉంటుంది. మెడ, కండరాళ్ల నొప్పి ఉంటుంది. తలనొప్పి, కోమా, మతిమరుపు లాంటి లక్షణాలు ఉంటాయ్. కూలర్ కొనే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..! వడదెబ్బ లేదా గుండెపోటు రాకుండా ఉండాలంటే.. నీరు లేదా నీరు ఎక్కువగా ఉన్న పుచ్చపండు, కొబ్బరిబోండా, బటర్ మిల్క్ లాంటివి తీసుకోవాలి. మీరు ఒక వేల గుండె, కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టే అయితే ఈ పళ్లను తినే ముందు వైద్యుడిని తప్పకుండా సంప్రదించాలి.

మీరు ఎప్పటికీ యవ్వనంగా
కనిపించాలంటే, ఈ తప్పులు చేయకండి

ప్రతి వ్యక్తి తన వయస్సు ఎంత పెరిగినా తన చర్మం కనిపించకూడదని కోరుకుంటాడు. ప్రజలు దీని కోసం చాలా ప్రయత్నాలు చేస్తారు మరియు అత్యంత సాధారణమైనవి మేకప్ మరియు రసాయన ఆధారిత సౌందర్య సాధనాలు. అయితే, చర్మం మరియు శరీరాన్ని యవ్వనంగా ఉంచడం చాలా కష్టం కాదు, కొన్ని సాధారణ విషయాలను గుర్తుంచుకోవాలి. అలాగే, రోజువారీ జీవితంలో కొన్ని పొరపాట్లు ఉంటాయి, వాటికి దూరంగా ఉండాలి. కాబట్టి మీ చర్మం యవ్వనంగా ఉండాలంటే ఏ తప్పులు చేయకూడదో ఈరోజు తెలుసుకుందాం. మిమ్మల్ని యవ్వనంగా ఉంచుకోవాలనుకుంటే, మీ చర్మం, మనస్సు మరియు భావోద్వేగాలను జాగ్రత్తగా చూసుకోండి. కానీ మీరు దానిని యవ్వనంగా ఉంచాలనుకుంటే, వీలైనంత ఎక్కువ నీరు త్రాగండి మరియు మీ చర్మాన్ని తేమగా ఉంచుకోండి మరియు ఆరోగ్యంగా ఉండటానికి ప్రయత్నించండి. మీరు మీ శరీరం మరియు చర్మాన్ని ఎంత ఎక్కువ శ్రద్ధ తీసుకుంటే, మీరు ఎక్కువ కాలం యవ్వనంగా ఉండగలరు. ఏప్రిల్ 24 మేషరాశిలో శుక్రుడు ఎంట్రీ ఈ 3 రాశులకు శుక్రదశ ప్రారంభం.. వ్యాపారంలో మంచి లాభాలను పొందుతారు. రోజువారీ జీవితంలో మనం ఇలాంటి ఎనిమిది తప్పులు చేస్తాం, దీని వల్ల మన చర్మం కాలానికి ముందే మసలి లక్షణాలు కనిబడుతాయి. మొబైల్ నుండి దూరం ఉంచండి మరియు దాని స్క్రీన్‌పై అనవసరంగా సమయం గడపకండి. కాబట్టి ఏ తప్పులను నివారించాలో ఇక్కడ తెలుసుకోండి. 1. మేకప్ తొలగించకపోవడం: ఈ రోజుల్లో చాలా మంది మేకప్ వాడుతున్నారు. ఇప్పటి వరకు నేను దానిని ఉపయోగించలేదు. కానీ మీరు మీ పని కారణంగా మేకప్ వేసుకున్నట్లయితే, రాత్రి పడుకునే ముందు మేకప్‌ను సరిగ్గా శుభ్రం చేసుకోండి. ఈ క్లీనింగ్ మేకప్ కంటే రెండు రెట్లు ఎక్కువ సమయం తీసుకోవాలి. 1717 ఇదొక ఏంజెల్ నంబర్:మరి మీ ఏంజెల్ నంబర్ మీకు తెలుసా? దీన్ని బట్టి మీ భవిష్యత్తును అర్థం చేసుకోండి..! 2. చర్మాన్ని శుభ్రం చేయకపోవడం: మీ చర్మాన్ని సరిగ్గా శుభ్రం చేసుకోండి. దీని అర్థం మీరు ఫేస్ వాష్‌తో శుభ్రం చేస్తారని కాదు, ఎక్స్‌ఫోలియేట్ కూడా చేయండి. 3. ముఖం తప్ప మరేదైనా దృష్టి పెట్టవద్దు: ఉగాది పంచాంగం 2024-25: ఈ సంవత్సరం సింహరాశి వారి జాతకం ఏమిటి?ఆదాయం తక్కువ ఖర్చులు ఎక్కువ? మీ మెడ మరియు చేతులను పూర్తిగా శుభ్రం చేసుకోండి.

ఈ పువ్వులతో మధుమేహానికి చెక్ పెట్టొచ్చు! ఎలాగంటే..?

మధుమేహాన్ని అదుపులో ఉంచే పండ్లు, ఆయుర్వేద మూలికలు, ఆకులు గురించి విన్నాం. కానీ పూలతో

మధుమేహ్నాని నిర్వహించొచ్చు అనే దాని గురించి విన్నారా..?. ఈ పువ్వులు మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలే చేస్తాయట. ఇదేంటి పువ్వులా అనుకోకండి ఎందుకంటే వీటిని పనీర్ పువ్వు లేదా పనీర్ దోడి అని పిలుస్తారు. మధుమేహానికి సంబధించిన గాయాలను నయం చేయడంలో సమర్థవంతంగా పనిచేస్తుందట. డయాబెటిస్ రోగిల పాలిట దీన్ని వరం అని పిలుస్తారు. ఇంతకీ ఏంటి పనీర్ పువ్వులు..? ఎక్కడ లభిస్తాయి తదితరాలు చూద్దామా..! పనీర్ పువ్వును పనీర్ దోడి అని కూడా అంటారు. ఎందుకిలా అంటారంటే..ఈ మొక్క పండ్లు పాలు గడ్డకట్టే లక్షణాల కారణంగా దీన్ని పనీర్‌దోడి అంటారు. ఇది మేజిక్ హీలర్‌గా పనిచస్తుంది. ఇది ఎక్కువగా తూర్పు మధ్యధరా ప్రాంతంలో కనిపిస్తుంద. భారతదేశంలో ఎక్కువగా హర్యాన, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ వంటి పొడి ప్రాంతాల్లో సాధారణంగా కనిపిస్తుంది. ఈ మొక్క గుబురుగా ఉండి, ఇది చిన్న పువ్వులను కలిగి ఉంటుంది. ఈ పూలను ఔషధంగా ఉపయోగిస్తారు. మధుమేహాన్ని నయం చేస్తుంది.. పనీర్ పువ్వు ఓ మూలికలా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇది శరీరంలోని ప్యాంక్రియాస్ బీటా కణాలను నయం చేస్తుంది. ప్యాంక్రియాస్ శరీరంలో ఇన్సులిన్ తయారు చేయడానికి పనిచేస్తుంది. బీటా కణాలు దెబ్బతినడం వల్ల ఇన్సులిన్ ఉత్పత్తి ప్రక్రియ మందగిస్తుంది. అటువంటి పరిస్థితిలో పనీర్ పువ్వు బీటా కణాలను నయం చేస్తుంది. నీరు త్రాగిన ఒక గంట తర్వాత మాత్రమే ఆహారం తినండి. రక్తంలో చక్కెర స్థాయి సాధారణంగా ఉంది అనిపించినప్పుడు దీన్ని వినియోగించడం ఆపేయొచ్చు. ఇతర వ్యాధులకు కూడా.. పనీర్ ఫ్లవర్ మధుమేహంతో పాటు అల్జీమర్స్, ఎర్లీ ఫెటీగ్, బ్లడ్ శుద్ధి, ఆస్తమా, నిద్రలేమి, ఊబకాయం, చర్మ సమస్యలు, జలుబు వంటి సమస్యలను కూడా నయం చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. దీనితో పాటు.. ఇది ఫంగల్ ఇన్ఫెక్షన్, వాపు, కాలేయం, గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనాన్ని అందిస్తుంది. అంతేగాకుండా కంటి వాపు, పైల్స్, ఉబ్బసం, పంటి సమస్యలు నుంచి బయటపడటంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. దుష్ప్రభావాలు.. దీని వినియోగం వల్ల ఎలాంటి దుష్పరిణామాలు వాటిల్లినిట్లు నిర్ధారణ కాలేదు. కానీ ఇది అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధంలా పనిచేస్తుంది. కాకపోతే దీన్ని బాలింతలు, గర్భిణి స్త్రీలు, చిన్నారు, వృద్ధులు దీన్ని తీసుకోకపోవటమే మంచిదని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. గమనిక: ఈ కథనం కేవలం అవగాహన కోసం మాత్రమే ఇచ్చాం. దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలనుకుంటే వ్యక్తిగత వైద్యులు, నిపుణుల సలహాల సూచనల మేరకు పాటించటం ఉత్తమం.

నేను సాధించగలను అనే పట్టుదల ఉన్న వారికి
ఏ ఫీల్డ్ అయినా ఒకటే

ఫీల్డ్ మారడం అనేది మంచి నీళ్లు తాగినంత సులభం కాదు.కాస్త అటూ ఇటూ అయితే మూడు చెరువుల నీళ్లు తాగాల్సి ఉంటుంది.'నేను సాధించగలను' అనే పట్టుదల ఉన్న వారికి మాత్రం ఏ ఫీల్డ్ అయినా ఒకటే. అలాంటి ప్రతిభావంతులలో తేజ ఒకరు. ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా పనిచేసిన తేజ ఐటీ రంగంలోకి అడుగుపెట్టి టెక్ లీడర్‌గా మంచి పేరు సంపాదించింది. కర్ణాటకలోని బెల్గాంలో పెరిగిన తేజ మనకమె డాక్టర్ అయిన తండ్రి నుంచి విజ్ఞానప్రపంచానికి సంబంధించిన ఎన్నో విషయాలు తెలుసుకునేది. డిఐవై (డూ ఇట్ యువర్ సెల్ఫ్) పాజెక్ట్స్ చేసేది. కర్ణాటక యూనివర్శిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సు చేసింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ తొలిసారిగా నాన్ మెడికల్ ఏరియాలలో మహిళల కోసం ద్వారాలు తెరుస్తున్న సమయం అది. తన సీనియర్స్ ఎయిర్ ఫోర్స్‌లో చేరిపోయారు. వారిని యూనిఫామ్‌లో చూడడం తేజాకు ఎగ్జయిటింగ్‌గా అనిపించింది. వారి స్ఫూర్తితోనే ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లోకి వచ్చింది. బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెక్నికల్ కాలేజీలోప్రాథమిక శిక్షణ తరువాత మౌంట్ అబూలో పోస్టింగ్ ఇచ్చారు. మౌంట్ అబూ స్టేషన్‌లోని ఉద్యోగులలో ఇద్దరు మాత్రమే మహిళలు. అందులో తాను ఒకరు. మహిళల కోసం ప్రత్యేక వాష్ రూమ్స్ ఉండేవి కావు. ఇలాంటి సమస్యలు ఎన్ని ఉన్నా ఎప్పుడూ నిరాశపడేది కాదు తేజ,మౌంట్ అబూ తరువాత నాసిక్, బెంగళూరులలో కూడా పనిచేసింది. మన దేశాన్ని ఐటీ బూమ్ తాకిన సమయం అది.ఐటీ ఫీల్డ్‌లో ఉన్న సోదరుడు తేజాతో ఆ రంగానికి సంబంధించి ఎన్నో విషయాలు పంచుకునేవాడు. దీంతో ఐటీ రంగంపై తనకు ఆసక్తి పెరిగింది. అలా ఎయిర్ ఫోర్స్‌ను వదిలి ఐటీ రంగంలోకి అడుగు పెట్టింది. టీసీఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్)లో డెవలపర్‌గా చేరింది. ఫ్రెషర్‌గా ఐటీ రంగంలో కెరీర్ మొదలు పెట్టిన తేజ అక్కడ ఎన్నో విషయాలు నేర్చుకుంది. ఆ తరువాత టెక్నాలజీస్‌లో పనిచేసింది. 2005లో డెల్ టెక్నాలజీలో మేనేజర్‌గా చేరింది. ఒక్కోమెట్టు ఎక్కుతూ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (ఐటీ) స్థాయికి చేరింది. జెండర్ స్టీరియో టైప్స్‌ను బ్రేక్ చేస్తూ డెల్ ఐటీ%-- %ఇండియాలో కీలక స్థానంలో చేరిన తొలి మహిళగా గుర్తింపు ?పోందింది.డెల్ ఫౌండేషన్‌లో సేల్స్ అండ్ మార్కెటింగ్, సప్లై చైన్, డేటా సైన్స్... మొదలైన విభాగాల్లో పట్టు సాధించింది. సీఎస్ఆర్ యాక్టివిటీస్‌పై బాగా ఆసక్తి చూపేది. 'టెక్నాలజీ సహాయంతో ఎన్నో మంచిపనులు చేయవచ్చు' అంటున్న తేజ రకరకాల స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఎన్నో మంచి కార్యక్రమాలు చేసింది. కోవిడ్ మహమ్మారి సమయంలో బుద్ధ ఫౌండేషన్‌తో కలిసి వలస కార్మికులకు పునరావాసం కల్పించింది.'ప్రతి మహిళకు ఒక రోల్‌మోడల్, మెంటర్ ఉండాలి. అప్పుడే ఎన్నో విజయాలు సాధించగలరు' అంటున్న తేజ డెల్‌లో 'మెంటర్ సర్కిల్ కాన్సెప్ట్'ను అమలు చేసింది. ప్రతి సర్కిల్‌లో కొందరు మహిళలు ఉంటారు. వారికో మెంటర్ ఉంటారు. ఈ సర్కిల్‌లో తమ సమస్యలను చర్చించుకోవచ్చు, సలహాలు తీసుకోవచ్చు. ఒకరికొకరు సహాయంగా నిలవచ్చు. 'ఇంజినీరింగ్ కాలేజీలో క్లాసులో నలుగురు అమ్మాయిలు మాత్రమే ఉండేవాళ్లం. ఇప్పటి పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మా కుటుంబంలో నేను ఫస్ట్ ఉమెన్ ఇంజనీర్‌ని. ఇప్పుడు ఎంతోమంది ఉన్నారు. ఒక ముక్కలో చెపాలంటే సమాజంలో చాలా మార్పు వచ్చింది. ఇది ఆహ్వానించదగిన మార్పు. నేను నేర్చుకున్న విషయాల ద్వారా ఇతరులకు ఏ రకంగా సహాయం చేయగలను అని ఎప్పటికప్పుడు ఆలోచిస్తుంటాను. టైమ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఎన్నో సమావేశాలు నిర్వహించాను' అంటుంది తేజ.

పవన్ వ్యూహాత్మక మౌనమేనా

తిరుపతి, అక్టోబరు 26 : హింసాత్మక సంఘటనలపై ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం నష్టంగానే చూడాలి. నేరుగా బహిరంగంగా తీవ్రస్థాయి లో స్పందించకపోవడంపై రాజకీయ వర్గాల్లో విభిన్న విశ్లేషణలు సాగుతున్నాయి. ఈ మౌనం ఆయనకు రాజకీయంగా నష్టమా లేదా అనేది విశ్లేషకులు మరియు ప్రత్యర్థుల కోణాల్లో భిన్నంగా ఉంది. అయితే, కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేస్తూ, వైసీపీ హింసను ప్రేరేపిస్తోందని అధికారికంగా ఆరోపించారు. కానీ జరుగుతున్న పరిణామాలపై ఆయన నేరుగా స్పందించలేదు. ఏ చిన్న ఘటన జరిగినా వెంటనే స్పందించే జనసేనాని ఇంత జరుగుతున్నా స్పందించకపోవడం ఏంటన్న ప్రశ్న తలెత్తుతుంది. భవిష్యత్ లో ఏదైనా జరిగినా పవన్ కళ్యాణ్ స్పందించినా ఆయన మాటలకు విలువ ఉండకపోవచ్చన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.పవన్ కళ్యాణ్ కు ఇతర ఏ పార్టీల రాజకీయ పార్టీల అధినేతలకు లేని క్లీన్ ఇమేజ్ ఉంది. అది ఆయన సొంతం. నిజాయితీగా రాజకీయం చేస్తారని నమ్ముతారు. అలాగే ప్రశ్నించడం కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పే పవన్ కళ్యాణ్ ఈ ఘటనలపై కనీసం స్పందించకపోవడాన్ని పలువురు రాజకీయ విశ్లేషకులు కూడా తప్పుపడుతున్నారు. కూటమిలో భాగస్వామిగా ఉండకపోవడంతో స్పందించడం లేదని సర్ది చెప్పుకోవచ్చు. కానీ సామాన్యులలో మాత్రం జరుగుతున్న ఘటనల్లో పవన్ కళ్యాణ్ కు కొంత షేరింగ్ తగులుకుంటుందేమోనన్న ఆందోళన జనసైనికుల్లోనూ, పవన్ అభిమానుల్లోనూ వ్యక్తమవుతుంది. వారి ఆందోళనలకు కారణమదే. జనసైనికులు నేరుగా తమ ఆందోళనలను, అసమ్మతిని సోషల్ మీడియాలో చెబుతున్నా పవన్ కళ్యాణ్ కనీసం పట్టించుకోకపోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలోనూ శాంతి భద్రతల సమస్యపై బహిరంగంగానే తన అసంతృప్తిని పవన్ కళ్యాణ్ వ్యక్తం చేసిన విషయాన్ని పార్టీకి చెందిన నాయకులే గుర్తు చేస్తున్నారు. అధికార కూటమిలో ఉపముఖ్యమంత్రిగా కీలక పాత్ర పోషిస్తున్న పవన్ కళ్యాణ్, రాష్ట్రంలో ప్రధానంగా పులివెందుల, పుంగనూరు, రాజంపేట వంటి ప్రాంతాల్లో జరిగిన హింసపై ప్రత్యేకంగా గళం విప్పకపోవడం ఆయన ఇమేజ్‌కు మైనస్ అవుతుందని వైసీపీ వంటి ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హింసను, దౌర్జన్యాలను తీవ్రంగా వ్యతిరేకించిన పవన్, ఇప్పుడు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జరుగుతున్న గొడవలపై ఎందుకు దూకుడుగా స్పందించడం లేదనే ప్రశ్నలను సోషల్ మీడియాలో కొందరు లేవనెత్తుతున్నారు. పవన్ కళ్యాణ్ ఒంటరిగా కాకుండా కూటమి పరంగా ఉమ్మడి వ్యూహంతో ముందుకు వెళ్తున్నారంటున్నారు. అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇటు పవన్ కళ్యాణ్ సంయుక్తంగా స్పందిస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడానికి వైసీపీ కుట్రలు చేస్తోందని, కోర్టుల్లో పిటిషన్లు వేస్తూ హింసను ప్రేరేపిస్తోందని విమర్శించారు.రాజకీయంగా ప్రత్యర్థులు దీనిని పవన్ కళ్యాణ్ "మౌనం"గా చిత్రీకరిస్తూ విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, కూటమి పరంగా చూస్తే ఇది ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చంద్రబాబు-పవన్ అనుసరిస్తున్న ఉమ్మడి వ్యూహాత్మక అడుగుగా రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. ఎన్నికల సంఘం కొన్ని పట్టణాల్లో ఎన్నికలను వాయిదా వేసిన నిర్ణయాన్ని కూడా వారు గౌరవిస్తూ ఉమ్మడి ప్రకటన చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు

జగన్ ట్రాప్‌లో టీడీపీ...

నెల్లూరు, అక్టోబరు 26 : ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల వేళ జగన్ ట్రాప్ లో టీడీపీ పడినట్లే కనిపిస్తుంది. జాతీయ స్థాయిలో నామినేషన్ల కేంద్రాల వద్ద జరిగిన చర్చనీయాంశమైంది. జాతీయ మీడియాతో పాటు సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెర్స్ కూడా ఈ ఘటనపై టీడీపీకి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఎన్డీఏ కూటమిలో టీడీపీ ఉండటంతో జాతీయ స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలు, నామినేషన్ల చించివేత ఘటనలు నేషనల్ లెవెల్ లో హైలెట్ గా నిలిచాయని చెప్పాలి. జగన్ కోరుకున్నదిదే. జగన్ అనుకున్నదిదే. అందుకే జగన్ తన అభ్యర్థులను బరిలోకి దింపాలని పార్టీ నేతలకు తెలిపారు. ఈ ఘటనలతో టీడీపీతో పాటు కూటమిలో ఉన్న బీజేపీ వైపు కూడా కొందరు దోషిగా చూడటం మొదలు పెట్టారు. ఇది జగన్ కు ప్లస్ కాగా, టీడీపీకి మైనస్ గా మారింది. బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా ఈ ఘటనలతో కొంత ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు. జగన్ వేసిన ట్రాప్ లు సునాయాసంగా టీడీపీ పడిపోయిందన్న రాజకీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పర్వంలో చోటుచేసుకున్న ఘర్షణలు, రాజకీయ వ్యూహాల వల్ల ప్రస్తుతం ఈ అంశం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. జగన్ మోహన్ రెడ్డి వ్యూహాత్మకంగా వేసిన ట్రాప్‌లో టీడీపీ పడిందా లేదా అనేది రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు వైసీపీ నేతలను ముందస్తు అరెస్ట్ లు చేయడం, నామినేషన్ల కేంద్రాల్లోకి చొరబడి ప్రత్యర్థుల నామినేషన్ పత్రాలను చింపివేయడం, వాహనాల దగ్ధం, పోలీసు కాల్పులు, రాళ్ల దాడులు వంటివి జాతీయ స్థాయిలో హైలెట్ అయ్యాయి. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో తమ అభ్యర్థులపై దాడులు జరుగుతున్నాయని, గడువు పొడిగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ఇందులో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించి, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించడంతో ఈ వ్యవహారం జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించింది. ఆంధ్రప్రదేశ్ లో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, కేంద్ర బలగాలను రంగంలోకి దించాలని లేదా రాష్ట్రపతి పాలన విధించాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ స్థాయిలో డిమాండ్ చేయడం వల్ల ఈ రగడ నేషనల్ ఫోకస్ అయింది. పుంగనూరు, కడప వంటి ప్రాంతాల్లో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, అవినాష్ రెడ్డి కాన్వాయ్‌లపై దాడులు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ ఎంపీలు రాష్ట్రపతికి, లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదులు చేశారు. అంతే కాదు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేసేందుకు వస్తున్న మహిళలను అడ్డుకోవడం, వారిపై దాడులు చేయడం కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటుండటంతో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో హైలెట్ అయింది. ఏపీలో ఎప్పుడూ లేనిది ఇలా జరుగుతుందేమిటంటూ కొందరు ఆరా తీస్తున్నారు. తప్పు ఎవరిది? ఎవరు ఎవరిపై దాడులు చేశారన్నది పక్కన పెడితే అధికారంలో ఉన్నది మాత్రం టీడీపీనే. అందుకే ఖచ్చితంగా శాంతిభద్రతల సమస్య అనేది ప్రభుత్వం మెడకు చుట్టుకునే ప్రమాదం ఉందని చెబుతున్నారు. జగన్ ఇంత దూరం ఆలోచించి తన అభ్యర్థులను బరిలోకి దింపారా? లేదా? అన్నది తెలియదు కానీ, జగన్ ట్రాప్ లో మాత్రం టీడీపీ పడినట్లేనని చాలా మంది భావిస్తున్నారు.

290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు..

రేవంత్ రెడ్డి స్పందన

మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా

రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు వినియోగించుకుంటున్న పథకం

ఈ పథకం మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అన్న సీఎం హైదరాబాద్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఓ కీలక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు ఇప్పటివరకు ఏకంగా రూ.10,000 కోట్లకు పైగా ఆదా చేసుకున్నారని టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి సుమారు 28 నెలల్లో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. దీనివల్ల టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. మహిళల నుంచి వస్తున్న భారీ స్పందనతో మొత్తం ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి 98 శాతానికి చేరడం విశేషం. తాము అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ పథకాన్ని ప్రారంభించామని ప్రభుత్వం పలు సందర్భాల్లో గుర్తుచేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ... మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణం మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని, వారు విద్య, ఉపాధి, ఇతర అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించగలుగుతున్నారని తెలిపారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు టీజీఎస్ఆర్టీసీ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

జెడ్పీ ఎన్నికల్లో వారసులొస్తున్నారు...

విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా పరిషత్ ఎన్నికలు రాజకీయ వారసులకు వేదికగా మారుతున్నాయి. భవిష్యత్తులో ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎదగాలని ఆశిస్తున్న పలువురు నేతల కుటుంబ సభ్యులు జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రాజకీయాల్లో కీలక పదవులు చేపట్టిన నాయకులు తమ కుటుంబ సభ్యులను ఎన్నికల బరిలోకి దింపడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా అధికార కూటమి పార్టీల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తుండటంతో, ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న ద్వితీయ శ్రేణి నాయకుల్లో అసంతృప్తి పెరుగుతోందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోందిజిల్లా పరిషత్ అధ్యక్ష పదవిని భవిష్యత్తు రాజకీయాలకు పునాదిగా భావిస్తున్న పలువురు నేతలు తమ కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని ప్రయత్నిస్తున్నారు. మరోవైపు వైసీపీలోనూ పలువురు నాయకుల వారసులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే పార్టీ ఉనికిని కాపాడుకోవడం, స్థానికంగా తమ బలాన్ని నిలబెట్టుకోవడం కూడా ఈ పోటీ వెనుక కారణాలుగా విశ్లేషణలు వినిపిస్తున్నాయి.ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లాలో జడ్పీ అధ్యక్ష పదవిపై ఆసక్తికరమైన పోటీ కనిపిస్తోంది. సీనియర్ నేత, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోడలితోపాటు, మాజీ జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కుమార్తె చంద్రకళ నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీకి చెందిన మాజీ మంత్రి బొత్స కుటుంబ సభ్యులు కూడా నామినేషన్లు వేయడంతో పోటీపై ఉత్కంఠ నెలకొంది.అనకాపల్లిజిల్లాలోనూ కుటుంబ రాజకీయాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు భార్య అరుణ, కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ భార్య సత్యవతి, జనసేన నేత సుందరపు సతీష్ భార్య జడ్పీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కుమార్తె తేజశ్వి కూడా నామినేషన్ వేశారు.గోదావరి జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గొల్లపల్లి అమూల్య పోటీలో ఉండగా, కాకినాడలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పేరు తెరపైకి వచ్చింది. పశ్చిమగోదావరి జిల్లాలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ కుమారుడు పితాని వెంకట్, ఏలూరులో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్య, మాజీ ఎంపీ మాగంటి బాబు సతీమణి పద్మావతి పోటీకి సిద్ధమయ్యారు.రాయలసీమలోనూ వారసుల సందడి పెరిగింది. సత్యసాయి జిల్లాలో పరిటాల శ్రీరామ్, నంద్యాల జిల్లాలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సోదరుడు రాజారెడ్డి, కర్నూలులో కేఈ ప్రభాకర్ కుమారుడు రుద్రఫణి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ పరిణామాలతో పార్టీ కోసం చాలాకాలంగా పనిచేస్తున్న నాయకుల్లో తమకు అవకాశాలు తగ్గిపోతాయనే ఆందోళన నెలకొంది. కొత్త పదవులు వస్తాయని ఆశించిన వారికి కుటుంబ రాజకీయాలు అడ్డంకిగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నేతలు తమ జిల్లాల్లో రాజకీయ పట్టు నిలబెట్టుకోవడానికి వారసులను ముందుకు తీసుకొస్తుండగా, మరికొందరు భవిష్యత్తులో మంత్రి పదవులు పొందేందుకు పార్టీ నాయకత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహంలో ఉన్నారని చర్చ సాగుతోంది. అయితే చివరకు ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆయా పార్టీల అధిష్టానాల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది

స్థానిక సంస్థల ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలి

టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి, అక్టోబర్ 26 : స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని పార్టీ అగ్రనేతలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో లభించిన అద్భుత విజయం తర్వాత.. ఇచ్చిన హామీలను నెరవే?రుస్తూ వస్తున్నామని అన్నారు. అందుకే 'చెప్పాం-చేస్తున్నాం' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. సోమవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలపై వారికి దిశానిర్దేశం చేశారు.మిత్రధర్మాన్ని పాటించి తీరాల్సిందేనని.. అందులో ఎలాంటి వెసులుబాటూ లేదని ఈ సందర్భంగా వారికి సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. 2024 తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల వేళ ప్రచారానికి ప్రజల వద్దకు వెళ్తున్నామని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్రం, స్థానికంగా.. ఇలా మూడు స్థాయిల్లోనూ ఒకే ప్రభుత్వం ఉంటే కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని సోదాహరణతో వివరించారు. అగ్రనేతలు మొదలుకుని.. కార్యకర్త వరకు చేసే పనిని రికార్డ్ చేస్తున్నామని తెలిపారు. పొత్తులు, రిజర్వేషన్ల కారణంతోపాటు సోషల్ రీ-ఇంజనీరింగ్‌లో భాగంగా కొంత మందికి అవకాశాలు దక్కలేదని వివరించారు. రాష్ట్రం, పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపునిస్తామని.. వారిని నామినేటెడ్ పదవులతో గౌరవిస్తామని చెప్పారు.కూటమి అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి వర్గానికీ.. ప్రతి ప్రాంతానికీ లబ్ధి చేకూర్చేలా పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. రికార్డులు సృష్టించేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక చేపట్టిన మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉందని వారికి వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేశామని.. చిన్న కులాలకు కూడా ప్రాధాన్యతనిచ్చామని సీఎం చంద్రబాబు చెప్పారు. పాలనలో తామూ భాగస్వాములమనే సంతృప్తి ప్రతి ఒక్క వర్గానికి కలగాలని అన్నారు. ప్రభుత్వానికి.. ప్రజలకు కూటమి పార్టీల కార్యకర్తలే వారధిగా నిలవాలని స్పష్టం చేశారు. కూటమి పార్టీలు చక్కటి సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పని చేయాలని ఆదేశించారు.

పెద్దగార్లపాడులో హత్య కేసు ఛేదన..

ముగ్గురు నిందితుల అరెస్ట్

హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం..

మృతదేహాన్ని తరలించిన బైక్ స్వాధీనం

పల్నాడు : దాచేపల్లి: పెద్దగార్లపాడు గ్రామంలో జరిగిన షేక్ సైదా హత్య కేసును దాచేపల్లి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని చెట్టుకు ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దగార్లపాడు గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ బుడే కుమారుడు షేక్ సైదా (30) ఈ నెల 19, 20 తేదీల మధ్య రాత్రి హత్యకు గురయ్యాడు. ఏ-1 కర్పూరపు మాణికంఠ అలియాస్ బాబు చెల్లితో సైదాకు వివాహేతర సంబంధం ఉండటంతో గతంలో ఇరువర్గాల మధ్య వివాదాలు జరిగినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు, సైదా భార్య షేక్ అస్మా మృతిచెందిన ఘటనకు సంబంధించి సైదాపై అనుమానం ఉండటంతో ఏ-2 షేక్ నాగూర్ వలి అతడిపై కక్ష పెంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఏ-1 కర్పూరపు మాణికంఠ అలియాస్ బాబు, ఏ-2 షేక్ నాగూర్ వలి, ఏ-3 షేక్ ముస్తఫా కలిసి అక్టోబర్ 19, 20 తేదీల మధ్య రాత్రి పెద్దగార్లపాడు గ్రామంలోని అంకాళమ్మ దేవాలయం సమీపంలో సైదాపై దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.అనంతరం మృతదేహాన్ని మోటార్‌సైకిల్‌పై మారసు సుబ్బారావుకు చెందిన పత్తి పొలానికి తరలించి, అక్కడ చెట్టుకు ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో గుర్తించారు.మృతుడి తండ్రి షేక్ హుస్సేన్ బుడే అక్టోబర్ 20న దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, తొలుత అనుమానాస్పద మృతిగా క్రైమ్ నంబర్ 209/2026 కింద ఃఔూ సెక్షన్ 194 ప్రకారం కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు కేసును హత్య కేసుగా మార్చి ఃఔూ సెక్షన్లు 103(1), 61(2), 238 రెడ్‌విత్ 3(5) కింద నమోదు చేశారు.

తిరుమలలో సగానికి తగ్గిన నీటి నిల్వలు

తిరుమల అక్టోబరు 26 : తిరుమలలో నీటి అవసరాలను తీర్చేందుకు పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార జలాశయాలు ఉన్నాయి. ఈ ఐదు రిజర్వాయర్లలో కలిపి 21.60 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగించగా.. 40.08 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా నిల్వ ఉందని టీటీడీ తెలిపింది. దీంతో తిరుమల ముఖ్యమైన ఐదు జలాశయాల్లో 61.68 లక్షల గ్యాలన్ల నీటి పెరుగుదల ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోంది.. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో నీళ్ల సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందంటున్నారు. తిరుమల నీటి అవసరాల కోసం కొన్ని జలాశయాలు ఉన్నాయి.. తిరుమలలో పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార జలాశయాలు ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి.. వీటిలో నీటిమట్టం గురించి టీటీడీ స్పష్టత ఇచ్చింది. తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల్లో శుక్రవారం వరకు మొత్తం 61.68 లక్షల గ్యాలన్ల నీటి మట్టం పెరిగిందని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఐదు జలాశయాల్లో కలిపి 21.60 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగించగా, 40.08 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా నిల్వ ఉందని తెలిపారు.పాపవినాశనం డ్యామ్ నిల్వ సామర్థ్యం 5,240.00 లక్షల గ్యాలన్లు కాగా.. అంతకముందు 2,667.39 లక్షల గ్యాలన్లు ఉంటే.. ప్రస్తుత నిల్వ 2,688.35 లక్షల గ్యాలన్లకు పెరిగింది.. పెరిగిన నీరు 20.96 లక్షల గ్యాలన్లుగా ఉంది. వినియోగం 14.10 లక్షల గ్యాలన్లు ఉంది.. మిగులు నీరు 6.86 లక్షల గ్యాలన్లుగా ఉంది. గోగర్భం డ్యామ్ నిల్వ సామర్థ్యం 2,833.10 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 499.06 లక్షల గ్యాలన్లు ఉన్నాయి.. ప్రస్తుత నిల్వ 508.31 లక్షల గ్యాలన్లుగా ఉంది.. పెరిగిన నీరు 9.25 లక్షల గ్యాలన్లు కాగా, వినియోగం 7.50 లక్షల గ్యాలన్లుగా ఉంది.. మిగులు నీరు 1.75 లక్షల గ్యాలన్లు.ఆకాశగంగ డ్యామ్‌లో నిల్వ సామర్థ్యం 685.00 లక్షల గ్యాలన్లు ఉంటే.. గత రోజు నిల్వ 24.07 లక్షల గ్యాలన్లుగా ఉందని తెలిపారు. ప్రస్తుత నిల్వ 30.40 లక్షల గ్యాలన్లు కాగా.. పెరిగిన నీరు 6.33 లక్షల గ్యాలన్లు.. వినియోగం 0.00 లక్షల గ్యాలన్లు.. మిగులు నీరు 6.33 లక్షల గ్యాలన్లుగా ఉంది. కుమారధార డ్యామ్ నిల్వ సామర్థ్యం 4,259.01 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 338.84 లక్షల గ్యాలన్లుగా ఉంది. ప్రస్తుత నిల్వ 363.98 లక్షల గ్యాలన్లు కాగా.. పెరిగిన నీరు 25.14 లక్షల గ్యాలన్లుగా ఉంది. వినియోగం 0 గ్యాలన్లు కాగా.. మిగులు నీరు 25.14 లక్షల గ్యాలన్లుగా ఉంది. పసుపుధార డ్యామ్ నిల్వ సామర్థ్యం 1,287.54 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 24.38 లక్షల గ్యాలన్లుగా ఉంది. ప్రస్తుత నిల్వ 24.38 లక్షల గ్యాలన్లు కాగా.. నీరు పెరగలేదు.. వినియోగం లేదు, మిగులు నీరు 0 గ్యాలన్లుగా ఉంది.మొత్తంగా ఐదు జలాశయాల్లో 61.68 లక్షల గ్యాలన్ల నీరు పెరగ్గా, 21.60 లక్షల గ్యాలన్ల నీరు వినియోగమైంది. ప్రస్తుతం 40.08 లక్షల గ్యాలన్ల నీరు మిగులుగా ఉంది. ఆకాశగంగ డ్యామ్ పరిధిలో 8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సమయంలో 7.02 లక్షల గ్యాలన్లు, నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో 148.48 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా చేరింది. అక్టోబర్ 23వ తేదీ వరకు మొత్తం 244.46 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా చేరిందని టీటీడీ తెలిపింది.

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 40వ వార్షికోత్సవం..

సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

రూబీ జూబ్లీ జరుపుకుంటున్న సిబ్బంది, విద్యార్థులకు అభినందనలు

వైద్యం వృత్తి కాదు, ప్రాణాలు కాపాడే పవిత్ర బాధ్యత అని వ్యాఖ్య

సాంకేతికతకు మానవత్వం తోడైతే వైద్యానికి మరింత విలువ అని పేర్కొన్న సీఎం

వర్సిటీ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్ష డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవం (రూబీ జూబ్లీ) సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భంలో విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులు, పరిశోధకులు, సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. దివంగత ఎన్టీ రామారావు గారి సంకల్పంతో ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం నాలుగు దశాబ్దాలుగా వైద్య విద్య, పరిశోధన, ప్రజారోగ్య రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. నాణ్యమైన విద్య ద్వారా సమాజానికి నిబద్ధత కలిగిన వైద్యులను అందించడం గర్వకారణమని అన్నారు. "వైద్యం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు, ప్రాణాలను కాపాడే పవిత్రమైన బాధ్యత. సాంకేతికత వైద్యానికి శక్తిని ఇస్తే, మానవత్వం దానికి మరింత విలువను చేకూరుస్తుంది" అని ముఖ్యమంత్రి తన సందేశంలో పేర్కొన్నారు. 40 ఏళ్ల వైద్య సేవా స్ఫూర్తితో ఈ విశ్వవిద్యాలయం భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

రైతులకు అండగా రోటరీ క్లబ్..

బాలికలకు ఉచిత సైకిళ్ల పంపిణీకి నిర్ణయం

మహబూబాబాద్, సేవా కార్యక్రమాలతో సమాజాభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యంగా మహబూబాబాద్ రోటరీ క్లబ్ ముందడుగు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ఆరోగ్య శిబిరాల నిర్వహణతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయాలని క్లబ్ సమావేశంలో నిర్ణయించారు. ఇదే సమావేశంలో రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరికరాలను రూపొందిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కంబాలపల్లి గ్రామానికి చెందిన షణ్ముఖాచారిని ఘనంగా సన్మానించారు.రోటరీ క్లబ్ సమావేశంలో ఈ ఏడాది చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసేందుకు ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించారు.

అద్భుత చిత్రరాజం..ఆదిత్య 369

అప్పట్లో ఆదిత్య-369 అద్భుత విజయం సాధించింది. అంతేకాదు మంచి సినిమాగా నిలిచింది. దర్శకుడు సింగీతం ఖాతాలో హిట్ పడింది. ఆయన ప్రతిభన్ మరోమరాఉ చాటింది. ఈ సినిమా గురించి ... ఇదేం నేపథ్యంఅని అప్పట్లో చాలామంది సందేహించారు. సినిమా విడుదలై, ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యపోయారు. దాదాపు 34 ఏళ్ల క్రితం తెరకెక్కిన ఈ సినిమా అధునాతన సాంకేతిక విలువలతో ఈ నెల 4న రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు నాటి విశేషాలు పంచుకున్నారు. హాలీవుడ్ మూవీ 'బ్యాక్ టు- ది ఫ్యూచర్' స్ఫూర్తితో 'ఆదిత్య 369' తీశానని అనడాన్ని తిప్పికొట్టారు. ది టైమ్ మిషన్' నవలను తాను కాలేజీ రోజుల్లోనే చదివానని, అందులోని ఆసక్తికర అంశాల గురించి స్నేహితులతో చర్చించేవాడిని. డైరెక్టర్‌ని అయిన తర్వాత ఆ కాన్సెప్టుతో సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. ఓ సారి విమాన ప్రయాణం చేస్తుండగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో నా ఆలోచన చెప్పా. ఎంతో ఉత్సాహం చూపిన ఆయన 'ఐడియా బాగుంది. తప్పకుండా చేద్దాం' అని అన్నారు. ఇద్దరు ముగ్గురు ప్రముఖ నిర్మాతలకు ఆయనే ఈ కథ వినిపించారు. కానీ, వారికి సైన్స్ ఫిక్షన్ కాన్సెప్టు అర్థం కాలేదు. ఇదేదో ఫాంటసీ సినిమా అనుకున్నారు. కథపై నమ్మకం ఉన్న ఎస్పీబీ పట్టు వదలకుండా.. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌ను సంప్రదించారు. ఆయనకు బాగా నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. హీరో పాత్రకు ముందు నుంచీ బాలకృష్ణనే అనుకున్నాం. స్టోరీ విన్న వెంటనే ఆయన నటించేందుకు అంగీకరించారు. హీరోయిన్‌గా విజయశాంతి బాగుంటుందని కృష్ణప్రసాద్, బాలకృష్ణ అనుకున్నారు. డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో ఆమె నటించలేకపోయారు. ఓ దర్శకుడు మోహిని గురించి చెప్పగా.. ఆడిషన్ చేసి కథానాయికగా ఆమెను ఎంపిక చేశాం. బాలీవుడ్ నటుడు టీనూఆనంద్‌ను ప్రొఫెసర్ పాత్రకు తీసుకున్నామని అన్నారు. టైటిల్ విషయంలో కృష్ణప్రసాద్ ఏమైనా అనుకుని ఉండొచ్చుగానీ నేను ముందు నుంచీ 'ఆదిత్య' పేరునే ఫిక్స్ అయ్యా. అలా 'ఆదిత్య 369' అయిందని సింగీతం వివరించారు.

ఆలియా భట్‌తో పోల్చకండి ప్లీజ్....

నటి షాలినీ పాండే వెల్లడి

బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై తనకు ఏమాత్రం నచ్చలేదని నటి షాలినీ పాండే అన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఓఇంటర్వ్యూలో చెప్పారు. ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటానని అన్నారు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం అని షాలినీ పాండే తెలిపారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సినిమాలు, సిరీస్‌లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్‌సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

చిరంజీవితో వినూత్నంగా వీడియో

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం మెగా 157-వర్కింగ్ -టైటిల్ ఉగాది నాడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన విషయం తెలిసిందే. చిరంజీవి కెరీర్‌లోని ఐకానిక్ పాత్రలనూ, చిత్రబృందాన్ని పరిచయం చేస్తూ వినూత్నమైన వీడియోను మంగళవారం అనిల్ రావిపూడి విడుదల చేశారు. వీడియో ప్రారంభంలో దర్శకత్వ విభాగం సభ్యులు చిరంజీవి పంచబోయే వినోదాన్ని చూసేందుకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు.

రెండో సినిమా ప్రకటించిన నీహారిక

సంగీత్ శోభన్‌తో తదుపరి చిత్రానికి రెడీ

మెగా బ్రదర్ నాగబాబు ముద్దుల తనయ నిహారిక యాంకర్‌గా, హీరోయిన్‌గా,నిర్మాతగా టాలీవుడ్ ఇండస్ట్రీలో సత్తా చాటుతుంది. హీరోయిన్‌గా నిహారిక చేసిన సినిమా ఒక్కటి హిట్ కాలేదు. దాంతో నిర్మాత అవతారం ఎత్తింది. నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు సినిమా సంచలన విజయం సాధించింది. ముందుగా హీరోయిన్ గా, తర్వాత వెబ్ సిరీస్ ల్లో నటించిందికానీ చివరకు నిర్మాతగా స్థిరపడింది. నిహారిక ఇటీవలే చిరంజీవి విశ్వంభర చిత్రంలోని ఓ పాటలో షూటింగ్ లో పాల్గొంది. ఈ పాటలో సాయిధరమ్ తేజ్ కూడా పాల్గొన్నారు. నటిగా మంచి మార్కులు దక్కించుకోలేకపోయిన నిహారిక నిర్మాతగా సత్తా చాటుతుంది. కొత్త డైరెక్టర్, కొత్త నటీనటులతో చిన్న సినిమాగా వచ్చిన కమిటీ- కుర్రోళ్లు చిత్రం 50 కోట్ల వసూళ్లు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమాతో పలకరించబోతుంది. తన రెండు సినిమాని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో ఫుల్ ఫామ్ లో ఉన్న నటుడు సంగీత్ శోభన్ హీరోగా నటించబోతున్నాడు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ సినిమాలతో పాటు- ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ, 3 రోజెస్.. పలు సిరీస్ లతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న సంగీత్ ఇందులో మెయిన్ లీడ్ పోషించబోతున్నాడు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ ఇద్దరు గతంలో నిహారికతో కలిసి పని చేశారు. నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్సులో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగం అయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా పని చేశారు. 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో సంగత్ శోభన్ ప్రధాన పాత్ర పోషించారు. ఇక సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి మానస శర్మ దర్శకురాలిగా పని చేశారు. గతంలో ఈ ముగ్గురు కలిసి అద్భుతాలు చేయగా, ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసేందుకు రెడీ అయ్యారు. ఈ ప్రాజెక్ట్‌కి మానస శర్మ కథను అందించగా మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు

చిరంజీవితో నాని సినిమా

అంచాలను పెంచిన ప్రకటన

నేచురల్ స్టార్ నాని ఇప్పుడు హీరోగా కన్నా నిర్మాతగానే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కారణం ఆయన చేసే ప్రతి సినిమా కూడా సూపర్ హిట్ అవుతుంది. రీసెంట్‌గా కోర్ట్ అనే సినిమాతో పెద్ద విజయం సాధించారు. ఈ క్రమంలో నాని అంటే మంచి సినిమాలు చేస్తాడని ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు, కూడా ఫిక్స్ అయ్యారు. ప్రస్తుతం నాని శైలేష్ కొలను దర్శకత్వంలో సొంత బ్యానర్ లో హిట్3 సినిమా చేస్తున్నాడు. అలానే ది ప్యారడైజ్ అనే చిత్రంలోను నటిస్తున్నాడు. అయితే రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాని తన ఫ్యూచర్ ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. త్వరలో దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో చిరంజీవి ఓ ప్రాజెక్ట్ చేయనుండగా, దీనికి నాని సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు బాగా ఉన్నాయి. అందుకు కారణం ఈసారి మళ్లీ రక్తం పారాల్సిందే అంటూ శ్రీకాంత్ చాలా వయొలెంట్ సినిమా చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీని గురించి తాజా ఇంటర్వ్యూలో నాని మాట్లాడుతూ.. చిరంజీవి గారు అనగానే డ్యాన్స్, యాక్షన్ అని మనం ఒక అభిప్రాయానికి వచ్చేశాం..కానీ ఆయన అంతుకుమించి.. చిరంజీవి కేవలం అది మాత్రమే కాదు.. ఆయన్ని ప్రతి ఫ్యామిలీలో ఒక మెంబర్‌గా భావిస్తాం.. కానీ ఆ విషయాన్ని మనం మర్చిపోయి వేరే దేనిపైన ఫోకస్ చేస్తున్నాం. ఇప్పుడు శ్రీకాంత్ మ్యాడ్‌నెస్‌ని చిరంజీవి గారి సినిమా అంటే అది చాలా సూపర్ కాంబో.. అసలు నా లైఫ్‌లో చిరంజీవి గారి లాంటి స్థాయి వ్యక్తిని పెట్టి నేను ఓ సినిమా తీస్తానని ఎప్పుడూ ఊహించలేదు.. కానీ అనుకోకుండా ఇది కుదిరింది.. ఇది గొప్ప బాధ్యతగా భావిస్తున్నా.. ఖచ్చితంగా ది బెస్ట్ ఇస్తాం అంటూ నాని కామెంట్స్ చేశారు. ప్రస్తుతం నాని చేసిన కామెంట్స్‌తో మూవీపై అంచనాలు అమాంతం పెరిగాయి. నాని, చిరంజీవికి ఈ ప్రాజెక్ట్ మెమోరబుల్‌గా ఉండడం ఖాయమని అంటున్నారు.. ఈ వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.

నేను ఎవరితో డేటింగ్‌లో లేను : దివ్య భారతి

తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ గాయని సైంధవి విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే జీవీ విడాకులు తీసుకోవడానికి కారణం హీరోయిన్ దివ్య భారతితో ప్రేమలో ఉన్నందుకే అంటూ సోషల్ మీడియాలో పుకార్లు పుట్టుకొచ్చాయి. ఈ వివాదంపై జీవీ ప్రకాశ్‌తో పాటు దివ్యభారతి గతంలోనే స్పందించారు. అయితే ఈ వివాదం ఇంకా ముగియకపోవడంతో తాజాగా ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టింది దివ్యా భారతి. నాకు ఎలాంటి సంబంధం లేని వ్యక్తుల కుటుంబపు విషయాల్లో నా పేరును లాగుతున్నారు. జీవీ ప్రకాశ్ కుటుంబ సమస్యలతో నాకు ఎటువంటి లింక్ లేదు. నేను ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. నేను ఎవరితోనూ డేటింగ్‌లో లేను. ముఖ్యంగా పెళ్లైన వ్యక్తితో డేటింగ్ అసలే చేయను. ఆధారాలు లేకుండా రూమర్స్‌ను పుట్టించొద్దు. ఇప్పటివరకూ ఈ విషయంపై నేను నోరు మెదపలేదు. కానీ, కొన్ని రోజులుగా ఈ రూమర్స్ నా సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఈ గాసిప్‌ల వల్ల నా పేరు చెడిపోతోంది. తప్పుడు వార్తలు సృష్టించడం కంటే సమాజానికి ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టండి. నా వ్యక్తిగత గోప్యతను గౌరవించండి. ఈ విషయంపై ఇదే నా తొలి మరియు చివరి ప్రకటన అని దివ్య భారతి చెప్పుకొచ్చింది. దివ్య భారతి, జీవీ కలిసి బ్యాచిలర్, కింగ్‌స్టన్ మూవీలో నటించారు. ఈ క్రమంలో వీరిద్దరు రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056